# ఇస్లామ్

## ఉగ్రవాదానికి వ్యతిరేకం



Islam Aur Dahshatgardi
(Telugu)

# ఇస్లాం ఉగ్రవాదానికి వ్యతిరేకం

మూలం:

**డాక్టర్ సయ్యద్ అబ్దుల్ బారి**

అనువాదం:

**అబ్దుల్ వాహెద్**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Islam-Ugravaadaaniki Vyatirekam**
Islam Aur Dahshatgardi **(Telugu)**

TIP Series. No. **105**

Written by : Dr. Syed Abdul Bari

Translated by : Abdul Wahed

All Rights Reserved with Publishers

3rd Edition : July 2015

Copies : 2000

**Price** : **Rs.30**

ISBN : 81 - 86826 - 97 - 1

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక


1. తొలిపలుకు ... 4

2. పరిచయం ... 5

3. భారతదేశంలో టెర్రరిజం ... 12

4. హింస, టెర్రరిజం-ఇస్లాం ... 28

5. లజ్జలేని పాశ్చాత్య పోకడ ... 41

6. జిహాద్ - టెర్రరిజం ... 54

7. టెర్రరిజాన్ని కాదు, సదాచార విప్లవాన్ని కోరుతుంది ఇస్లాం ... 64

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# తొలిపలుకు

ఉగ్రవాదాన్ని ఖచ్చితంగా, సమగ్రంగా నిర్వచించడం నేటి వరకు సాధ్యపడలేదు. అయినప్పటికీ టెర్రరిజం ప్రస్తావనలతో నేడు యావత్ప్రపంచం మారు మ్రోగుతోంది. ఈ పుస్తకం 'ఇస్లాం ఉగ్రవాదానికి వ్యతిరేకం' లో డాక్టర్ సయ్యద్ అబ్దుల్ బారి ఈ విషయాన్ని కూలంకషంగా చర్చించారు. భారత చరిత్ర, సంస్కృతులను లోతుగా అధ్యయనం చేసి ఉన్నందువల్ల, ఇస్లాం, ఇతర మతాల గురించి మంచి అవగాహన కలిగి ఉన్నందువల్ల డాక్టర్ సయ్యద్ అబ్దుల్ బారి ఈ పుస్తకంలో విభిన్న కాలాలు, వివిధ సంస్కృతుల పరిశీలన ద్వారా టెర్రరిజం వాస్తవ రూపాన్ని తేటతెల్లం చేయడానికి చక్కటి కృషి చేశారు.

భారతదేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పుస్తకం ఎంతైనా ప్రయోజన కరమైనదనీ, పరిస్థితులకు సరియైన దిశనివ్వడానికి తోడ్పడగలదనీ ఆశిస్తున్నాము.

- ప్రకాశకులు

# పరిచయం

గెరిల్లా యుద్ధం, సాంప్రదాయిక యుద్ధం, విప్లవ పోరాటాలకు భిన్నంగా రాజ్యశక్తితో జరిగే ఒక విధమైన సంఘర్షణ టెర్రరిజం. సాంప్రదాయిక యుద్ధం శత్రువుల సైన్యబలాన్ని, వనరులు, సాధనాలను పూర్తిగా ధ్వంసం చేసే ఉద్దేశ్యంతో జరుగుతుంది. గెరిల్లా యుద్ధంలోనూ, విప్లవ పోరాటాలలోనూ ఒక పరిమితి మేరకు, శారీరక లేదా భౌతిక విధ్వంసం లక్ష్యంగా ఉంటుంది. కాగా, టెర్రరిజం ముఖ్యోద్దేశం శత్రువులో మానసికంగా భయోత్పాతం సృష్టించడం, శత్రువులో ధైర్యం క్షీణించి జావగారిపోయేలా చేయడం. టెర్రరిస్టు లేక ఉగ్రవాది ఏదో ఒక రాజకీయ ప్రయోజనం సాధించే ప్రత్యక్ష ప్రయత్నం చేయడు. అలాకాక, ఉద్దేశించిన లక్ష్యం దిశగా సమకాలీన ప్రజాభిప్రాయాన్ని మలిచే ప్రయత్నం చేస్తాడు. టెర్రరిస్టు పద్ధతుల ద్వారా ప్రజలలో తాము కోరిన మానసిక మార్పును, రాజకీయాభిప్రాయాలను, వైఖరిని రాబట్టడం టెర్రరిజం తక్షణ లక్ష్యంగా ఉంటుంది. ఈ విధంగా చూస్తే టెర్రరిజానికి గెరిల్లా యుద్ధంతో పోలికలు కనబడతాయి. ఉగ్రవాదం చర్యల్లో యుద్ధ నియమాలను పాటించడం జరుగదు. యుద్ధానికి సంబంధించిన అంతర్జాతీయ నియమనిబంధనలకు విరుద్ధంగా హింసా దౌర్జన్యాలు అందులో కొనసాగుతాయి. ఇందులో పాల్గొనే వారు వ్యక్తిగత సైనికులు కాదు. తాత్కాలికంగా ఈ శిబిరంలో చేరిన వారే ఉంటారు. టెర్రరిజానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ నేర స్వభావం కలిగినవే. హింసాదౌర్జన్యాలు, హింసాత్మక బెదిరింపులే ముఖ్యంగా ఉంటాయి. ఒక సంఘటిత ముఠా, దృఢమైన సంకల్పంతో, భయాందోళనల వాతావరణం ఏర్పరిచే కార్యకలాపాలకు పూనుకొని తద్వారా ప్రభుత్వాన్ని అస్థిరత పాలు చేయాలనీ, ప్రజలు దిగ్భ్రాంతికి గురి అయ్యేలా చేయాలనీ ప్రయత్నిస్తుంది. టెర్రరిజం ప్రత్యక్ష ప్రభావం నిరపరాధులు, నిరాయుధులు, ఎలాంటి భద్రతా లేని సాధారణ ప్రజలపై పడుతుంది.

అకస్మాత్తుగా జరిగే హింసాత్మక దాడి టెర్రరిజం. జాతీయ, అంతర్జాతీయ లక్ష్యాలు, ఉద్దేశాలు టెర్రరిజం వెనుక ఉంటాయి. ఒక్కోసారి పరిమితంగా, వ్యక్తిగత ప్రయోజనాల కొరకు ఒక్కోసారి నిర్దిష్ట సిద్ధాంతాలు, నియమాలకు బలం చేకూర్చడానికి, కొన్నిసార్లు ప్రత్యేక లక్ష్యాల కోసం ప్రజాచైతన్యాన్ని జాగృతం చేయడానికి, లేదా అధికారం, సంపదలు హస్తగతం చేసుకొన్న వారిని వేధించడం టెర్రరిజం ఉద్దేశ్యం కావచ్చు. టెర్రరిజానికి కారణాలలో రాజకీయ సిద్ధాంతాలు, జాత్యాహంకార విధానాలూ, జాతితత్వం తదితర నిర్మూలనాత్మక భావనలు ఉన్నాయి.

ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల్లో టెర్రరిజం ఎక్కువగా రాజకీయ లక్ష్యాలకే పెల్లుబికింది. భారతదేశంలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం 1857లో ఆంగ్లేయులతో పోరాడిన వాళ్ళు ప్రతీకారేచ్ఛ వల్ల చివరకు ఆంగ్లేయులలోని ముసలి వారిని, స్త్రీలను పిల్లలను కూడా వదలలేదు. ఈ సంఘటనలను స్వయంగా భారత చరిత్రకారులు కూడా ఖండించారు. దేశ స్వాతంత్ర్యం కొరకు అనేక రహస్య సంస్థలు టెర్రరిస్టు మార్గాన్ని అవలంబించేవి. అవి దేశంలోని విభిన్న ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ కార్యకలాపాలను చురుకుగా నిర్వహించేవి. ఈ సంస్థలు బ్రిటీషు సామ్రాజ్యాన్ని బలప్రయోగం ద్వారా కూలద్రోయాలని భావించేవి. అంతకన్నా ముందు కాలంలో, రాణాప్రతాప్, శివాజీల కార్యకలా పాలను స్వాతంత్ర్య పోరాటంలో భాగాలుగా, సమ్మతించదగ్గ ఉగ్రవాద చర్యలుగా కొందరు చరిత్రకారులు భావించారు. ఏది ఏమైనా, గతంలో పరాయి పాలనకు వ్యతిరేకంగా ఏ దేశంలోనయినా సాయుధ తిరుగుబాటు, హింసా దౌర్జన్యాలతో టెర్రరిజం రూపాన్ని సంతరించుకోవడం జరుగుతూ వచ్చింది. కాని, ప్రస్తుత కాలంలోని టెర్రరిజానికి ఆనాటి సాయుధ తిరుగుబాటుకు మధ్య ఉన్న తేడా ఏమిటంటే నేడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రహస్యంగా హింసాత్మక దాడులు జరుగుతున్నాయి. ఇరవయ్యో శతాబ్దంలో హింసాత్మకతత్వాన్ని నమ్మే సైద్ధాంతిక ఉద్యమాలు, సంఘర్షణ, విప్లవాలకు ప్రజామోదం పొందిన

విధానంగా టెర్రరిజాన్ని ఆయుధంగా ఉపయోగించాయి. కాలక్రమేణా టెర్రరిజం రూపురేఖల్లో అనేక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ఇది విప్లవకారులని చెప్పుకొనే వారి ఆయుధంగా ఉండేది. ప్రత్యేక సిద్ధాంతం లేదా ఆదర్శం కోసం గెరిల్లా పద్ధతులలో జరిగే ప్రయత్నాల రూపంలో బయల్పడేది. ఇండియన్ నేషనల్ సెక్యూరిటీ గార్డ్ యాక్ట్ 1986లో టెర్రరిజాన్ని క్రింది విధంగా వివరించింది.

"చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని భయప్రభావితం చేయడానికి, పడగొట్టడానికి, లేదా ప్రజలను, ప్రజలలో ఒక వర్గంలో భయోత్పాతం సృష్టించడానికి బాంబులు, డైనమైట్లు లేదా మందుగుండ్లు, ప్రేలుడు పదార్థాలు లేదా కాల్పులు జరిపే ఆయుధాలను లేదా మరేయితర మారణాయుధాలను, విషవాయువులను లేదా యితర ప్రమాదకర విధ్వంసకర పదార్థాలను ఉపయోగించడం ద్వారా ఎవరికైనా ప్రాణహాని కలిగించడం, లేదా గాయపరచడం. లేదా సాధనసంపత్తులను ధ్వంసం చేయడం, లేదా నిత్యావసర వస్తువుల పంపిణీని విచ్ఛిన్నం చేయడం- ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తి టెర్రరిస్టు." (Countering Terrorism -D.P. Sarma)

టెర్రరిస్టు బీభత్స వాతావరణాన్ని సృష్టించి ఇతరులు కూడా తనలానే ఆలోచించేలా, తనను అనుసరించేందుకు పురికొలిపేలా ప్రయత్నిస్తాడు. బాబరి మస్జిద్ విధ్వంసానికి ముందు సంఘ్‌పరివార్, టెర్రరిస్టు కార్యకలాపాలనే ప్రభుత్వం పరోక్ష సహాయంతో విజయవంతంగా నిర్వహించింది. చరిత్రకు చెందిన ఒక బూటకపు భావనను వాస్తవంగా మలిచి లక్షలాది ప్రజలను విధ్వంసానికి, కూల్చివేతలకు సమాయత్తపరిచింది. ఇటీవలి కాలంలో టెర్రరిజం నిర్దయ నిర్దాక్షిణ్యాలతో మరింత ప్రమాదకరమైన ఎత్తుగడలను అవలంబించింది. ఇప్పుడు ప్రముఖ పౌరులను హతమార్చే ముందు ప్రజల దృష్టిలో వారిని పరాభవంపాలు చేయడానికి, వారి ప్రతిష్ట దిగజార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వియత్నాంలో వీత్‌కాంగ్ చాలా మందిపై మానభంగం ఆరోపణలు

చేసి మరీ హత్యలు చేయించాడు. ప్రజల మద్దతు పొందడానికి, ప్రజలు తమకు యిష్టం లేకున్నప్పటికీ మద్దతు ఇచ్చేలా చేయడానికి ఇలాంటి ఎత్తుగడలు పాటించడం జరుగుతోంది.

ప్రస్తుత కాలంలో టెర్రరిస్టులు చాలా వరకు ఉన్నత మధ్య తరగతి (Upper Middle Class)కి చెందినవారు. కొందరు ఉన్నత తరగతికి చెందిన సంపన్న కుటుంబాల వారూ ఉన్నారు. సాధారణంగా యవ్వన దశలోని వారే అత్యధికంగా ఇందులోకి వస్తారు. నిరాశా నిస్పృహలకు గురయిన యువకులు, ఒక్కోసారి ఏదన్నా ప్రమాదం లేదా ఏదన్నా విషాదానికి గురయిన వాళ్ళు కూడా ఈ మార్గం పడుతుంటారు. ఇరవయ్యో శతాబ్దంలో మొదటి గెరిల్లా యుద్ధం, రహస్య విధ్వంసాల ప్రథమ ప్రయత్నం చేసింది కూడా ఒక పాశ్చాత్య యువకుడే. అతడి పేరు టి.ఈ. లారెన్స్. అతడే లారెన్స్ ఆఫ్ అరేబియాగా చరిత్రలో పేరు పడ్డాడు. అతడు ఉస్మానీ సామ్రాజ్యాన్ని ముక్కలు చేయడానికి, నామమాత్రపు ఖిలాఫత్‌ను అంతం చేయడానికిగాను, అరబ్బు పల్లెవాసులను జాతివాద మత్తులో ముంచి వారిని తిరుగుబాటుకు పురికొల్పాడు. తుర్కుల పత్రికల వ్యవస్థను లారెన్స్ నాశనం చేయడానికి ప్రయత్నించాడు. అరబ్బుల గెరిల్లా యుద్ధానికి నాయకత్వం వహించాడు. ఇరవయ్యో శతాబ్దంలోని మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా గెరిల్లా యుద్ధ తంత్రం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. ఆ పిదప సామ్యవాద ఉద్యమాలు కూడా ఈ యుద్ధతంత్రాన్ని ఆయుధంగా చేబూనాయి. లారెన్స్ తర్వాత గెరిల్లా ఉద్యమానికి మావో సేటుంగ్ నాయకుడయ్యాడు. ఆయన ఈ యుద్ధతంత్రాన్ని పరాకాష్టకు చేర్చాడు. ఈ కాలంలోనే ఇండోనేషియాలో 'నసూషన్', వియత్నాంలో 'గియాప్', లాటిన్ అమెరికాలో 'చెగుయేవేరా' సంస్థలు గెరిల్లా యుద్ధతంత్రాన్ని ఆశ్రయించి పోరాటాలు నడిపారు. గెరిల్లా ఉద్యమం ప్రారంభంలో గ్రామీణ ప్రాంతాల్లో మద్దతుదారులను సంపాదించేది. ఎందుకంటే కొండకోనల మారుమూల ప్రాంతాల్లో వారికి సురక్షిత స్థావరాలు సునాయాసంగా లభించేవి. ఇరవయ్యో

శతాబ్దపు మూడు ప్రారంభ దశకాలలో గెరిల్లా యుద్ధం అత్యంత ప్రమాదకరమైన యుద్ధ వ్యూహంగా పరిగణింపబడేది. ఆ కాలంలో అడవుల్లో వుండే ఒక విలుకాడు కూడా మిస్సైల్ కన్నా ప్రమాదకారిగా ఉండేవాడు. ఈ విధంగా ప్రజాసైన్యం, రైతుదళాలు (Peasant & People Army) ఆటంబాంబుల కన్నా శక్తిమంతంగా ఉండేవి. కాస్ట్రో తదితర నాయకులు ఇలాంటి పోరాటాలకు పట్టణ ప్రాంతాలకన్నా పల్లెసీమలే అనువయినవిగా తలిచారు. కాని, కాలక్రమేణా పట్టణ జనాభాలు నిర్ణయాత్మక స్థాయిని పొందాయి. యుద్ధ సామాగ్రిపరంగా జరిగిన అభివృద్ధి వల్ల మారుమూల ప్రాంతాలకు కూడా సైన్యం చేరుకోవడం సుసాధ్యమయ్యింది. అందువల్ల పల్లె ప్రాంతాలు సురక్షిత స్థావరాలుగా భావించే వైఖరి మారింది. సైనికబలం, అధికారం, సంపద కేంద్రీకృతమై ఉండే పట్టణాలు పల్లెలకన్నా సురక్షిత స్థావరాలుగా పరిగణన పొందాయి. అందువల్ల టెర్రరిస్టు కేంద్రాలు పట్టణాలకు మారాయి. పై కారణలేకాక పట్టణాల్లోని వర్గవైరుధ్యాలు, బీద ధనిక తారతమ్యాలు తీవ్రమవ్వడం వల్ల టెర్రరిజానికి కార్యకర్తలు దొరకడం సులువయ్యింది.

ఏది ఏమైనా, ఇరవయ్యో శతాబ్దం మధ్యకాలంలో మావోయిస్టులు, నయా అనార్కిస్టులు ఉగ్రవాద కేంద్రాలుగా మారారు. యావత్ప్రపంచాన్ని తమ రాజకీయ సిద్ధాంతాల మూసలో మలచాలని వీళ్ళు ప్రయత్నించారు. మావో, లెనిన్, చెగువేరా తదితరుల రాతల ద్వారా ఇలాంటి వాళ్ళు ఉత్సాహాన్ని, ప్రేరణను పొందేవారు. యావత్ప్రపంచంలో కార్మిక ప్రభుత్వాలు స్థాపించాలని పనిచేసేవారు. తమ సిద్ధాంతాల ప్రచారం కోసం నిస్సంకోచంగా ఉగ్రవాద పద్ధతులు అవలంబించేవారు. ఉగ్రవాదం సముచితమేనని భావించేవారు. రాజ్యాధికారం తమపై చర్య తీసుకోకతప్పని పరిస్థితులు కల్పించి, బాధితులుగా ప్రజల సానుభూతి సంపాదించాలని, ప్రజలకు న్యాయం లభించేలా చేయడానికి, ప్రజాహక్కుల కొరకు తాము పోరాడుతున్నట్లు ప్రజలలో భావన పాదుకొల్పాలని ప్రయత్నించేవారు. "విప్లవం తుపాకి గొట్టం ద్వారా వస్తుందని"

మావోసేటుంగ్ చెప్పిన మాటలు చాలా కాలం వరకు ఇలాంటి వారికి మరపురాని సూత్రంగా ఉండేవి. ఈ పరంపరలో భాగంగా భారతదేశంలో అనేక ఉద్యమాలు ఉనికిలోకి వచ్చాయి. ఇందులో ప్రముఖమైనది నక్సలైటు ఉద్యమం.

జాతివాదం, జాత్యాహంకారం వల్ల ప్రపంచంలో అనేక టెర్రరిస్టు ఉద్యమాలు పుట్టాయి. వాటికి ముఖ్యకేంద్రంగా జర్మనీ ఉండేది. పశ్చిమ జర్మనీకి చెందిన 'బాదర్ మన్‌హాఫ్' అత్యంత ప్రమాదకరమైన టెర్రరిస్టు సంస్థగా పేరు గడిచింది. ఆ పిదప జపాన్‌కు చెందిన 'రెడ్ ఆర్మీ' కూడా టెర్రరిజంపై తనదైన ముద్ర వేసింది. అంతర్జాతీయంగా చూస్తే ఉరుగ్వే, బ్రెజిల్, ఐర్లాండ్‌లలో గెరిల్లా యుద్ధం, ఉగ్రవాదాల వల్ల భయంకర సంఘటనలు అనేకం చోటుచేసుకొన్నాయి. పాలస్తీనా భూభాగంపై పాశ్చాత్య దేశాలు బలప్రయోగం ద్వారా యూదుల రాజ్యాన్ని స్థాపించిన తర్వాత టెర్రరిస్టు అగ్నికీలలు మధ్యప్రాచ్యానికి కూడా అంటుకొన్నాయి. భారతదేశం విషయానికి వస్తే, ఇరవయ్యో శతాబ్ది రెండవ అర్ధభాగంలో అనేక ఉగ్రవాద సంస్థలు పుట్టుకు వచ్చాయి. వామపక్ష ఉద్యమాలేకాక, ఆనంద మార్గ్ పేరిట అంతర్జాతీయ రైటిస్ట్ ఉద్యమం ఉనికిలోకి వచ్చింది. భారతదేశంలోని అధికసంఖ్యాక వర్గం ప్రజలపై దౌర్జన్యాలు అణచివేతలు జరిగాయని, ఈ ప్రజలు అచేతనంగా ఉండిపోయారని అందువల్ల హింసాత్మక విధానాల ద్వారా ఈ ప్రజలను మేల్కొలపాలని ఈ ఉద్యమం అభిప్రాయపడింది. ఆ తర్వాత సిక్కు ఉగ్రవాదులు, ఈశాన్య సరిహద్దుల్లోని నాగాలాండ్, అస్సాంలలో ఉల్ఫా మిలిటెన్సీ, పంజాబ్‌లో భయానక ఉగ్రవాదం ముందుకు వచ్చాయి. అనేక మంది అమాయకులు ఆహుతి అయ్యారు. దేశంలోని అస్తవ్యస్త విద్యావ్యవస్థ, నిరుద్యోగం, నిరుపాధి, అవినీతి, న్యాయం లభించని పరిస్థితులు యువతరం ఉగ్రవాదం వైపునకు మొగ్గేందుకు కారణాలయ్యాయి.

ఇరవయ్యో శతాబ్దంలో భయానక టెర్రరిస్టు సంఘటనలు, దిగ్భ్రమకు గురిచేసే దుర్ఘటనలు చోటుచేసుకొన్నాయి. లండన్లో 1972-74 మధ్యకాలంలో ఐ.ఆర్.ఏ. బాంబు దాడులతో అనేకమంది అమాయక ప్రజలను హతమార్చింది. అమృతసర్‌లో కేవలం అనుమానంతో నలుగురు స్త్రీలను హతమార్చి, కిరోసిన్ పోసి తగులబెట్టి శవాలను కూడా బూడిద చేశారు. హింసావిధానాలను విశ్వసించే వివిధ సైద్ధాంతిక ఉద్యమాలు కూడా ఇరవయ్యో శతాబ్దంలో టెర్రరిజాన్ని యిష్టమైన ఆయుధంగా ఎంచుకొన్నాయి. కాలంతో పాటు టెర్రరిజం రూపురేఖ ల్లోనూ అనేక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ఇది విప్లవకారులని చెప్పుకొనే వారికి ఆయుధంగా ఉండేది. ఒక్కోసారి ప్రత్యేక సిద్ధాంతం కోసం జరిగే గెరిల్లా యుద్ధంగా బయల్పడేది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రొఫెషన్ (వృత్తి) రూపంలో టెర్రరిజం విస్తరించింది. కిరాయి సైనికుల మాదిరిగా, కిరాయి టెర్రరిస్టులు కూడా అంతర్జాతీయ బజారుల్లో దొరికే పరిస్థితులు నెలకొన్నాయి.

# భారతదేశంలో టెర్రరిజం

స్వాతంత్ర్యానంతరం భారతదేశం టెర్రరిజం బారినపడింది. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ పాలకులకు విరుద్ధంగా జరిగిన సాయుధ రహస్య పోరాటాల్లో క్రూరత్వం, బీభత్సకాండ ఉండేవి కావు. కాని స్వాతంత్ర్యానంతరం ఉనికిలోకి వచ్చిన ఉద్యమాలలో ఈ విచారకరమైన వైఖరి ప్రబలింది. భారతదేశానికి బయట ఉన్న ఉగ్రవాద గ్రూపులు కూడా భారతదేశాన్ని తమ కార్యకలాపాల వేదికగా మార్చుకొనే ప్రయత్నం చేశాయి. దేశంలో కూడా దీనికి మద్దతుదారులు, సహాయకులు పుట్టుకొచ్చారు. స్వాతంత్ర్యానికి ముందు కాలంలో, భారత సమాజంలో నైతిక ప్రమాణాలు, ఆధ్యాత్మిక విలువలు బలంగా ఉండేవి, పాఠ్యప్రణాళికలలోనూ మానవ విలువలు, సమానభావం, స్నేహం, సౌభ్రాత్ర భావాలను ప్రోత్సహించే అంశాలు ఉండేవి. అందువల్ల దేశంలో హింసా వైషమ్యాల అగ్ని అంతగా చెలరేగలేదు. కాని ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో కొన్ని శక్తులు పుట్టుకు వచ్చాయి. అవి వివిధ మతాలు, సంస్కృతులు, వర్గాల మధ్య వైషమ్య బీజాలు నాటడం ప్రారంభించాయి. ముఖ్యంగా ఆరెస్సెస్‌కు చెందిన హెగ్డేవార్, సావర్కర్ తదితరుల భావాలు విద్వేషాన్ని, ఉగ్రవాద ధోరణులను ప్రోత్సహించాయి. ఆ పిదప ఒక పెద్ద ఉగ్రవాదంగా ఇవి ముందుకు వచ్చాయి. వీటి కార్యకలాపాలు మత ఘర్షణల మహమ్మారిగా విస్తరించాయి.

దేశంలో పుట్టుకొచ్చిన పెద్దపెద్ద టెర్రరిస్టు సంస్థల్లో ఆనందమార్గ్ ముఖ్యమయింది. ఇదికాక, ఖలిస్తాన్ ఉద్యమం, జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ బలమైన శక్తులుగా ఎదిగాయి. నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, అస్సాంలలో ఇక్కడి మిలిటెంట్లు, బయటివారి మద్దతుతో కల్లోలానికి పాల్పడుతూ వచ్చారు. ఇలాంటి అనేక సంస్థలు చురుకుగా పనిచేశాయి. ఉదాహరణకు "నాగా ఫెడరల్ గవర్నమెంటు (NFG), నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ " (NSCN), "యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం"

(ULFA), "అస్సాం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ" (APLA), బోడో మిలిటెంట్లు జార్ఖండ్ మిలిటెంట్లు వగైరా. దేశసరిహద్దు ప్రాంతాల్లో ముఖ్యంగా అస్సాం, పంజాబ్, కశ్మీర్, తమిళనాడులలో ఇలాంటి సంస్థలు బలపడ్డాయి. వామపక్ష ఉద్యమాలలోనూ అనేకమంది హింసావాదులు, ఉగ్రవాదులు జన్మించారు. చైనా నుంచి ఇలాంటి వారు ప్రేరణపొందారు.

## ఆనందమార్గ్

స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రప్రథమ సంస్థ ఆరెస్సెస్. తర్వాతి స్థానం ఆనందమార్గ్‌ది. 1955లో బీహార్‌లోని జమాల్‌పూర్‌లో పి.ఆర్. సర్కార్ (ఆనందముని) దీనిని స్థాపించాడు. ఈయన తనను తాను భగవంతుని అవతారంగా చెప్పుకొనేవాడు. అత్యంత నమ్మశక్యంగా ప్రజల్లో ప్రచారం చేసుకొన్నాడు. ఈయనలో అసాధారణ శక్తులున్నాయని అనుచరులు భావించేవారు. విద్యాధికులయిన యువకులు ఈ సంస్థలో చేరారు. తమ జీవితాలను అర్పించారు. కలకత్తా ఈ సంస్థకు కేంద్రం అయ్యింది. 1990లో వీళ్ళు ఆనంద నగర్ నిర్మించారు. ఇది ఆనందమార్గీయుల అంతర్జాతీయ కేంద్రం అయ్యింది. విదేశాలకు చెందిన అనేక మంది యువకులు, క్రైస్తవం పట్ల విసిగిపోయినవారు ఆనందమార్గ్‌లో చేరారు. ఆనందమార్గీయులలో వివిధ హోదాలు, తరగతుల విభజన ఉంది. ఉదాహరణకు - సాధక్ తాత్వికాచార్య, అవధూత్, కపాలక్, ప్రవిధా వగైరా. వీరందరి మధ్య రహస్య సౌభ్రాత్ర భావన ఆకర్షణగా ఉండేది. సర్వమానవుల్ని ఒకే విశ్వమానవ కుటుంబంగా ఆనందమార్గ్ భావిస్తుంది. కాని తమవంటి మనిషే అయిన సర్కార్‌ను దైవంగా పరిగణిస్తారు. వీళ్ళ ఆరాధనల్లో యోగసాధన, సామాజిక సేవ, ప్రత్యేక తాంత్రిక నృత్యాలు ఉన్నాయి. వీరు హింసాత్మక పద్ధతులను విశ్వసిస్తారు. ఇదే వీరిని టెర్రరిజానికి దగ్గర చేస్తుంది. ఈ పద్ధతుల ద్వారా వీరు ప్రపంచవ్యాప్త విప్లవాన్ని, ఒక సరికొత్త సామాజిక వ్యవస్థను సాధించాలని కోరుకుంటారు. వీరి దృష్టిలో అభిప్రాయ

భేదాలు క్షమార్హం కాని నేరం. 1971లో 11 మంది ఆనంద మార్గీయులను కేవలం విభేదించిన కారణాన హతమార్చడం జరిగింది. ఆ పిదప ఆ కేసు నడిచింది. జీవిత ఖైదు శిక్షగా పడింది. కాని 1978లో హైకోర్టు విడుదల చేసింది. ఆనందమార్గీయులు శ్రీమతి గాంధీని తీవ్రంగా వ్యతిరేకించే వారు. 'యోగ' కారణాన విదేశాలలో ఆనందమార్గ్‌కు మంచి ప్రచారం లభించింది. 1991లో ఆనందమార్గ్ అధిపతి సర్కార్ మరణించినప్పుడు విదేశా లలో ఆనందమార్గ్ సభ్యులు లక్షమంది వరకు ఉన్నారు. తైవాన్, మాస్కోలలో అంతర్జాతీయ సమావేశాలను నిర్వహించారు. ఆనందమార్గ్‌కు చెందిన ఒక శాఖ 'ప్రవుటిస్ట్ ఫెడరేషన్' కూడా యూరప్, అమెరికాలలో చురుకుగా పనిచేస్తోంది. డేవిడ్ ఫిల్టన్ (ఆచార్య దేవీ జాగిన) బెర్లిన్ ప్రాంతంలో ఈ సంస్థకు చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. ఆనందమార్గ్‌ను వ్యతిరేకించేవారిని హతమార్చడానికి కిరాయి హంతకులను ఉపయోగించినట్లు ఆయన స్వయంగా అంగీకరించాడు. 1983లో ఒక 'ప్రవుటిస్ట్' సభ్యుడు రాజీవ్‌గాంధీని హత్యచేస్తానని బహిరంగంగా ప్రతిజ్ఞ చేశాడు. టెర్రరిజం, హింసాత్మక పద్ధతులను న్యాయ సమ్మతమైనవిగా భావించే ఈ సంస్థ దౌత్యకార్యాలయాలపై, రాజకీయ నేతలపై దాడులకు, విధ్వంస కార్యకలాపాలకు సంబంధించిన అనేక కుట్రలు పన్నింది. ప్రపంచం లోని అనేక గెరిల్లా సంస్థలతో వీళ్ళకు సంబంధాలు ఉండేవి. అందరికీ వేదికగా కూడా ఈ సంస్థ పనిచేసేది. వీళ్ళకు సంబంధించిన ప్రసిద్ధ పుస్తకం Anarchist cook book లో వీరికి సంబంధించిన సమాచారం సమగ్రంగా లభిస్తుంది.

బెంగాల్‌లో 'ఆమ్ర బెంగాలి' పేర ఒక సంస్థ ఏర్పడింది. స్వతంత్ర బెంగాల్ దీని లక్ష్యం. ఆయుధాలు సమకూర్చుకోడానికి వీళ్ళు నిరంతర ప్రయత్నాలు కొనసాగించారు. ఈ సంస్థకు చెందిన అనేకమంది యువకులు విదేశాల నుంచి ఆయుధాలను తెస్తూ పట్టుబడ్డారు. ఈ సంస్థ కూడా ఆనంద్‌మార్గ్‌కు చెందిన శాఖయే. సి.పి.ఎం.తో ఈ సంస్థకు తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. శాంతిభద్రతల తీవ్ర సమస్య తలెత్తింది.

# నక్సలిజం

భారతదేశంలో స్వాతంత్ర్యం తర్వాత వివిధ సామ్యవాద ఉద్యమాలు ఉనికిలోకి వచ్చాయి. ఇందులో కొన్ని ఉద్యమాలు ప్రజాస్వామ్యానికి బదులు హింసాత్మక పద్ధతులను విశ్వసించేవి. 1987లో వామపక్షాలకు చెందిన 35 తీవ్రవాద సంస్థలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్, బీహారుల్లో 90 శాతం విధ్వంసక కార్యకలాపాలలో ఈ సంస్థల ప్రమేయమే ఉండేది. కేవలం ఒక్క సంవత్సరంలో అంటే 1987లో 515 హింసాత్మక సంఘటనలకు ఈ సంస్థలు పాల్పడ్డాయి. జమిందారుల భూములను బలవంతాన ఆక్రమించుకొనే ఉద్యమాన్ని ఈ వామపక్ష ఉద్యమాలు నడిపాయి. వీటికి కొంత వరకు ప్రజల మద్దతు కూడా లభించింది. 1967 మే 23వ తేదీన పశ్చిమ బెంగాల్‌లోని నక్సలబారీ గ్రామంలో ఈ తీవ్రవాద సంస్థ సృష్టించిన పరిస్థితులు ఎంత బీభత్సభరితంగా ఉన్నాయంటే చివరకు సి.పి.ఐ.(ఎం) కఠిన చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమి టంటే చైనా రేడియో ప్రసారాలలో ఈ సంఘటనలను, నక్సలైట్లను అభినందించడం జరిగింది. వసంత రుతువులో మేఘగర్జనలుగా ఈ సంఘటన లను వర్ణించడం జరిగింది. ఫలితంగా కమ్యూనిస్టు పార్టీ మరోసారి చీలింది. విప్లవ పార్టీల నాయకులు తర్వాత AICCCR పేర ఒక సమన్వయ కమిటీ ఏర్పరచి, అందరు కలిసి 1969 ఏప్రిల్ 22న కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేశారు. చారు మజుందార్ అత్యంత శక్తిమంతమైన నేతగా ఎదిగారు. నక్సల్‌బరీ నుంచి ఈ విప్లవ కెరటాలు కలకత్తా, శ్రీకాకుళం (ఆంధ్రప్రదేశ్)లను ముంచెత్తాయి. ఆ పిదప ఈ ఉద్యమం అనేక శాఖలుగా చీలింది. వీటన్నింటిలో బలప్రయోగం, హింసల ద్వారా విప్లవం సాధించాలన్న సూత్రమే బలంగా ఉండేది. మావోయిస్ట్ కమ్యూనిస్ట్ మినిస్టర్ (MCC) వీటన్నింటిలోకెల్లా అత్యంత హింసాత్మక సాయుధ సంస్థగా ఎదిగింది. 1987లో ఈ సంస్థ వందలాది హింసా త్మక కార్యకలాపాలకు పాల్పడింది. ఈ గ్రూపు కార్యకలాపాలు ఆంధ్రప్రదేశ్,

బీహారులలో పరిమిత మయ్యాయి. ఈ గ్రూపు పాలనాయంత్రాంగాన్ని, చట్టాలను కాపాడేవారిని భయోత్పాతానికి గురిచేసింది. కొన్ని ప్రాంతాల్లో పాలనా వ్యవస్థ కుప్పకూలింది. వామపక్ష తీవ్రవాదులు ప్రజల భావోద్రేకాలను, సమస్యలను, కష్టాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమైన సమస్యలపై పోరాటాలు ప్రారంభించారు. ఉదాహరణకు: కుల విభజన వల్ల తలెత్తే ఉద్రిక్తతలు, భూమి గురించి ఘర్షణలు, పంపిణీ సమస్య, శ్రామికులకు కనీస వేతనాలు, వ్యవసాయ దిగుబడుల్లో రైతులకు అధిక వాటా వగైరా సమస్యలను చేపట్టారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు, వైర్‌లెస్ భవనాలు, రైల్వేలైనులు తదితర ప్రభుత్వ ఆస్తులు లక్ష్యంగా చేసుకొని విధ్వంస కార్యకలాపాలు జరిపేవారు. ప్రభుత్వ బస్సులను దహనం చేశారు. బ్యాంకులను, దుకాణాలను దోచుకొన్నారు. ఈ పరంపర ఇరవయ్యో శతాబ్దం చివరి వరకు కొనసాగింది. కాని, మీడియా ఈ సంఘటనలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఈ విధ్వంసక కార్యకలాపాల పరంపరకు విదేశీ సిద్ధాంతాలు, ఆలోచనలు లేదా సంస్థలకు సంబంధం ఉందని గ్రహించే ప్రయత్నం చేయలేదు. కాని, నిష్పక్షపాత అంచనాలు ప్రభుత్వ గణాంకాల ప్రకారం కేవలం ఒక్క 1990లో హింసా, ఉగ్రవాద సంఘటనలు 1575 వరకు చోటు చేసుకొన్నాయి. ఈ సంఘటనలలో చాలా వరకు ఆంధ్రప్రదేశ్, బిహారుల్లోనే జరిగాయి. ఈ రాష్ట్రాలలో వామపక్ష గ్రూపులు, నక్సల్ తీవ్రవాదులు చాలా చురుగ్గా ఉండేవారు. పైన పేర్కొన్న ఒక్క ఏడాదిలో జరిగిన సంఘు టనలలో 138 మందిని హతమార్చడం జరిగింది. 149 మంది ఇతర కారణాల వల్ల మరణించారు. ఇందులో అధిక శాతం తెలంగాణా ప్రాంతంలో జరిగాయి. బీహారులో పాల్‌మావ్, జహనాబాద్‌లలో ఈ సంఘటనల సంఖ్య అత్యధికంగా ఉంది. అదే విధంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో పీపుల్స్‌వార్ గ్రూపు చాలా చురుగ్గా ఉండేది. పైన పేర్కొన రాష్ట్రాలలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ నాయకులను అపహరించిన అనేక సంఘటనలు చోటుచేసుకొన్నాయి. వామపక్ష విప్లవకారులు అపహరణలను పదునైన ఆయుధంగా వాడేవారు. అంతేకాక మందుపాతరలను ఉపయోగించ

డంలోనూ ఈ గ్రూపుకు మంచి నైపుణ్యం ఉండేది. ఆలోచించవలసిన విషయ మేమంటే, ఈ విప్లవకారులను దేశానికి శత్రువులని పిలువడంగాని, వీరికి పొరుగు దేశాలతో సంబంధం ఉందని చెప్పడంగానీ ఈ దేశ పాలకులు ఎన్నడూ చేయలేదు. ఒక వర్గం వల్ల జరిగిన చిన్న సంఘటనపై సయితం భూమ్యాకాశాలు ఏకం చేసి, పొరుగు దేశం యుద్ధానికి వచ్చినట్లు హంగామాచేసే వాళ్ళు వామపక్ష తీవ్రవాదుల విషయంలో అలాంటి ధైర్యం చేయలేదు. వామపక్ష తీవ్రవాదం, నక్సల్ ఉగ్రవాదాలు గెరిల్లా యుద్ధ తంత్రాన్ని ఆశ్రయించాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏదో ఒక ఊరిపై పట్టు సాధించి ఆ ఊరు కేంద్ర స్థానంగా చేసుకుని అక్కడి నుండి విస్తరించే ప్రయత్నాలు చేస్తారు. ఈ గ్రూపుల సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉంటుంది. ఒక కేంద్ర కమిటీ, దానిక్రింద రాష్ట్ర కమిటీలు, వాటి క్రింద జిల్లా, పట్టణ కమిటీలు ఉంటాయి. అన్నింటికన్నా చిన్న యూనిట్‌లో మూడు నుంచి తొమ్మిది మంది వరకు సభ్యులు ఉంటారు. పార్టీలో అంతర్గ తంగా ప్రజాస్వామ్య నియమాలు అమలవుతాయి. ఈ సంస్థలకు సాధారణంగా సాయుధ స్క్వాడ్‌లు ఉంటాయి. ఈ స్క్వాడ్‌లలో నాలుగు నుంచి పదమూడు మంది వరకు సభ్యులు ఉంటారు. డిసెంబర్ 1991 సంస్థాగత నివేదిక ప్రకారం పీపుల్స్‌వార్ గ్రూప్‌కు చెందిన వేలాది మంది సభ్యులు జిల్లా స్థాయిలో, లేక గ్రామ స్థాయిలో ఉన్నారు. ఈ గ్రూప్ సాయుధ దళాలు అత్యంత పకడ్బందీగా తమ కార్యకలాపాలు నిర్వహించాయి. గెరిల్లా శిక్షణా శిబిరాల్లో ఒకేసారి నాలుగు వేల మంది శిక్షణ పొందేవారు. వెనుకబడిన కులాలు, గిరిజన తెగలపై పి.డబ్ల్యు.జి. ప్రభావం బలంగా ఉండేది. రహస్య స్థావరాలలో తలదాచుకొనేవారు చాలా జాగ్రత్తగా బయట సంచరించేవారు. తమ కార్యకలా పాలకు అవసరమైన నిధులను ధనికుల నుంచి, జమీందారుల నుంచి, కండక్టర్ల నుంచి వసూలు చేయడం జరుగుతుంది. లేదా బ్యాంకులను, సర్కారు ఖజానాను, పోస్టాఫీసు లను దోచుకోవడం ద్వారా పొందుతారు. ఈ ఉగ్రవాద సంస్థలకు ప్రేరణ ఇచ్చే అంశం ఏమిటి? భౌతిక ప్రయోజనాలా? ప్రతీకార జ్వాలలా? లేక ఊరికే ఉండేకన్నా ఏదో ఒకటి చేయాలన్న మనస్తత్వమా? లేక మరేదన్నా కారణం ఉందా అని ఆలోచిస్తే, వామపక్ష శిక్షణా విధానంలోనే, వారి ఆలోచనలు

ఆచరణలు, బౌద్ధిక తర్కాలలోనే ఈ రహస్యం దాగి ఉందని అర్థం అవుతుంది. మనిషి మనస్సు కూడా భలే చిత్రమయ్యింది. మనిషి మనస్సులో యే విషయం నాటుకుపోతుందో దాని కోసం ప్రాణాలు అర్పించడానికి సిద్ధపడతాడు. వామపక్ష సిద్ధాంతకర్తలు, నేతలు తమ కార్యకర్తల మనోమస్తిష్కాలకు ఒక ప్రత్యేక లక్ష్యానికి అంకితమయ్యేలా మలచడంలో నేర్పరులు. నిరంతరం సైద్ధాంతికంగా, బౌద్ధికంగా పటిష్టమైన వాదనలతో కార్యకర్తలను తమ అదుపులో ఉంచుకుంటారు వారు. నాయకుడు సాధారణ కార్యకర్తలతోపాటు ఉంటూ, భోజన పానీయాలన్నీ వారితో కలిసే తీసుకొంటూ, కార్యకర్తలలో ఒకరిగా ఉంటాడు. గిరిజనులు, దళితులు, బీద రైతులు తమ నేతలు చేసిన త్యాగాలు చూసి ప్రభావితులవుతారు. రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమానత్వ భావన కొత్త కార్యకర్తలను ఆకట్టుకొంటుంది. బాధిత, పీడిత వర్గాల కోసం నేతలు చేసే త్యాగాలు యువకులను ప్రభావితం చేస్తాయి. వాళ్ళు కూడా ఈ ఉద్యమంలోకి దూకుతారు. దౌర్జన్యాలు, అణచివేతలకు గురయిన పీడిత ప్రజలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలలోనే వామపక్ష ఉద్యమాలకు ప్రోత్సాహం లభించింది. ఈ పీడిత ప్రజలు శతాబ్దాలుగా వడ్డీ వ్యాపారులు, జమీందారులు, మహాజనుల చేతుల్లో నానావిధాల కష్టాలను అనుభవించారు. అంతేకాక ఫారెస్ట్, పోలీస్ అధికారులు కూడా వారిపై దౌర్జన్యాలకు పాల్పడతారు. ఈ పీడిత ప్రజలకు నక్సలైట్లు విముక్తి మార్గం అయ్యారు. సంపన్నులయిన జమీందారుల నుంచి డబ్బు వసూలు చేసి బీదల సంక్షేమానికి వినియోగిస్తారు. దళిత వర్గాల పరస్పర వివాదాలను పరిష్కరిస్తారు. ఈ విధంగా ప్రభుత్వ యంత్రాంగం లేని లోటును పూరిస్తారు. ఈ గ్రూపుల కార్యకర్తలకు సాయుధ శిక్షణ క్రమబద్ధంగా జరుగుతుంది. కేంద్రస్థావరాలు రహస్య ప్రాంతాల్లో ఉంటాయి. అక్కడ మేధోపరమైన, చింతనాపరమైన శిక్షణ తరగతులు కూడా జరుగుతాయి. ఈ తరగతుల్లో తమ సిద్ధాంతాలను కార్యకర్తల మనోమస్తిష్కాల్లో పాతుకుపోయేలా చేస్తారు. ఆ తర్వాత గెరిల్లా యుద్ధతంత్రంలో శిక్షణ ఇస్తారు. ఆయుధాల కోసం ప్రభుత్వ ఆయుధాగారాలు, పోలీసుల నుంచి లాక్కొన్న ఆయుధాలు, యుద్ధాల నుంచి లేదా విదేశాల నుంచి తెచ్చుకొన్న ఆయుధాలపై ఆధారపడతారు. దౌర్జన్యంలేని సమాజ

స్థాపనకు మనిషిపై మనిషి అణచివేతలను తుదముట్టించడం లాంటి నినాదాలు అత్యంత ఆకర్షణీయమైనవి. ఇరవయ్యో శతాబ్దం చివరికల్లా ఈ గ్రూపులకు రష్యా, చైనా రెండు దేశాల నుంచి సైద్ధాంతిక, భావనాత్మక ప్రోత్సాహం లభించడం తగ్గిపోయింది. అనేక స్వప్నాలు ఛిన్నాభిన్నమైపోయాయి. ఈ గ్రూపులకు ఆయువుపట్టు అయిన న్యాయం సమానత్వాల సిద్ధాంతం ముక్కలయ్యింది. ఫలితంగా వీరి కార్యకలాపాలు కూడా సహజంగానే అంతరించాయి. అయితే ఇంకా మిగిలి ఉన్న కొందరు కొన్ని కమ్యూనిస్టు ప్రాంతాలతో సంబంధాలు కొనసాగిస్తూ తమ కార్యకలాపాలను కొద్దోగొప్పో కొనసాగిస్తూనే ఉన్నారు.

## ఈశాన్య భారతంలోని తీవ్రవాద గ్రూపులు

ఈ ప్రాంతంలో 1950 నుంచి తీవ్రవాద గ్రూపులు చురుగ్గా ఉన్నాయి. అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను అనుకొని ఉన్న ఈశాన్యభారత రాష్ట్రాలు - నాగాలాండ్, మిజోరం, త్రిపుర, మణిపూర్, డార్జిలింగ్‌లలో వేర్పాటువాద సంస్థలు చురుగ్గా ఉన్నాయి. ఈ గ్రూపులు టెర్రరిస్టు మార్గాన నడుస్తున్నాయి. గత యాభయ్యేళ్ళ సుదీర్ఘ చరిత్ర ఈ సంస్థలకు ఉంది. కొన్ని సంస్థలు నేడు తీవ్రవాద మార్గాన్ని వదలి సాధారణ జనజీవనంలో కలిసిపోయాయి. ఇంకా చాలా సంస్థలు పాత వైఖరికే కట్టుబడి ఉన్నాయి. నాగాలాండ్‌కు చెందిన ప్రముఖ తీవ్రవాద నాయకుడు ఫిజూ, బ్రిటన్‌లో ఆశ్రయం పొందాడు. భారత ప్రభుత్వం ప్రకటించిన సాధారణ మన్నింపుతో ప్రయోజనం పొందుతూ అతని సంస్థ షిల్లాంగ్ ఒప్పందం క్రింద ప్రభుత్వంతో 1975 నవంబర్ 11న సంధి చేసుకొన్నది. కాని కొందరు వేర్పడి "నేషనలిస్ట్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్" (NSCN) ఏర్పాటు చేసుకొన్నారు. సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నించే వాళ్ళను ఈ గ్రూపు హతమార్చసాగింది. చైనాలో గెరిల్లా యుద్ధ శిక్షణ పొందారు. ఈ గ్రూపు అనేకమంది వ్యతిరేకులను అంతం చేసింది. భారత సైన్యానికి- అస్సాం రైఫిల్స్‌కు భారీ నష్టం కలుగజేసింది. భారత దేశం నుంచి

వేర్పాటును కోరే సంస్థ యిది. ఒక్క అంగుళం భూమి కూడా భారతదేశంలో కలిసి ఉండడాన్ని సహించని గ్రూపు యిది. నాగా సార్వభౌమత్వాన్ని సాధించాలని పూనుకొన్నారు. అయితే స్వయంగా NSCN లో అంతర్గత విభేదాలు, అంత ర్యుద్ధం వల్ల 100 మంది గెరిల్లాలు మరణించారు. రెండు శిబిరాలుగా ఈ గ్రూపు చీలిపోయింది. వీటి కేంద్ర స్థావరాలు బర్మాలో ఉండేవి. ఖప్లాంగ్ గ్రూపులో వేయి మంది సాయుధ కార్యకర్తలు ఉండేవారు. దీనికి ప్రత్యర్థి వర్గంలో 200 మంది సాయుధ కార్యకర్తలు ఉండేవారు. వీళ్ళందరూ నాగాలాండ్ స్వాతంత్ర్యం కొరకు పోరాడేవారు. దక్షిణ బర్మా (మయన్మార్)లోని నీలికొండల్లో, రవాణా సౌకర్యాలులేని కఠిన ప్రాంతాల్లో ఈ గ్రూపుల స్థావరాలు ఉండేవి. ఉల్ఫా, బోడో తీవ్రవాదుల శిక్షణ కూడా ఈ NSCN శిబిరాలలోనే ఈ కొండల్లోనే కొనసాగింది.

## మణిపూర్

ఈ ప్రాంతంలో 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' (PLA), 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఆఫ్ క్లారింగ్ పాక్' (PREPK) సంస్థలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేస్తున్నాయి. ఈ రెండు సంస్థలు మావోయిస్టు సంస్థలే. ఈ రెండేకాక, 'యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్' (UNLF) అనే సంస్థ చైనా సైన్యం సహాయంతో మణిపూర్‌కు స్వాతంత్ర్యం సాధించాలని ప్రయత్నిస్తోంది. ఈ సంస్థ నాయకుడు మేఘాన్ (Meghan) బర్మా అడవుల్లో రహస్యంగా బ్రతుకు తున్నాడు. 1990లో ఈ సంస్థ ఒక డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేసింది. మణిపూర్ ప్రజలు విదేశీయుల పన్నాగాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్న అప్పీలు ఆ డిక్లరేషన్‌లో ఉంది. ఆ విధంగా తమ సంప్ర దాయాలు, సంస్కృతిని కాపాడుకోవాలని కోరారు. ఢిల్లీ బందిపోట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, అక్రమ నిల్వలకు, బ్లాక్‌మార్కెటింగ్, కల్తీలాంటి చేష్టలకు దూరంగా ఉండాలని చెప్పారు.

ఈ సంస్థలేకాక ఇంకా అనేక సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఉదాహరణకు: 'రివల్యూషనరీ గవర్నమెంట్ ఆఫ్ మణిపూర్', IPKF వగైరా. అయితే టెర్రరిస్టు కార్యకలాపాలకు ఎక్కువగా పాల్పడిన సంస్థ PLA. ఇరవయ్యో శతాబ్దం చివరలో భారత సైన్యానికి, ఈ సంస్థకు మధ్య అనేకసార్లు ఘర్షణలు, రక్తపాతం జరిగాయి.

## అస్సాం టెర్రరిస్టులు

మొదటి టెర్రరిస్టు సంస్థ అస్సాం గణపరిషద్ 1978లో విదేశీయులపై వ్యతిరేక ఉద్యమం ప్రారంభించి ఉనికిలోకి వచ్చింది. దీనిపేరు "అస్సాం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ" (APLA). దీనిని తేజ్‌పూర్ (Tezpur) అర్బన్‌బాజ్ బరూజ్ ప్రారంభించాడు. మణిపూర్‌లోని PLA, నాగాలాండ్‌కు చెందిన NSCN, మిజోరంలోని MNPలతో సంబంధాలు పెట్టుకొన్నాడు. 1983లో అస్సాం అసెంబ్లీ ఎన్నికలప్పుడు అనేక టెర్రరిస్టు చర్యలకు పాల్పడ్డాడు. పోలీసు అధికారులను హతమార్చాడు. విదేశీ వ్యతిరేక ఆందోళనలో ఈ గ్రూపు కార్యకర్తలు అనేక ఇతర వర్గాలలోకి, సంస్థలలోకి ప్రవేశించారు. 1983 తర్వాత ఈ గ్రూపు ఉల్ఫా (ULFA)లో కలిసిపోయింది.

'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం" (ULFA)ను 1979లో కాలేజీ విద్యార్థులు స్థాపించారు. నాగా తీవ్రవాదుల నుంచి ఆయుధ శిక్షణ పొందారు. బర్మా వెళ్ళి శిక్షణ పొంది వచ్చేవారు. చైనా తయారి ఆయుధాలను ప్రోగుచేశారు. 1990లో ఉల్ఫాలో ఆరు వందల మంది సుశిక్షితులయిన సాయుధ కార్యకర్తలు ఉన్నారు. సాయుధ కార్యకలాపాల ద్వారా అస్సాంను దేశం నుంచి వేరుపరచాలని ఈ సంస్థ ఉద్దేశ్యం. ఇతర సరిహద్దు రాష్ట్రాల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను రక్షించాలని భావించేవారు. ఉల్ఫా కేవలం బర్మాలోనేకాక భూటాన్‌లోని పర్వత ప్రాంతాల్లోనూ, అరుణాచల్, నాగాలాండ్‌లలోనూ శిక్షణా శిబిరాలు ఏర్పరిచింది. స్త్రీలకు కూడా టెర్రరిస్టు శిక్షణ ఇచ్చింది. 1990కల్లా ఉల్ఫాలో రెండు వేల మంది చురుకైన కార్యకర్తలు తయారయ్యారు. ఇందులో స్త్రీలు, పురుషులూ ఉన్నారు. అస్సాంలోని విదేశీ వ్యతిరేక ఉద్యమం వల్ల అస్సాం గణపరిషద్

ప్రభుత్వం ద్వారా వీరికి మంచి మద్దతు లభించింది. ఈ టెర్రరిస్టు సంస్థ అస్సాంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో అమాయకులను హతమార్చింది.

ఉల్ఫా భారీ ఎత్తున ఆయుధాలను NSCN, KIA ల నుంచి సంపాదించింది. నాగాలాండ్ సరిహద్దుల్లో ఒక ఆయుధాగారం నిర్మించింది. AGP ప్రభుత్వం ప్రజల్లో ప్రతిష్ట కోల్పోయినందు వల్ల ఉల్ఫా మరలా పేట్రేగింది. ఉల్ఫా కమాండర్ ఇన్ చీఫ్ పరేష్ బర్వా నాయకత్వంలో అస్సాంలోని అస్సామేతర వ్యాపారుల ఊచకోత జరిగింది. కాంగ్రెస్, యునైటెడ్ మైనారిటీస్ ఫ్రంట్‌కు చెందిన వారిని కూడా ఊచకోత కోయడం జరిగింది. తేయాకు తోటల యజమానులపై దాడులు జరిగాయి. అస్సామేతర వ్యాపారుల నుంచి, ముఖ్యంగా మార్వాడీల నుంచి బలవంతాన డబ్బులు గుంజడం జరిగింది. ప్రజల మద్దతు పొందడానికిగాను ఉల్ఫా అవినీతిపరులను, సంఘవిద్రోహ శక్తులను శిక్షించేది. మద్యపానం, జూదం, మహిళలను కించపరచడం వగైరా సమస్యలపై ఉద్యమాలు నడిపింది. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌ల నుంచి బర్మాకు వెళ్ళి రావడానికి ఉల్ఫా ఉపయోగించే మార్గాలను AGP ప్రభుత్వ హయాంలో అడ్డుకోవడం జరుగలేదు. 1986 నుంచి 1990 మధ్యకాలంలో పోలీసులు 266 మంది ఉల్ఫా టెర్రరిస్టులను అరెస్టు చేశారు. అయినప్పటికీ ఉల్ఫా కార్యకలాపాలు పెరుగుతూనే వచ్చాయి. 1990లో రాష్ట్రపతి పాలన తర్వాత ఉల్ఫా, NSCN లపై నిషేధం విధించారు. వాటి శిక్షణా శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. 1990లో BNL, ఉల్ఫా కార్యకర్తలు పట్టుబడ్డారు. మూడున్నర వేల ఆయుధాలు స్వాధీనం చేసుకోబడ్డాయి. కాని ఉల్ఫా నేతలు పట్టుబడలేదు. బర్మా పారిపోయారు.

## బోడోలాండ్ ఉద్యమం

అస్సాంలోని దారాంగ్ జిల్లాలో, కోక్రాఘర్, ఉదల్‌గిరి తహసీళ్ళలో నివసించే గిరిజనులు బోడోలు. స్వాతంత్ర్యం తర్వాత ఖాసీగారో, జెంటియా, మిజ్జో, నాగా తెగలు అస్సాంను విభజించాలని డిమాండ్ చేసి, వేరు వేరు

రాష్ట్రాలను సాధించుకొన్నాయి. కాని బోడోలాండ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు కాలేదు. ''ఆల్ బోడో స్టూడెంట్ యూనియన్' (ABSU) 1967లో ఏర్పాటయ్యింది. 'ప్లెయిన్ ట్రైబల్ కౌన్సిల్ ఆఫ్ అస్సాం' (PTCA)కి సంబంధించిన ఒక ఫ్రంటుగా ఇది ఏర్పడింది. తర్వాత 1977లో ఈ రెండు వేరుపడ్డాయి. ఆ పిదప రెండు సంస్థల మధ్య ఘర్షణలు, హింసాకాండలు చోటుచేసుకొన్నాయి. 1989లో మరో మూడు నాలుగు కొత్త సంస్థలు పుట్టుకొచ్చాయి. బోడో ఉద్యమానికి గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (GNLF) విజయాల వల్ల మంచి ఊపు లభించింది. GNLF అనేక డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేలా విజయం సాధించింది. అయితే ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండ్ విషయంలో రాజీపడలేదు. అలాగే బోడో భాషను జాతీయ భాషలలో చేర్చాలని డిమాండ్ చేయసాగారు. సాంప్రదాయిక విల్లంబులనే కాక తుపాకులను కూడా ఉపయోగించేవారు. బోడో టెర్రరిస్టులు ఖాకీ లేదా నల్లని యూనిఫారం ధరించడం ద్వారా తమ ప్రత్యేక గుర్తింపు కొన సాగించే ప్రయత్నం చేసేవారు. తమ డిమాండ్లు సాధించడానికి గెరిల్లా యుద్ధ తంత్రాన్ని కూడా ఉపయోగించేవారు. సాయుధ సంఘర్షణ జరిపే దళంగా 'నేషనల్ గార్డ్' పేరిట ఒక శాఖ 1990లో ఏర్పాటయ్యింది.

## జార్ఖండ్ మూమెంట్

బీహార్ రాష్ట్రంలోని ఒక గిరిజన ప్రాంతం ఇది. అడవులు ఎక్కువ. ప్రత్యేక రాష్ట్రం కావాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. 1938లో 'ఆదివాసి మహాసభ' ఏర్పాటయ్యింది. ఇది 1950లో జార్ఖండ్ పార్టీగా మారింది. 1952లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఈ పార్టీ సభ్యులు 32 మంది ఎన్నికయ్యారు. 1963లో ఈ పార్టీ కాంగ్రెసులో కలిసిపోయింది. కాని తర్వాత జార్ఖండ్ ముక్తి మోర్చా ఏర్పాటయ్యింది. ఇదేకాక మరికొన్ని సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఈ సంస్థలు టెర్రరిస్టు పద్ధతులను కూడా అవలంబించాయి. ప్రజాస్వామ్య పద్ధతులతోనూ పోరాడసాగాయి. ''ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్'' ఒక బలమైన గ్రూపుగా ఎదిగింది. కార్యకర్తలకు ఆయుధ శిక్షణ ఇవ్వడం ప్రారంభిం

చింది. కానీ, గిరిజన తెగలు సాంప్రదాయిక విల్లంబులపైనే ఆధారపడ్డాయి. ఈ గ్రూపు మైనారిటీలపై, ఇతర జాతుల ప్రజలపై దాడులు, ఘర్షణలకు పాల్పడి భయోత్పాతాన్ని సృష్టించింది. చివరకు 2000లో ఈ రాష్ట్రం ఏర్పాటయ్యింది.

## పంజాబ్‌లో తీవ్రవాదం

భారత దేశంలో టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడిన వివిధ సంస్థలలో అత్యంత బీభత్సభరితంగా రక్తపాతానికి, విధ్వంసానికి పాల్పడి భయోత్పాతాన్ని సృష్టిం చింది శిఖ్ఖు తీవ్రవాదమే అన్న వాస్తవాన్ని ఎవ్వరూ కాదనలేరు. ప్రజల సాను భూతిని కూడా చూరగొన్నది. ఇందులో చేరిన వాళ్ళు హత్యలు, విధ్వంస చర్యలు, దోపిళ్ళు, రైలు పట్టాలను పేల్చివేయడం, బ్యాంకులు దోచుకోవడం, ప్రభుత్వ భవనాలను, వాహనాలను దహనం చేయడం, విమానాలు హైజాక్ చేయడం ఇలా ప్రతి పనికి పాల్పడ్డారు. డి.పి. శర్మ అభిప్రాయం ప్రకారం బర్మింగ్‌హామ్‌కు చెందిన నక్సలైటు నాయకుడు జ్ఞాని బక్షిస్ సింగ్ సిఖ్ఖుల్లో వేర్పాటువాద బీజాలను నాటాడు. (Countering Terrorism- Lancer Books, New Delhi, Page 268, 1992). ఈయన శిరోమణి అకాలీదళ్ (UK)లో ఖలిస్తాన్ వాద గ్రూపుకు జనరల్ సెక్రటరీ. ఈయన వల్లనే కాక, సిఖ్ఖు ఉగ్రవాదానికి సంత్ ఫతాసింగ్ కూడా కారణం. స్వాతంత్ర్యానంతరం ఒక వర్గం- నిరంకారీలు ఉనికిలోకి వచ్చారు. ఈ వర్గం సిఖ్ఖుల కొన్ని ధార్మిక విశ్వాసా లతో విభేదించేది. ఈ విషయమై 1968 తర్వాత అనేక హింసాత్మక ఘర్షణలు జరిగాయి. అనేక మిలిటెంట్ గ్రూపులు ఏర్పడ్డాయి. సంత్ భింద్రాన్ వాలా నిరంకారీలను తీవ్రంగా వ్యతిరేకించే నాయకునిగా ఎదిగారు. ఖలిస్తాన్ నినాదాన్ని ఇచ్చారు. స్వర్ణదేవాలయం అకాల్ తక్త్‌ను ఆయన ఆక్రమించాడు. అక్కడి నుంచి ప్రత్యేక ఖలిస్తాన్ నినాదాలు మిన్నంటాయి. సాయుధ పోరాటానికి పూనుకోవడం ప్రారంభమయ్యింది. భారత ప్రభుత్వం 1984లో ఆపరేషన్ బ్లూస్టార్ ద్వారా ఆయన్ను అణచివేసింది. ఆ సైనిక చర్యలో ఆయన మరణించాడు. ఈ చర్య సిఖ్ఖులపై తీవ్ర ప్రభావాన్ని వేసింది. 1984 అక్టోబర్ 31న శ్రీమతి

ఇందిరాగాంధీనీ హతమార్చడం జరిగింది. స్వర్ణదేవాలయంపై సైనిక చర్య తర్వాత సిఖ్ఖు తీవ్రవాదులు రహస్య ప్రాంతాల్లో తలదాచుకొన్నారు. అడపాదడపా హింసాత్మక సంఘటనలు జరిగేవి. 1985 తర్వాత పంజాబ్‌లో తీవ్ర హింసాత్మక సంఘటనలు చోటుచేసుకొన్నాయి. టెర్రరిస్టులు అనేక హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడ్డారు. ఒక జంబోజెట్ విమానం కనిష్కను బాంబులతో ప్రేల్చేశారు. ఈ దుర్ఘటనలో వందలాది అమాయకులు మరణించారు. లలిత్ మాకన్‌ను ఢిల్లీలో హతమార్చారు. 1986లో రెండు వేలకన్నా అధిక సంఖ్యలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకొన్నాయి. 640 మంది మరణించారు. 1987లో 2796 హింసాత్మక సంఘటనల్లో 1246 మంది మరణించారు. 1988లో 2429 హింసాత్మక సంఘటనల్లో 2427 మంది మరణించారు. పంజాబ్‌లో టెర్రరిజాన్ని నిర్మూలించడానికి భారతదేశం సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేసింది. కాని, పరిస్థితి మెరుగుపడలేదు. కొందరు టెర్రరిస్టు నేతల అరెస్టుల వల్ల ఈ గ్రూపులు మరింత పేట్రేగిపోయాయి. హింసాత్మక సంఘటనలు మరిన్ని జరిగాయి. 1988లో టెర్రరిస్టులు గోల్డెన్ టెంపుల్‌పై తమ పట్టుబిగించారు. అందువల్ల ఆపరేషన్ బ్లాక్ థండర్-2 ప్రారంభించడం జరిగింది. గోల్డెన్ టెంపుల్ నుంచి సాయుధ టెర్రరిస్టులను తొలగించడం జరిగింది. ఫలితంగా టెర్రరిజం కొద్దిగా అణగింది. కాని 1989లో హింసాకాండ అసాధారణంగా చెలరేగింది. ఒక్క ఏడాదిలో 1827 హింసాత్మక సంఘటనల్లో 1450 మంది మరణించారు. పాకిస్తాన్, ఇంగ్లాండ్, కెనడా, అమెరికా, యూరప్‌లలోని శిఖ్ఖులు టెర్రరిస్టులకు ఆర్థిక నైతిక మద్దతు కొనసాగించారు. ప్రపంచంలోని ఇతర గెరిల్లా సంస్థల నుంచి కూడా స్వతంత్ర ఖలిస్తాన్ ఏర్పాటుకు సహకారం లభించింది. టెర్రరిస్టు గ్రూపుల్లో జబ్బర్ ఖాల్సాకు ప్రత్యేక స్థానం లభించింది. తల్వీందర్ సింగ్ వర్మార్ (కెనడా పౌరుడు) అనేక విధ్వంసక కార్యకలాపాలకు, హింసాత్మక చర్యలకు పథకాలను బబ్బర్ ఖాల్సా కోసం రూపొందించేవాడు. అదే విధంగా జగ్‌జిత్‌సింగ్ చౌహాన్, గంగా సింగ్ డల్‌హన్,-ననకాన్ ఫౌండేషన్, వాషింగ్టన్‌కు చెందినవాళ్ళు-కూడా స్వతంత్ర ఖలిస్తాన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

పంజాబ్‌లో సిఖ్ఖు తీవ్రవాదులకు మంచి ఆయుధ బలం ఉండేది. వారికి అత్యాధునిక ఆయుధాలు ఉండేవి. బంగ్లాదేశ్ ఏర్పాటు సందర్భంగా భారత్ పోషించిన పాత్రను, తనకు కలిగిన పరాభవాన్ని బహుశా పాకిస్తాన్ మరచిపోలేదు. పంజాబ్ తీవ్రవాదులకు సహాయ సహకారాలందించింది. పెద్ద సంఖ్యలో టెర్రరిస్టులు భారత సైనిక దళాలపై దాడులు చేసి పెద్ద ఎత్తున నష్టం కలిగిం చారు. అయితే స్వయంగా బబ్బర్‌ఖాల్సా కూడా చాలా నష్టాన్ని భరించింది. ప్రాణనష్టం కూడా చాలా భరించక తప్పలేదు. బబ్బర్ ఖాల్సాయే కాక 'ఖలిస్తాన్ లిబరేషన్ ఫోర్స్' (KLF), 'ఖలిస్తాన్ కమాండో ఫోర్స్' (KCF), 'బింద్రాన్‌వాలా టైగర్స్ ఫోర్స్ ఆఫ్ ఖలిస్తాన్' (BTFK) లాంటి సంస్థలు కూడా ఉనికిలోకి వచ్చాయి. ముఖ్యంగా రైల్వే ట్రాకులను ధ్వంసం చేసేవారు. సిఖ్ఖు తీవ్రవాదుల కార్యకలాపాలు యు.పీ.లోని తరాయే ప్రాంతం వరకు విస్తరించాయి. ఉల్ఫా (అస్సాం), NSCN (నాగాలాండ్), జె.కె.ఎల్.ఎఫ్. (జమ్ముకశ్మీర్)లతో సంబంధాలు పెట్టుకొన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పాలన అంతరించిన తర్వాత శిఖ్ఖు తీవ్రవాదం కూడా తగ్గుముఖం పట్టింది. పైగా టెర్రరిస్టు సంస్థల మధ్య విభేదాలు తలెత్తడం ప్రారంభమయ్యింది. ఒక వర్గం బిజెపికి దగ్గరయ్యింది. ప్రస్తుతం ఈ కల్లోలం పంజాబ్‌లో దాదాపు అంతరించింది.

## జమ్ము కశ్మీర్‌లో తీవ్రవాదం

స్వాతంత్ర్యం తర్వాత కశ్మీర్ సమస్య ఒక చిక్కుముడిగా ముందుకు వచ్చింది. ఈ కారణం వల్లనే భారత పాకిస్తాన్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఆ పిదప ప్రత్యేక కశ్మీరు కోసం, ఒక స్వతంత్ర రాజ్యం కోసం అక్కడ అగ్గిరాజుకుంది. 1964లో జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఉనికిలోకి వచ్చింది. మగ్బూల్ అహ్మద్ భట్, మేజర్ అమానుల్లా ఖాన్‌లు దీనికి నాయకత్వం వహించారు. వీళ్ళు కశ్మీర్ ప్రజలకు స్వయం నిర్ణయాధికారం ఇవ్వాలని డిమాండ్ చేయసాగారు. మక్బూల్ అహ్మద్ భట్ 1966లో అరెస్టయ్యారు. కేసు విచారణ తర్వాత మరణశిక్ష విధించడం జరిగింది. కాని, ఆయన 1968లో జైలు నుంచి తప్పించుకొన్నారు.

జె.కె.ఎల్.ఎఫ్. కార్యకలాపాలు కొనసాగాయి. విమానాల హైజాకింగ్ కూడా చేశారు. 1970-71లో విధ్వంసక, హింసాత్మక సంఘటనలు అనేకం జరిగాయి. 1971లో మక్బూల్ భట్ మరోసారి అరెస్టయ్యారు. 1970 జె.కె.ఎల్.ఎఫ్. గెరిల్లా యుద్ధం ద్వారా కశ్మీరు స్వాతంత్ర్యాన్ని సాధించాలని నిర్ణయించింది. కశ్మీరులో రాజకీయ అవకతవకలు, సైనిక అణచివేతలు, బీదరికం, నిరుద్యోగం, వెనుకబాటుతనాల వల్ల అలజడి మరింత అధికమయ్యింది. 1983లో కోపెన్‌హేగన్‌లో భారత ప్రధానికి వ్యతిరేకంగా జె.కె.ఎల్.ఎఫ్. ఆనందమార్గ్‌తో కలిసి ప్రదర్శన నిర్వహించింది. 1984లో భట్‌ను ఉరితీశారు. అమానుల్లా ఖాన్ బ్రిటన్ తరలిపోయాక 1988లో జమ్మూకశ్మీర్ పీపుల్స్‌లీగ్ ఉనికిలోకి వచ్చింది. స్వతంత్ర కశ్మీరు ఉద్యమాన్ని పటిష్టమైన సంస్థాగత ఏర్పాట్లతో నడిపింది. షబ్బీర్‌షా, ముహమ్మద్ అల్తాఫ్‌లు దీనికి నాయకత్వం వహించారు. 1989లో షబ్బిర్ షా అరెస్టయ్యారు. ఇస్లామిక్ స్టూడెంట్స్ లీగ్ (ISL) కూడా ఈ లక్ష్యంతోనే ఉనికిలోకి వచ్చింది. ఇవేకాక, 'జమ్మూ కశ్మీర్ స్టూడెంట్స్ లిబరేషన్ ఫ్రంట్', 'ముజాహిదీన్ కశ్మీర్ గ్రూప్', 'హిజ్బుల్లా' సంస్థల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దేశంలోని ఇతర టెర్రరిస్టు సంస్థలతో పోల్చితే ఇక్కడి సంస్థలు విధ్వంస కార్యకలాపాలకు పాల్పడింది తక్కువే. అయినా, భారత సైనిక దళాలకు, పోలీసులకు, భారత అనుకూల కశ్మీర్ రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా ఎడతెరిపిలేని కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చాయి. విదేశాల నుంచి సానుభూతిపరులు ఆయుధాలను, ఇతర సహాయ సహకారాలను అందిస్తున్నారు. భారత పాకిస్తాన్‌లలో నేతలు ఈ సమస్య పరిష్కారంలో విఫలం కావడం కూడా తీవ్రవాద సంస్థలు పుట్టుకురావడానికి, ప్రజల మద్దతు పొందడానికి కారణమయ్యింది. దురదృష్టం ఏమంటే ఈ సంస్థలకన్నా ఎక్కువగా భారత భద్రతా దళాల దౌర్జ న్యాలు బయటపడుతూ వచ్చాయి. అమాయకులు నాశనమవ్వడానికి భద్రతా దళాల చర్యలు కారణమవుతూ వచ్చాయి. మానవ హక్కుల సంఘాలు ఈ రాజ్యహింసను, సైనిక దళాల దౌర్జన్యాలను పలుసార్లు ఖండించాయి.

# హింస, టెర్రరిజం- ఇస్లాం

ఇస్లాం, టెర్రరిజాల మధ్య నీటికి నిప్పుకు మధ్య ఉన్నంత తేడా ఉంది. హింస ఉంటే అక్కడ ఇస్లామ్‌ను ఊహించనన్నా ఊహించలేము. ఇస్లాం ఉన్నచోట హింసా దౌర్జన్యాల నీడ కూడా ఉండదు. ఇస్లాం శాంతికి మూలం. మానవుల మధ్య ప్రేమ, శ్రేయోభావాలు ప్రోత్సహించే ధర్మం. టెర్రరిజం అన్నది హింసా దౌర్జన్యాలు, పాశవిక పైశాచిక చేష్టల నుంచి పుడుతుంది. రక్తపాతాలు, విధ్వంసాల ద్వారా పోషణ పొందుతుంది. మానవ ప్రాణాలకు పవిత్రత, భయరాహిత్యం, శాంతిభద్రతలతో జీవితం గడిపే హక్కుకు ప్రపంచంలోని సమస్త మత ధర్మాలు ప్రాధాన్యాన్నిచ్చాయి. ఈ విషయంలో ఇస్లాం అన్నింటికన్నా ముందు ఉంది. దైవ గ్రంథం దివ్యఖుర్‌ఆన్, ప్రవక్త ముహమ్మద్ (స) బోధనల ద్వారా ఈ వాస్తవం తెలుస్తోంది. మనిషి నిర్భయంగా బతకగలిగే హక్కును ఇస్లాం స్పష్టంగా ప్రకటించింది. అన్ ఆమ్ సూరాలో మహాప్రవక్త ముహమ్మద్ (స)ను ఉద్దేశించి అల్లాహ్ క్రింది విధంగా విశదీకరించాడు:

> **"అల్లాహ్ పవిత్రమైనదిగా నిర్ణయించిన యే ప్రాణిని సత్యం ఆధారంగా తప్ప, చంపరాదు."**

అలాగే మాయిదా సూరాలో క్రింది ఉపదేశం ఉంది:

> **"ఈ కారణం వల్లనే మేము ఇస్రాయీల్ సంతతికి ఫర్మానా రాసి ఇచ్చాము: "హత్యకు బదులుగాగాని లేక కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుని ప్రాణాలు కాపాడిన వాడు మొత్తం మానవుల ప్రాణాలు కాపాడినట్లే."**

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఉపదేశాన్ని అనస్ బిన్ మాలిక్ క్రింది విధంగా ఉటంకించారు:

"అతిపెద్ద పాపాల్లో కెల్లా పెద్ద పాపాలు అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం, హత్య, తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపడం, అబద్ధాలాడటం."

హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ఉమర్, ప్రవక్త ముహమ్మద్ (స)ప్రవచనాన్ని క్రింది విధంగా ఉటంకించారు:

"విశ్వాసి పవిత్రమైన యే ప్రాణాన్ని తీయనంతవరకు తన ధర్మం పరిధిలో ఉంటాడు."

అల్లాహ్, దైవప్రవక్త ముహమ్మద్ (స) చేసిన స్పష్టమైన హితోపదేశాలు సాధించిన ఫలితం మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది మాటల్లో చెప్పాలంటే, "కేవలం పాతికేళ్ళ స్వల్ప కాలంలోనే అరబ్బుల వంటి యుద్ధప్రీతి గల జాతి మనిషి ప్రాణాలను గౌరవించే జాతిగా, శాంతికాముక జాతిగా మారింది. దైవప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన భవిష్యవాణి నిజమయ్యింది. ఖాదిసియా నుంచి సనా వరకు ఒక మహిళ నిర్భయంగా ఒంటరిగా ప్రయాణం చేయగలిగేది. ఆమె ధన ప్రాణాలకు ఎలాంటి ప్రమాదము ఉండేదికాదు. నిజానికి ఇదే దేశంలో పాతికేళ్ళ క్రితం పెద్ద పెద్ద ప్రయాణ బృందాలు కూడా నిర్భయంగా వెళ్ళగలిగేవి కావు."

ఇస్లామీయ బోధనల వల్ల ప్రపంచంలో మానవ ప్రాణాల పట్ల గౌరవాదరాలు అసాధారణ రీతిలో పెంపొందాయి. పెద్ద పెద్ద సామ్రాజ్యాలలో మానవ ప్రాణాల పవిత్రతను కాలరాచే భయానక సంఘటనలు, బీభత్సభరిత చేష్టలు ఇస్లాం ఆగమనం తర్వాత అదృశ్యమయ్యాయి. హింసా, రక్తపాతాల నుంచి మానవాళికి విముక్తి లభించింది. చరిత్రలో క్రూరమైన పైశాచిక చేష్టల సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. అతిథులను ఆనందపరచడానికి బానిసలను క్రూరమృగాల ముందు వేయడం, మృగాల మాదిరిగా వారిని వేటాడడం, సజీవంగా తగుల బెట్టడం వంటి వికృత వినోదాలు చరిత్రపుటల్లో మిక్కుటం. ఖైదీలను, బానిసలను చిత్రహింసలు పెట్టి చంపడం ఒక వినోద కృత్యంగా ఉండేది. ఇస్లాం ఈ వికృత చేష్టలను కఠినంగా నిషేధించింది. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే గ్రీకు, రోములలోని పెద్ద పెద్ద పాలకులు, తత్వవేత్తలు మానవ ప్రాణాలను నిష్కారణంగా చంపే అనేక పద్ధతులను సమ్మతమైనవిగా భావించేవారు (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం, పేజి-27).

యూరప్ పొగిడే గొప్ప నాగరికత గ్రీకులో తండ్రికి కుమారుడ్ని చంపే హక్కు ఉండేది. కొందరు తత్వవేత్తల ప్రకారం మనిషి తనను తాను చంపుకోవడం కూడా తప్పుకాదు. భర్త భార్యను చంపడం, ఏదో పెంపుడు జంతువును చంపినంత సులభంగా ఉండేది. ఈ హత్యలకు గ్రీకు చట్టాల్లో శిక్షలు ఉండేవికావు, స్వయాన భారతదేశంలో భర్త చితిపై భార్యను సజీవంగా దహనం చేయడం జరిగేది. శూద్రులకు క్రిమికీటకాల స్థాయి కూడా ఉండేది కాదు. ఈ క్రూర పాశవిక దురాచారాల చీకట్లను ఇస్లాం పారద్రోలింది. "జాగ్రత్త! యే ప్రాణాన్ని చంపవద్దు, సత్యం ఆధారంగా తప్ప" అని ప్రకటించింది.

ధార్మిక విశ్వాసాల రీత్యా, ధర్మప్రచారం రీత్యా చూసినా ఇస్లామ్ మానవ ప్రవృత్తికి చాలా దగ్గరగా ఉండే ధర్మం. మనిషి తనకు నచ్చిన ధర్మాన్ని, విశ్వాసాన్ని, సంస్కృతిని అవలంబించే జన్మహక్కును ఇస్లాం గుర్తించింది. సత్యాన్ని, సత్యధర్మాన్ని స్పష్టంగా ప్రకటించాలని, ఆచరణలో అనుసరించాలని మాత్రమే హితోపదేశం చేసింది. బలవంతంగా ఎవరిపైనా రుద్దే అనుమతిని యివ్వలేదు. అందువల్లనే బఖరా సూరాలో అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

> **"ధర్మంలో ఎలాంటి బలవంతమూ లేదు. రుజుమార్గాన్ని తప్పుడు మార్గాన్ని వేరు వేరు చేసి చూపడం జరిగింది. ఇప్పుడు, అసత్యదేవుళ్ళను వదిలి అల్లాహ్‌ను విశ్వసించే వ్యక్తి ఎన్నటికీ విడిపోని పటిష్టమైన సంబంధంలో చేరుతాడు."**

మరోచోట దివ్యఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

> **"నీ దైవమే కోరితే భూమిపై ఉన్న ప్రజలంతా విశ్వసిస్తారు. నువ్వు ప్రజలపై విశ్వాసులు కావాలని బలవంతం చేస్తావా!"**

ఈ దైవాదేశం వల్లనే ఇస్లామీయ చరిత్రలో ముస్లిములు ఎన్నడూ ధర్మపరివర్తన విషయమై ఎవరినీ బలవంతపెట్టలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) ఎవరినీ బెదిరించి ఇస్లాం స్వీకరించేలా చేయలేదు. ధర్మంలో ఎలాంటి బలవంతం లేదు అన్న వైఖరినే ప్రదర్శించారు. ముస్లిములు ప్రవక్త (స) ఆచరణనే అనుసరిస్తున్నారు. హజ్రత్ ఉమర్ (ర) తన నౌకరు అస్‌బఖ్‌కు

ఇస్లాం స్వీకరించేలా హితోపదేశం చేసేవారు. కాని అతడు తిరస్కరించేవాడు. హజ్రత్ ఉమర్ (ర) "ధర్మంలో బలవంతం లేదు" అని ఊరుకునేవారు. అతడిని పనిలో యథాతథంగా ఉంచుకొన్నారు.

వివాదాల పరిష్కారానికి హింసా పద్ధతులు కూడవన్న ఆదేశం ఇస్లాంలో కేవలం ముస్లిం సమాజానికి మాత్రమే సంబంధించినది కాదు. అంతర్జాతీయంగా గానీ, లేదా ఒక ప్రాంతంలో ఉండే విభిన్న మతాలు ధర్మాల వారితోగాని ఉన్నత స్థాయి నైతికప్రమాణాలతో వ్యవహరించాలని ఆదేశించింది. ముమ్తహినహ్ సూరాలో దైవాదేశం క్రింది విధంగా ఉంది:

> **"ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయనివారు, మిమ్మల్ని ఇళ్ళ నుంచి వెళ్ళగొట్టని వారి పట్ల మీరు న్యాయంగా, మంచిగా వ్యవహరించడంలో అభ్యంతరం లేదు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ఇష్టపడతాడు. ధర్మం విషయంలో మీతో యుద్ధం చేసిన వారితో మిమ్మల్ని ఇళ్ళ నుంచి వెళ్ళగొట్టిన వారితో, ఇళ్ళ నుంచి వెళ్ళగొట్టడానికి సహాయపడిన వారితో మీరు స్నేహం చేయడాన్ని అల్లాహ్ నివారిస్తున్నాడు. అలాంటి వారితో స్నేహం చేసినవారు దౌర్జన్యపరులు."**

ధర్మం విషయంలో యుద్ధం అన్నది ప్రత్యక్షంగానూ ఉండవచ్చు లేదా పరోక్షం గానూ ఉండవచ్చు. ఈ విషయంలో రాజీపడడానికి అవకాశం లేదు. ఎందుకంటే, రాజీపడడం ప్రారంభమయితే అది ఇస్లాం పట్ల అవిధేయతకు లేదా మినహాయింపులకు దారితీస్తుంది. అనేక చెడులు, దౌర్జన్యాలకు తోడ్పాటు నందించక తప్పనిసరి అవుతుంది. అందుకే దివ్యఖుర్ఆన్ మాయిదా సూరాలో స్పష్టంగా క్రింది విధంగా ఆదేశించింది:

> **"పుణ్యకార్యాలలో, దైవభీతిలో మీరు ఒండొరులకు తోడుగా ఉండండి. పాపం, దౌర్జన్యాల పనుల్లో సహాయపడకండి."**

ధర్మం విషయంలో ఎవరితో అయినా సరే రాజీపడడం వల్ల లజ్జా రాహిత్యం, చెడులు, దౌర్జన్యాలతో సర్దుకుపోయే పరిస్థితి తలెత్తుతుంది. అందుకే దివ్యఖుర్ఆన్ నహ్ల్ సూరాలో అల్లాహ్ స్పష్టంగా ఇలా బోధించాడు:

**"న్యాయం చేయండి అనీ, ఉపకారం చేయండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడునూ, అశ్లీలతనూ, అన్యాయాన్నీ మితిమీరి ప్రవర్తించడాన్ని నిషేధిస్తున్నాడు."**

**(దివ్యఖుర్ఆన్-16:80)**

ప్రస్తుత కాలంలోని ఆధునిక పాశ్చాత్య సంస్కృతి, బీద, వెనుకబడిన, న్యూనతా భావంతో సతమతమయ్యే అనేక మంది ప్రజలకు మహాగొప్పదిగా కనబడే పాశ్చాత్య సంస్కృతి మనిషికి సంబంధించి ధార్మిక విశ్వాసాలు, విలువలను మౌలిక హక్కులుగా పరిగణించదు. అలాగే ప్రపంచంలో ఏదైనా దేశంలో, ఏదైనా ధార్మిక విశ్వాసంగల వర్గానికి వ్యతిరేకంగా మానవ స్వేచ్ఛకు సంబంధించిన నిర్దిష్ట సూత్రాల పేర ఏదైనా చట్టం చేయబడితే, ఏదైనా వర్గం దీనిని వ్యతిరేకిస్తే, ఆ వ్యతిరేకతను ఉన్మాదంగా, ఛాందసవాదంగా పరిగణించడం జరుగుతోంది. ధార్మిక నియమాలు, విశ్వాసాల కోసం పట్టుబట్టడం, స్వచ్ఛమైన, హెచ్చుతగ్గులు లేని ధార్మిక నియమాలపై స్థిరంగా ఉండడం పాశ్చాత్య సంస్కృతి దృష్టిలో మహాపరాధం. వారి నిఘంటువు ప్రకారం ఈ వైఖరి ఫాసిజం, టెర్రరిజాలకన్నా ప్రమాదకరమైనది. అందువల్లనే, మహాప్రవక్త ముహమ్మద్(స) ను కించపరుస్తూ, అత్యంత మూర్ఖంగా, అరాచకంగా, అతి తెలివిగా సల్మాన్ రుష్దీ బురద జల్లినప్పుడు, నాగరిక సమాజం యేది కూడా భరించలేని ఈ చర్యను పాశ్చాత్య వ్యవస్థ భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట వెనకేసుకొచ్చింది. పైగా ఈ హేయమైన చర్యను ప్రస్తుతించింది. ఈ నీచమైన పనివల్ల మనోభావాలు గాయపడిన ప్రజలు పాశ్చాత్య వ్యవస్థకు బానిసయిన ఈ ఇస్లాం విరోధిని ఖండించినప్పుడు మానవ స్వేచ్ఛా ధ్వజాన్ని మోస్తున్నామని చెప్పుకొనే ఈ యూద, క్రైస్తవ మీడియా, మేధావులు ఆగ్రహంతో విరుచుకు పడ్డారు.

హింసా దౌర్జన్యాలు, టెర్రరిజాన్ని ఇస్లాం తీవ్రంగా వ్యతిరేకిస్తుందనీ, శాంతి, సామరస్యం, సౌభ్రాత్ర సౌహార్ధతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పడానికి ప్రవక్త ముహమ్మద్ (స) అరబ్బు భూభాగానికి పొరుగున ఉన్న

రాజ్యాధినేతలకు రాసిన ఉత్తరాలే నిదర్శనాలు. ఈ రాజ్యాధినేతలు తమ ప్రజలకు భావప్రకటనా స్వేచ్ఛను, మనస్సాక్షిని అనుసరించే హక్కును నిరాకరించి, బానిసత్వ సంకెళ్ళలో బంధించి ఉంచారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) ఈ రాజ్యాధినేతలకు రాసిన ఉత్తరాలలో రోము చక్రవర్తి హెర్క్యులియస్‌ను, ఈరాన్ సామ్రాజ్యాధిపతి కిస్రాను సంబోధిస్తూ, రానున్న విప్లవానికి తగిన విధంగా స్పందిస్తే పూర్తి శాంతి సౌభాగ్యాలతో ఉండగలరని బోధించారు. హెర్క్యులియస్‌కు రాసిన ఉత్తరంలో ఇరువర్గాలకూ అంగీకారయోగ్యమైన ఒక ఉమ్మడి విషయం ఆధారంగా సామరస్య వైఖరిని పాటించాలని చెబుతూ, ఆ ఉమ్మడి విషయం దేవుడు ఒక్కడనే విశ్వాసంపై స్థిరంగా ఉండడమనీ, బహుదైవారాధన, విగ్రహారాధనలకు దూరంగా ఉండడమనీ, దేవుని ముందు తప్ప మరే శక్తి ముందు కూడా తలవంచకుండా ఉండడమనీ విశదీకరించారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) మదీనా వెళ్ళిన తర్వాత అక్కడి ప్రజలతో ఒప్పందాలు చేసుకొన్నారు. తర్వాత నజ్రాన్‌కు చెందిన క్రైస్తవులతో ఒప్పందాలు చేసుకొన్నారు. యూదులు, క్రైస్తవులతోనేకాక విగ్రహారాధక జాతులతోనూ ఆయన గౌరవ మర్యాదలతో వ్యవహరించారు. ఈ వ్యవహారశైలి చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచి ఉంది. ముస్లిములతో సంధి ఒప్పందాలు చేసుకున్న జాతులకు సంబంధించి దారుల్ అహద్ (ఒప్పంద భూభాగాలు), అహద్ జిమ్మా (ఒప్పందంలో బాధ్యత స్వీకరించిన జాతులు) అన్న స్పష్టమైన భావనలు ఉన్నాయి. ఇస్లాం కత్తితో వ్యాపించిందని ప్రచారం చేసేవాళ్ళు ఈ భావనలను వక్రీకరించి ప్రచారం చేసే ప్రయత్నాలు చేశారు. కాని, వాస్తవమేమంటే, ఈ ఒప్పందాల ఫలితంగా, ముస్లిములపైగాని, ముస్లిమేతరులపైగాని ధార్మిక విశ్వాసాలు, ధర్మాచరణల విషయమై బలవంతం చేయరాదన్న విధానాన్ని పాటించేవారు. ఇస్లామ్ ప్రారంభకాలంలో ఖలీఫాలు ఇతర ప్రాంతాలకు సైన్యాలను పంపినప్పుడు యుద్ధం చేయని ప్రజల రక్షణ విషయమై, వారి శాంతిభద్రతలు కాపాడే విషయమై ఖచ్చితమైన సూచనలు, ఆదేశాలిచ్చి పంపేవారు. ఈ వాస్తవాల దృష్ట్యా ఇస్లామీయ సంస్కృతిలో హింసాదౌర్జన్యాలకు చోటులేదని స్పష్టం అవుతోంది.

దౌర్జన్యానికి వ్యతిరేకంగా గొంతువిప్పాలనీ, దౌర్జన్యపరుని ఎదుట సత్యవచనం పలుకాలని ఇస్లాం మరీ చెప్పింది. అది నిజమైన విశ్వాసిలో ఉండవలసిన లక్షణంగా పేర్కొంది. ఇక్కడే జిహాద్, లేక బలప్రయోగంతో దౌర్జన్యాన్ని నిర్మూలించే వాదన పుట్టింది. ఈ వాదనకు పాశ్చాత్య మేధావులు చాలా మొరటుగా టీకా తాత్పర్యాలిచ్చారు. ఇస్లాం శాంతికి విరుద్ధమైనదని చెప్పడానికి సాక్ష్యంగా దీనిని ఉపయోగించారు. హత్యాకాండ, విధ్వంస కాండలతో జిహాద్‌ను జోడించే ప్రయత్నాలు చేశారు. ఇస్లాం మానవ ప్రాణాలు పవిత్రమైనవని ప్రకటించడంతోపాటు, అల్లకల్లోలాన్ని, ఉపద్రవాన్ని వ్యాపింపజేసే వారిని క్షమించడం కూడా జరుగదనీ స్పష్టం చేసింది. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే-

"మనిషికి చట్టాల సంకెళ్ళు లేకుండా చేయడం, మనిషికి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఇష్టం వచ్చినట్లు అరాచకం, అలజడి రెచ్చగొట్టినా ఎలా దౌర్జన్యాలు, అణచి వేతలకు పాల్పడినా అతడి ప్రాణాలు సురక్షితమైనవిగా ఉండడం- ఇవికాదు నేడు ప్రపంచానికి కావలసింది. నేడు ప్రపంచానికి అసలయిన అవసరాలు- శాంతిని కాపాడడం, అరాచకం, ఉపద్రవాలు అంతం కావడం. ప్రతి మనిషి తన పరిధిలో స్వేచ్ఛగా ఉంటూ, నిర్ధారిత హద్దులు దాటకుండా, ఇతరుల భౌతిక, ఆధ్యాత్మిక శాంతికి భంగం కలిగించకుండా జీవించగలిగే చట్టాలు చేయడం నేటి అవసరం." (అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్-పేజీ.29)

అరాచకం, ఉపద్రవం, దౌర్జన్యం అణచివేతలను సాముహిక స్థాయిలో అంతం చేయడానికి 'జిహాద్' ఆదేశం ఇవ్వడం జరిగింది. ప్రత్యర్థిని చంపడం, లేదా నష్టం వాటిల్లేలా చేయడం జిహాద్ ఉద్దేశ్యం కాదు. అరాచకం ఉపద్రవాల కారణాలను అంతం చేయడం జిహాద్ లక్ష్యం. అందుకే యుద్ధాలలో చెడును అంతం చేయడానికి ఎంత బలప్రయోగం అవసరమో అంతే బలప్రయోగం చేయాలని ఇస్లాం పేర్కొంటోంది. అది కూడా దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై మాత్రమే, చెడుకు పూనుకొంటున్న వారిపై మాత్రమే బలప్రయోగానికి అనుమతి ఉంది. మరెవ్వరిపై ఈ అనుమతి లేదు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) జీవితాన్ని పరిశీలిస్తే మనకు ఇస్లాం స్వభావం ఎలాంటిదో స్పష్టంగా అర్థమవుతుంది. అదేమిటంటే, మనం నివసిస్తున్న సమాజంలో హింసా దౌర్జన్యాలకు, విధ్వంసానికి పాల్పడే అనుమతి మనకు లేదు. ఒకవేళ దౌర్జన్యాలు, అణచివేతలు ఎదురైతే సహనం వహించాలి. మన జీవిత లక్ష్యం కోసం శాంతియుత ప్రయత్నాలు కొనసాగించడం అవసరం. ఏ సమాజంలో అయినా సరే, అందులో ఉంటూ, సమాజంలోని దౌర్జన్య పరులను ప్రతిఘటించే విషయమై మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆయన సహచరులు మక్కా జీవితంలో వ్యవహరించిన శైలి మార్గదర్శకం అని మేధావులు అభిప్రాయపడ్డారు. మక్కాదశలో 14సంవత్సరాల పాటు ముస్లిములు నానావిధాల బాధలు, కష్టాలు అనుభవించారు. ఆ కాలంలో మహాప్రవక్త ముహమ్మద్ (స) సత్య సందేశాన్ని ఎన్ని కష్టాలు, బాధలు ఎదురైనా నిరంతరం కొనసాగించారు. ఎన్నడూ బలప్రయోగానికి పాల్పడలేదు. మక్కా పాలకులు ఆయనను అనేక విధాలుగా దౌర్జన్యాలు, అణచివేతలకు గురిచేసారు. అనేక విధాలుగా భీతావహ పరిస్థితులు సృష్టించారు. హత్యా, హింసాకాండలు జరిగాయి. వీటన్నింటికీ కారణం ఒక్కటే ప్రవక్త ముహమ్మద్ (స) సత్యసందేశాన్ని ప్రజలకు వినిపించేవారు, చెడులను నిరోధించేవారు. ఆలోచనలు, విశ్వాసాల పరంగా, బహుదైవారాధన నుంచి, చెడుల నుంచి సమాజాన్ని ప్రక్షాళనం చేయాలని అభిలషించేవారు. హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ హంజ (రజి)లు ముస్లిములయిన తర్వాత ఖురైష్ బహుదైవారాధకుల దౌర్జన్యాలకు, దౌర్జన్యంతో జవాబీయగల శక్తిసామర్థ్యాలు లభించినప్పటికీ ప్రవక్త ముహమ్మద్(స) ఎల్లప్పుడూ శాంతి సహనాలనే బోధించారు.

> **"నీ ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉండు. అన్నింటినీ వదలి పూర్తిగా ఆయనకే అంకితమైపో. ఆయన తూర్పు పడమరలకు స్వామి. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు ఆయననే వకీలుగా చేసుకో. లోకులు కల్పించే మాటల పట్ల సహనం వహించి, మంచితనంతో వారి నుంచి వైదొలిగిపో. సత్య తిరస్కారులయిన ఈ సంపన్నుల సంగతి నాకు వదలిపెట్టు. నేను చూసుకొంటాను. వీరిని కొంతకాలం ఇదే స్థితిలో ఉండనివ్వు."** **(దివ్యఖుర్ఆన్:73)**

**"ముహమ్మద్! ఇలా చెప్పు: "మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరపు నుండి సత్యం వచ్చేసింది. ఇప్పుడు ఎవడైనా ఋజుమార్గాన్ని అవలంబిస్తే అతడి ఋజుమార్గ అనుసరణం అతనికే లాభదాయకం, ఎవడైనా మార్గం తప్పితే అతడి ఆ మార్గం తప్పడం అతడికే వినాశకరం. నేను మీకు కావలివాణ్ణి మాత్రం కాను." ప్రవక్తా! నీవు నీ వద్దకు వహీ ద్వారా పంప బడుతున్న హితబోధను అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తీర్పు చేసే వరకు ఓర్పువహించు. ఆయన మాత్రమే ఉత్తమంగా తీర్పు చేసేవాడు."**

**(దివ్యఖుర్ఆన్-10:108)**

హిజ్రత్ చేసి మదీనా తరలివెళ్ళిన తర్వాత అణచివేత, దౌర్జన్యాలకు జవాబుగా బలప్రయోగానికి పూనుకొనే అనుమతి, ఒక ఇస్లామీయ సమాజం ఏర్పడిన తర్వాత మాత్రమే లభించింది. మక్కాలోని బహు దైవారాధకుల దాడి వల్ల ఇస్లామీయ సమాజం ఉనికికి ప్రమాదం తలెత్తినప్పుడు మాత్రమే ఈ అనుమతి లభించింది. డాక్టర్ అబ్దుల్ హమీద్ అబూ సులైమాన్ మాటల్లో చెప్పాలంటే-

"దివ్యఖుర్ఆన్ ఆత్మరక్షణకు, తమ సందేశాన్ని కాపాడుకోడానికి అనుమతిని, ఆదేశాన్ని ఇచ్చింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఖురైష్ తదితర వైరి వర్గాలను ఎదర్కొని పోరాడారు. బలహీన ప్రజలను కాపాడడానికి, ఆత్మరక్షణకు ఆయన తీసుకొన్న నిర్ణయమిది. విశ్వాసాలపరంగా, జీవన విధానంపరంగా మనిషికి ఇస్లాం ప్రసాదించిన స్వేచ్ఛ ఇది. శత్రువులతో యుద్ధం, పోరాటాల సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (స) బలప్రయోగానికి సంబంధించి అన్ని వనరులు ఉపయోగించారు. ఇందులో కొన్ని సైనిక ఎత్తుగడలు, దౌర్జన్యకర శక్తులను మభ్యపుచ్చి వారి ఇళ్ళలోనే కడతేర్చడం వంటి పద్ధతులూ ఉన్నాయి."
(తషద్దుద్ ఔర్ సియాసీ కష్మకష్ అబ్దుల్ హమీద్ అబూ సులైమాన్, పేజి.34)

దివ్యఖుర్ఆన్‌లో ఈ పరిస్థితికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. అరాచకం, ఉపద్రవాలను సామూహిక స్థాయిలో ఎదుర్కోడానికి, దౌర్జన్య శక్తులతో ప్రతిఘటించడానికి ఇస్లాంలో ఎలాంటి శేషభాషలు లేవని ఈ ఆదేశాలు చదివితే అర్థం అవుతుంది.

"తమ వాగ్దానాలను భంగం చేస్తూ ఉన్నవారితో, సందేశహరుణ్ణి దేశం నుంచి బహిష్కరించాలని నిర్ణయించుకున్న వారితో మీరు యుద్ధం చెయ్యరా? అతిక్రమణను ప్రారంభించింది వారే. మీరు వారికి భయపడుతున్నారా? మీరు గనుక విశ్వాసులే అయితే మీరు భయపడడానికి అల్లాహ్‌యే ఎక్కువ అర్హుడు. కనుక వారితో యుద్ధం చెయ్యండి. అల్లాహ్ మీ చేతుల ద్వారా వారిని శిక్షిస్తాడు. వారిని హీనులుగా, నీచులుగా చేసి అవమానంపాలు చేస్తాడు. ఇంకా వారికి ప్రతికూలంగా మీకు సహాయం చేస్తాడు. చాలా మంది విశ్వాసుల హృదయాలను చల్లబరుస్తాడు." (దివ్యఖుర్ఆన్-9:14)

"పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడే వరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తర్వాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు."

(దివ్యఖుర్ఆన్-2:193)

"ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయడానికి) అనుమతి ఇవ్వబడింది. ఎందుకంటే, వారు అన్యాయానికి గురి అయినవారు. నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్ళ నుండి తరిమివేయబడినవారు. వారి తప్పు కేవలం: "అల్లాహ్ మా ప్రభువు" అని అనడమే. అల్లాహ్ గనుక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు, చర్చిలు, యూదుల ప్రార్థనాలయాలు, మసీదులు- వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడు తుందో-అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్, తనకు సహాయం చేసేవారికి తప్పకుండా సహాయపడతాడు. అల్లాహ్ మహాశక్తి మంతుడు, బలవంతుడును. మేము గనుక భూమిపై వారికి అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజ్‌ను స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు. చెడు నుంచి నిరోధిస్తారు. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతులలో ఉంది."

(దివ్యఖుర్ఆన్- 22:39)

ఈ స్పష్టమైన దైవాదేశాల అధ్యయనం వల్ల తెలిసే విషయమేమిటంటే, ముస్లిముల సమాజానికి, సామూహిక జీవనానికి, ముస్లిముల రాజ్యాధికారానికి ఏదైనా శక్తి వల్ల ప్రమాదం ఎదురైతే, లేదా వారిపై దాడికి పూనుకొంటే, అలాంటి పరిస్థితిలో (ఇస్లామీయ రాజ్యంపైన మోపబడిన)ముఖ్యకర్తవ్యం జిహాద్. మక్కా బహుదైవారాధకుల విషయంలో మక్కా కాలంలో ప్రవక్త ముహమ్మద్ (స), ఆయన సహచరులు సహనాన్ని ప్రదర్శించారు. కాని మదీనా తరలివచ్చాక ఈ వైఖరి మారింది. దౌర్జన్యశక్తుల నుంచి రక్షణ పొందడానికి, దౌర్జన్యపరులను అణచడానికి అనుమతి లభించింది. డాక్టర్ అబ్దుల్ హమీద్ అబూ సులైమాన్ ఇస్లామీయ సూత్రాల వెలుగులో ఈ విషయమై జవాబు కోసం పరిశీలించారు. ఆయన దృష్టిలో మక్కా దశలో ముస్లిములు అదే సమాజంలో ఉంటూ సమాజంలో భావాలోచనల విప్లవం సాధించే ప్రయత్నాలు చేశారు. ఆ సమాజంలో వారు కూడా భాగంగానే ఉన్నారక్కడ. అందువల్ల బలప్రయోగాన్ని త్యజించడం వెనుక ఎలాంటి ఎత్తుగడ, లేదా పాలిసీ లేదు. ధార్మికమైన సూత్రబద్ధ వైఖరి దీనికి కారణం. సమాజంలో నిశ్శబ్ద విప్లవం సాధించడానికి ఈ వైఖరి అవసరమయ్యింది. ఈ కాలంలో ముస్లిములు ప్రవక్త ముహమ్మద్ (స) నేతృత్వంలో ఏకదైవారాధనా విశ్వాసానికి దృఢంగా కట్టుబడి వ్యవహరించారు. మక్కా పాలకులను శాంతియుతంగా ఎదుర్కొనసాగారు. మంచి వ్యవహారశైలితో సత్యసందేశ ప్రచారం కొనసాగించారు. ఈ కాలంలో సహనానికి కట్టుబడి దౌర్జన్యానికి జవాబుగా ఎలాంటి బలప్రయోగానికీ పూనుకోలేదు. శ్రేయోభావం, సహకారం, సదాచరణ, నైతిక ప్రమాణాలను ప్రోత్సహించడం, అవసరార్థులకు, బీదలకు సహాయపడడం కొనసాగించారు. అయితే విశ్వాసవచనం ప్రకటించ డంలో ఎన్నడూ వెనక్కి తగ్గలేదు. స్వయాన ప్రవక్త ముహమ్మద్(స) ప్రవచనం ప్రకారం దుర్మార్గుడైన పాలకుని ముందు సత్యానికి సాక్ష్యమియ్యడం అత్యుత్తమ జిహాద్. మక్కాలో ఈ వైఖరికి కట్టుబడ్డారు. మదీనాలో ఒక ఇస్లామీయ సమాజం, దాని నియమ నిబంధనలు, సలహామండలి వగైరా ఏర్పడే వరకు ఇదే వైఖరి కొనసాగింది. ఈ క్రమాన్ని పరిశీలిస్తే, సమాజం అంతర్గత వ్యవహారాలకు సంబంధించి సహనం

పాటించడం అవసరం. డాక్టర్ అబ్దుల్ హమీద్ మాటల్లో చెప్పాలంటే- "దౌర్జన్యపరుడి దౌర్జన్యం బట్టబయలు అయ్యేవరకు, ముస్లిం సమాజ నాయకత్వం దౌర్జన్యపరుడి దౌర్జన్యాన్ని అడ్డుకొనే శక్తి పొందేవరకు ఇదే వైఖరికి కట్టుబడాలి. సత్యసందేశ ధ్వజవాహకులు, సంస్కరణా ప్రయత్నాలు చేస్తున్న వాళ్ళు, బాధితులు చూపే ఈ సహనమే చివరకు పరిస్థితుల ప్రోద్బలం మేరకు సమాజ పాలకులను, ఇతర ముఖ్యులను దౌర్జన్యపరులకు జవాబిచ్చేలా, దౌర్జన్యాన్ని నిర్మూలించడానికి సిద్ధపడేలా చేస్తుంది."

(తషద్దుద్ ఔర్ సియాసీ కష్మకష్, పేజి.44)

మరో మాటలో చెప్పాలంటే హింసాదౌర్జన్యాలపై వ్యక్తిగతంగా పోరాడే అనుమతి లేదు. మంచిని పెంచడం, చెడును త్రుంచడం ముస్లిం బాధ్యత అని ఇస్లాం పేర్కొంది, అయితే ఈ విషయంలో హింసా దౌర్జన్యాలకు/బలప్రయో గానికి అనుమతి ఇవ్వలేదు. దురదృష్టవశాత్తు ఈ బాధ్యత గురించిన అవగాహన లోపించడం వల్ల, అనవసరంగా అత్యుత్సాహం ప్రదర్శించడం వల్ల లేదా రాజకీయ వ్యక్తిగత, వర్గపరమైన ప్రయోజనాభిలాషల వల్ల అవాంఛనీయ చర్యలు ప్రారంభమవుతున్నాయి. ప్రజలు ఒండొరులపై పోరాటానికి సిద్ధపడుతున్నారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకొంటున్నారు. వ్యక్తిగతంగా తామే నాయకులైనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా దౌర్జన్యపరులపై, లేదా భ్రష్టమార్గం పట్టిన రాజకీయ శక్తులపై వ్యక్తిగతంగాగాని, లేదా చిన్న చిన్న గ్రూపుల రూపంలోగాని సంఘర్షణకు పూనుకోవడం జరుగుతోంది. నిజానికి హృదయాలను జయించే ఇస్లాం, సర్వమానవాళికి బాధలు దుఃఖాల నుంచి విముక్తినివ్వడానికి ప్రపంచంలోకి వచ్చిన ఇస్లాం ఇలాంటి దుడుకు చేష్టలను సహించదు. డాక్టర్ అబ్దుల్ హమీద్ అబూ సులైమాన్ మాటల్లో చెప్పాలంటే, "బలప్రయోగం అన్నది కేవలం ఇస్లామీయ రాజ్య పాలకులకు మాత్రమే ఉన్న శాశ్వతమైన శాసనబద్ధమైన హక్కు. అంతేతప్ప దౌర్జన్యం, అత్యాచారాలకుగాను ప్రజలకు లభించిన సాధనం కాదు. లేదా వివిధ వర్గాలకు పరస్పర విభేదాల పరిష్కారానికి ఒకరిపై ఒకరు ప్రాబల్యం పొందడానికి లభించిన ఆయుధమూ కాదు."

(తషద్దుద్ ఔర్ సియాసీ కష్మకష్, పేజి.46)

అరాచకం, హింసాదౌర్జన్యాలు చెలరేగితే, సమాజంలోని వివిధ వర్గాలు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్న పరిస్థితుల్లో- ఈ పరిస్థితులకు దూరంగా, వేరుగా జోక్యం లేకుండా ఉండాలని బోధించడం జరిగింది. హజ్రత్ అబూజర్ (రజి) చెప్పిన హదీసు ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) తన ఆఖరు దశలో ఓసారి అబూజర్ (రజి)ను ఉద్దేశించి చెప్పిన మాటలు- "అబూజర్! సమాధులు త్రవ్వేవారు, శవాన్ని ఖననం చేసేవాళ్ళు ఎవరూ కనబడని పరిస్థితుల్లో మృత్యువు ఎదురయ్యే అరాచక స్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నప్పుడు నీ పరిస్థితి ఏమిటి? యిలాంటి పరిస్థితిలో నువ్వు సహనం వహించు" అన్నారు ప్రవక్త (స). ఇంకా "నువ్వు జీత్ ప్రాంతాన్ని రక్తంలో మునిగి ఉండగా చూసే కాలంలో, నీకు సంబంధించిన వారి వెంట (నువ్వు ప్రయాణం చేసిన నాయకునితో) ఉండు" అన్నారు. అప్పుడు హజ్రత్ అబూజర్ (రజి), "ప్రవక్తా(స)! అలాంటి పరిస్థితిలో నేను కత్తిదూసి నిలబడరాదా" అన్నారు. జవాబుగా ప్రవక్త (స), "అప్పుడు నువ్వు కూడా వారిలోనే చేరిపోతావు" అన్నారు. అబూజర్ (రజి) అప్పుడు, "అలాంటి పరిస్థితిలో నేను ఏం చేయాలని ఆజ్ఞ" అని అడిగారు. ప్రవక్త (స) జవాబిస్తూ, "నువ్వు నీ యింటిలోనే ఉండు. కత్తి మెరుపు నీపై ప్రభావం వేస్తుందని అనుకొంటే, నీ ముఖంపై కప్పుకో, దాడిచేసినవాడు నీ పాపాన్నీ, తన పాపాన్నీ తన నెత్తినే వేసుకొంటాడు."

సమాజంలో, స్వయంగా తన యింట అరాచకం ఉపద్రవం తలెత్తినప్పుడు అందులో జోక్యం చేసుకోకుండా, వేరుగా ఉండాలని ఈ హదీసు బోధిస్తోంది.

# లజ్జలేని పాశ్చాత్య పోకడ

పాశ్చాత్య, యూద, హిందూ ఫాసిస్టు, నాస్తిక, ధర్మవ్యతిరేక వర్గాలన్నింటికీ ఇటీవల 'ఇస్లామీయ ఉగ్రవాదం' అన్న పదం అత్యంత ఆసక్తికరమైనదిగా తయారయ్యింది. ప్రస్తుత అంతర్జాతీయ యూద మీడియాకు, దాని అడుగుజాడల్లో నడిచే భారత దేశంలోని ఫాసిస్టు శక్తులకు, పౌరాణిక సంస్కృతి ధ్వజవాహకులకు, ఇంకా చెప్పాలంటే పాశ్చాత్యులు విదిల్చే ఎంగిలి చేతులకై ఎగబడే మీడియాకు ఈ పదం అత్యంత యిష్టమైన పదంగా మారింది. శతాబ్దాల నాటి క్రూసేడు యుద్ధాల గాయాలు యూరప్‌లో కొందరికి మళ్ళీ గుర్తొచ్చాయి. ఇలాంటి వాళ్ళంతా కలసి ఇస్లాంను అప్రదిష్టపాలు చేయడానికి రాత్రింబవలు ప్రయత్నిస్తున్నారు. టెర్రరిజం ఇస్లామ్‌కు మారుపేరు అన్నట్లు మాట్లాడుతున్నారు. కాగా, వాస్తవానికి కేవలం యుద్ధం కోసం యుద్ధానికి దిగడం, లేదా ఆయుధ పాటవ ప్రదర్శనకు పోరాటానికి పూనుకోవడం అన్నది ఇస్లామీయ చరిత్రలో ఎక్కడా కనబడదు. ఇలాంటి రక్తపాతాలను, ఇలాంటి హంతకులను మానవత్వానికి పెద్ద శత్రువులుగా ఇస్లాం పేర్కొంటుంది. లజ్జలేని వాదనచేసే పాశ్చాత్యులు భారతీయ ఫాసిస్టులు, సామ్యవాద రంధ్రాన్వేషకులు, వీరికి తోడు ధార్మిక విశ్వాసాన్ని అమ్ముకొనే వాళ్ళు ఇస్లాంలోని జిహాద్‌కు సంబంధించిన ఆదేశాలకు చేసిన విశదీకరణ ద్వారా జిహాద్ కత్తిబలంతో ఇస్లాంను వ్యాపింపజేసే సాధనంగా ప్రత్యర్థుల నరసంహారానికి సాకుగా చిత్రించారు.

మన చరిత్రలో ఎల్లప్పుడూ ప్రజలు దౌర్జన్యాలను ఎదిరించడం జరిగింది. మానవ హక్కులను కబళించడం జరిగిన ప్రతిసారీ, న్యాయాన్ని నిరాకరించిన ప్రతిసారీ, ప్రజలు మరో దారిలేక చావుకు తెగించి ఎదిరించారు లేదా రహస్య కార్య కలాపాలు ప్రారంభించారు.

వివిధ దేశాలలో తలెత్తిన అంతర్యుద్ధాలు, హింసాదౌర్జన్యాలు, టెర్రరిజం, అరాచకం, అలజడి, అల్లర్ల సంఘటనలు పరిశీలిస్తే, వాటి వెనుక కారణాలు, చాలా వరకు రాజ్యహింస లేదా పాలకవర్గాల హింసా దౌర్జన్యాలని తెలుస్తుంది.

అల్జీరియా, ఈజిప్ట్, ట్యూనీషియా, లిబియా, చెచెన్యా తదితర దేశాలలో సైనిక పాలకులు, మానవ హక్కులను కబళించేవారు, రాజకీయ నాయకుల అహంకారాల వల్ల నిరంతరం రక్తపాతాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు న్యాయబద్ధ వైఖరికి స్వస్తిపలికాయి. హింసా దౌర్జన్యాలను నిరోధించడంలో విఫలమయ్యాయి. ఇంకా చెప్పాలంటే, స్వయంగా దౌర్జన్యాలకు, అత్యాచారాలకు సాధనంగా మారాయి. శాంతియుతంగా మార్పులు సాధించే పరిస్థితి లేనందువల్ల నిరాశా నిస్పృహలకు గురయిన ప్రజలు, యువకులు ఆయుధాలు చేపట్టారు.

న్యాయం లభించకపోవడమే టెర్రరిజానికి ముఖ్యకారణం అయ్యింది. బాధిత ప్రజలకు, దౌర్జన్యాలకు గురయినవారికి ప్రభుత్వ యంత్రాంగం న్యాయం చేయలేకపోతే, దౌర్జన్యపరులతో ప్రతీకారం తీర్చుకోవాలన్న భావనలు బాధితుల మనస్సులో తలెత్తుతాయి. భారతదేశంలో మతకలహాల సుదీర్ఘ బీభత్సభరిత సంఘటనలు ఉన్నాయి. మత ఘర్షణల సందర్భంగా పోలీసులు, పి.ఏ.సీ. వంటి అర్ధసైనిక బలగాలు, ప్రభుత్వ యంత్రాంగం బాహాటంగా మైనారిటీలకు వ్యతిరేకంగా వ్యవహరించడం, హత్యా విధ్వంసకాండల్లో పాల్గొనడం, అందుకు సంబంధించి స్పష్టమైన సాక్ష్యాధారాలు లభించడం, తుదకు విచారణసంఘాల నివేదికలలోనూ వారిని నేరస్తులుగా నిర్ధారించడం-ఇవన్నీ జరుగుతున్నప్పటికీ పాలక వర్గాలు ఎన్నడూ యే ఒక్క నేరస్తునికి, ఇలాంటి ఉగ్రవాదికి శిక్ష విధించ లేదు. ఈ పరిస్థితులలో, సహజంగానే ప్రజలలో అలజడి, అపనమ్మకం తలెత్తుతాయి. న్యాయం లభించకపోవడం, బాహాటంగా నేరస్తులకు ప్రోత్సాహం లభించడం చూసిన ప్రజలు ఆయుధాలు చేపడితే, ఆ పరిణామం నేరం న్యాయాలకు సంబంధించిన ఒక సహజ ప్రతిస్పందనగా భావించబడుతుంది. అంతే తప్ప టెర్రరిజంగా భావించబడదు.

## టెర్రరిజానికి మతం లేదు

టెర్రరిజం ముఖ్యస్వభావం- ఆగ్రహావేశాల వల్ల లేదా ఒక పథకం ప్రకారం ఏదైనా సమస్య పరిష్కారానికి లేదా ప్రభుత్వం పట్ల లేదా ఏదైనా

రాజకీయ వర్గం పట్ల వ్యతిరేకతతో, లేదా పత్రికల ద్వారా పేరు సంపాదించడానికి భీతావహ వాతావరణాన్ని సృష్టించి తమ డిమాండ్లు సాధించుకొనే ప్రయత్నం చేయడం, ప్రభుత్వ బలహీనతలు బట్టబయలు చేయడం, ప్రభుత్వ ప్రతిస్పందన దృష్ట్యా ప్రజల సానుభూతి సంపాదించడం. ఇలాంటి వారు సాధారణంగా సిద్ధాంతాల, సూత్రాల ముసుగులు కప్పుకుంటారు. లేదా వారికి సంబంధించి కొన్ని సముచితమైన సమస్యలు ఉండొచ్చు. లేదా వారికి వారి కుటుంబాలకు వ్యతిరేకంగా లేదా వారి వర్గం, జాతి, ప్రాంతాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ అణచివేత ఉండొచ్చు. ఈ కారణాల వల్ల వారు ఆయుధాలు చేపట్టి ఉండొచ్చు. కాని ప్రపంచంలోని యే మతం కూడా, ప్రత్యేకించి ఇస్లాం ఇలాంటి అనుమతి ఇవ్వదు. అమాయకులపై దాడి చేయడాన్ని, ఒక దౌర్జన్యానికి ప్రతిగా అంతకన్నా పెద్ద దౌర్జన్యానికి పాల్పడడాన్ని ఇస్లాం అంగీకరించదు. వాస్తవమేమిటంటే, భౌతిక పూజలో మునిగిన పాశ్చాత్య వ్యవస్థ, సామ్యవాద ఫిలాసఫీ తుపాకీ సంస్కృతిని ప్రోత్సహించాయి. ఈ సంస్కృతి ఒడిలో పెరిగి పెద్దయిన కొత్త తరాలు రక్తపాతానికి తెగించేవిగా మారాయి.

ఇస్లాం తుపాకీ సంస్కృతిని, రక్తపాతాలను, హింసా హత్యాకాండలను, అమాయకులపై దాడులను నేరాలుగా పేర్కొంటుంది. అంతేకాదు సాంస్కృతిక, విద్యావిషయిక, ఆర్థిక ఉగ్రవాదాలను, ఫాసిజాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. నేడు ప్రపంచంలోని వివిధ దేశాలలో జాత్యాహంకారం, సంస్కృతి, భాషల దురభిమానాలు దౌర్జన్యాలకు సంబంధించిన భయానక సంఘటనలు మన ముందుకు వస్తున్నాయి. సుదీర్ఘ ఇస్లామీయ చరిత్రలో ఇలాంటి ఉగ్రవాదాలకు సంబంధించిన ఒక్క ఉదాహరణ కూడా కానరాదు. రష్యా, అమెరికా, పాశ్చాత్య దేశాలలో, స్వయంగా భారతదేశంలో ప్రజాస్వామ్య ఛత్రఛాయల్లో, మానవీయ విలువల చాటున దిగ్భ్రాంతి కలిగించే సాంస్కృతిక దౌర్జన్యాలు జరుగుతున్నాయి.

రాజకీయాధికారం ఆసరాతో గర్వంగా, ఇతరుల భాషా సంస్కృతులను అణగద్రొక్కడానికి, వారిని దేశం నుంచి బహిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు.

అంతర్జాతీయంగా చూస్తే, రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో పాశ్చాత్య వ్యవస్థను నాజియిజం భూతం ఆవహించింది. ఆ పిదప సోషలిజం ఒక మహా ప్రమాదంగా వారి ముందుకు వచ్చింది. ఇప్పుడు ఈ రెండూ కుప్పకూలిన తర్వాత పాశ్చాత్య వ్యవస్థకు ఒక కొత్త ప్రత్యర్థి కావలసివచ్చింది. చరిత్రను తవ్వి ఆ ప్రత్యర్థిని కనిపెట్టింది. శతాబ్దాలకు పూర్వం రిచర్డ్ ధర్డ్ నేతృత్వంలోని పూర్తి పాశ్చాత్య ప్రపంచాన్ని ఓడించి బైతుల్ ముఖద్దస్‌ను కాపాడి, అక్కడి పవిత్రతను పునఃస్థాపించిన సలాహుద్దీన్ అయ్యూబి కరవాలం మెరుపులు వారికి గుర్తొచ్చాయి. యూరప్‌లోని యూద మీడియా ఇస్లాం గురించి భయానకంగా చిత్రీకరించడం ప్రారంభించింది. ప్రపంచ మానవాళికి ఒకే ఒక్క ప్రమాదం ఇస్లాం, ముస్లిములన్నట్లు కథనాల ప్రచారం మొదలయ్యింది. జాన్ ఎల్ ఎస్పొజిటో (Esposito) రాసిన పుస్తకం "The Islamic Threat"లో పాశ్చాత్య వ్యవస్థలోని ఉగ్రవాదాన్ని క్రింది విధంగా ప్రస్తావించాడు:

"ముస్లిములు వస్తున్నారు. ముస్లిములు వస్తున్నారు-పాశ్చాత్య భయభీతులకు ఒక హాస్యాస్పదమైన ఉదాహరణ, ఒక అతిశయోక్తి ఈ అభిప్రాయం. అయినా, అమెరికా ఉపాధ్యక్షుడు 'డాన్ క్వేల్' తీవ్రవాద, ఇస్లామీయ ఛాందసవాదం, ప్రమాదాల గురించి వివరిస్తారు. ఫాసిజం, కమ్యూనిజాలతో సంబంధం జోడిస్తారు. ప్రజాస్వామ్యానికి పొంతనలేని విషయాన్ని ప్రసంగిస్తారు. 'బోస్టన్ గ్లోబ్' (Boston Globe) ఇస్లాం గురించి, ఇస్లాం ఖడ్గం అన్న శీర్షికన ధారావాహికంగా వ్యాసాలు ప్రారంభిస్తుంది. ఇందులో వాస్తవం ఎంత ఉంది కట్టుకథలు ఎక్కడి నుంచి ప్రారంభమవుతాయన్నది తెలుసుకోవడం కష్టం." (The Islamic Threat, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, న్యూయార్క్, 1993, పేజి.168)

ఇస్లామీయ దేశాలలోని కొందరు నియంతలను, లేదా అమెరికా ఇష్టానికి విరుద్ధంగా తలెత్తిన విప్లవాలను సాకుగా చేసుకొని పాశ్చాత్య వ్యవస్థ పూర్తి ఇస్లామీయ ప్రపంచంపై నిర్లజ్జగా బురదజల్లడం ఆధునిక ప్రపంచ చరిత్రలో

దిగ్భ్రాంతి గొలిపే పరిణామం. విచిత్రమేమంటే, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సి.ఐ.ఏ. ద్వారా అమెరికా పాల్పడిన నేరాలు, కుట్రలు కుతంత్రాల కార్య కలాపాలతోనే చరిత్ర పుటలు నిండి ఉన్నాయి. ఎస్పొజిటో మాటల్లో చెప్పా లంటే, పాశ్చాత్య వ్యవస్థ తన వ్యాపార ప్రయోజనాలకు, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు భంగం కలిగే అనుమానం ఏమాత్రం కలిగినా ప్రత్యర్థులపై ఆరోపణల వర్షం కురిపించడం దానికి అలవాటు, అనేకానేక హాస్యాస్పద విమర్శలు గుప్పిస్తుంది. ఓసారి సామ్యవాదంపై ఈ విమర్శలు సంధిస్తే, మరోసారి ఇస్లాంపై విసురు తుంది. గల్ఫ్‌యుద్ధం కాలంలో అమెరికా నూతన ప్రపంచ సరళి అనే సందేశంతో ముందుకు రావాలని అనుకొంది. మానవ హక్కులు స్వేచ్ఛా ప్రజాస్వామ్యాలు పెంపొందించే విషయంలో తూర్పు యూరప్, ఆసియా, ఆఫ్రికా దేశాల గురించి పాశ్చాత్య వ్యవస్థకు చాలా చింత ఉండేది. కాని, అదే అమెరికా ఈ ప్రాంతాలలోని ముస్లిం ప్రజానీకం, జనాభిప్రాయం ప్రాతిపదికన, మెజారిటి ఆధారంగా పాశ్చాత్య ధర్మరహిత ప్రజాస్వామ్యానికి బదులు, ఇస్లామీయ సలహామండలి ఆధారంగా నడిచే ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పరచుకోడానికి చేసిన ప్రయత్నాలు యేమాత్రం నచ్చలేదు. అందువల్లనే ఆయా ప్రాంతాల్లో స్వార్థపరులయిన, మోసగాళ్ళయిన, దయాదాక్షిణ్యాలు లేని నియంతలకు ప్రజాస్వామ్య పతాకాన్ని పట్టుకు తిరిగే అమెరికా పూర్తి మద్దతు ఇచ్చింది. ఆ నియంతలు తమ దేశాల్లో ప్రజాభిప్రాయాన్ని అణచివేయడానికి తోడ్పాటు అందించింది. ట్యూనీషియా, అల్జీరియాలలో నియంతలను అక్కడి ప్రజలపై రుద్దింది అమెరికాయే. ఈ నియంతలు ఎలాంటి రక్తపాతానికి పాల్పడ్డారో యావత్ ప్రపంచానికి బాగా తెలుసు.

ఇరవయ్యో శతాబ్దం ద్వితీయార్థం నుంచి పాశ్చాత్య దేశాల్లోని సమాజాల్లో ముస్లిములు సుదీర్ఘకాలంగా సాంకేతిక, వైద్య, వాణిజ్య, సంస్థాగత సేవలు అందిస్తున్నాయి. శాంతియుత పౌరులుగా జీవిస్తున్నారు. ఈ వాస్తవాన్ని పాశ్చాత్య వ్యవస్థ కళ్ళారా చూసింది. అయినప్పటికీ పాశ్చాత్య మేధావులు, మీడియాల

రాతల్లో వారిని శాంతికి వ్యతిరేకులుగానే చిత్రించడం పట్ల ఎస్పొజిటో ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఇలా రాశారు:

"ఇస్లాంను, ముస్లిములను అరాచకవాదులుగా, అల్లరి శక్తులుగా, యుద్ధ పిపాసులుగా చిత్రీకరించడం గత 14 శతాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఇస్లామ్ దౌర్జన్యకరమైనదని అంటూ, ముస్లిముల ఆచరణలను దౌర్జన్యాలుగా చూపించడం జరుగుతోంది. దాడులు, జిహాద్, అన్నింటికీ వారినే బాధ్యులుగా చేయడం జరుగుతుంది. కాగా దీనిని నిరోధించే శక్తిగా, దౌర్జన్యానికి జవా బిచ్చేవిగా, క్రూసేడు యుద్ధాలు చేసినదిగా, తమ నుంచి లాక్కున్న భూభాగాలను తిరిగి జయించేదిగా, ఒక నిష్కళంక చరిత్రగలదిగా పాశ్చాత్య వ్యవస్థను చూపించడం జరుగుతోంది." (ఇస్లామిక్ థ్రెట్, పేజి.178)

పాశ్చాత్య వ్యవస్థ అభిప్రాయాన్ని బెర్నార్డ్ లీవిస్ తన పుస్తకంలో చక్కగా వివరించాడు:

"ఛాందసవాదం అన్నది మోడర్నిజానికి, సెక్యులరిజానికి, పాశ్చాత్య పెట్టుబడి దారీ విధానానికి వ్యతిరేకం. గత జీవన విధానాన్ని ఎల్లప్పుడూ మారుతూ ఉండే ఆధునిక జీవన శైలికి పోటీగా నిలబెట్టాలని ఇది భావిస్తోంది."

పాశ్చాత్య మేధావులు దీన్ని రెండు సంస్కృతుల ఘర్షణగా పేర్కొంటు న్నారు. ఇందులో ఒకటి పాత ప్రత్యర్థి. అది యూద, క్రైస్తవ సాంస్కృతిక వారసత్వా నికి, ధర్మరహిత జీవన విధానానికి, అలాంటి విధానం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడానికి విరుద్ధంగా ప్రతిఘటిస్తోంది.

ఇరవయ్యో శతాబ్దంలో అంతర్జాతీయంగా చోటుచేసుకొన్న హింసా దౌర్జన్యకాండల గురించి బాగా తెలిసిన వారికి ఓ వాస్తవం గురించి చెప్పనవసరం లేదు. ఈ వాస్తవాన్ని పాశ్చాత్య మేధావి ఎస్పొజిటో కూడా ప్రస్తావించాడు. అదేమంటే, రక్తపాతాలు, సంఘర్షణలు అత్యధికంగా ధర్మరాహిత్యం వల్ల జరిగాయి. జాత్యాహంకారం, తెగల గర్వం, ప్రాంతీయ దురభిమానం, భౌతిక ప్రయోజనాలు తదితర కారణాల వల్ల జరిగాయి. గత శతాబ్దంలో అంతర్జాతీయంగా విస్తరించి ఉన్న ఉగ్రవాద సంస్థల వివరాలు పరిశీలిస్తే,

పాలస్తీనా, కశ్మీరు వంటి ప్రాంతాల్లో చురుకుగా ఉన్న ముస్లిములకు సంబంధించిన సంస్థల సంఖ్య బహు స్వల్పం. స్వయాన భారతదేశంలో సామ్యవాద, హిందూ ఫాసిస్టు శక్తుల ఉగ్రవాద చర్యల జాబితా చాలా పెద్దది. కాగా, బహుశా ముస్లిములకు సంబంధించిన ఒక్క సంస్థ కూడా ఆ కాలంలో కానరాదు.

ఇస్లాం, ముస్లిములకు టెర్రరిజంతో సంబంధం కలుపడానికి, ఆధునిక జాతులలో ఒకటిగా పరిగణన పొందకుండా చేయడానికి, పాశ్చాత్య వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాలకు కారణం ఇస్లాంకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేక పోవడమేనని కూడా చెప్పడం జరిగింది. ఒకవేళ ముస్లిములు స్వేచ్ఛాయుత ఎన్నికల ద్వారా భారీ మెజారిటీ పొంది, ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఇస్లామీయ వ్యవస్థను స్థాపించదలిచినా, పాశ్చాత్య మేధావుల దృష్టిలో ఈ వైఖరి ఫాసిజం, ప్రజాస్వామ్య విరుద్ధం అయిపోతుంది. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు మతప్రసక్తిలేని చట్టాలు చేయడం తప్పనిసరి కాబట్టి శాసనాలు చేసే హక్కు కేవలం దేవునికే ఉందని భావించడం వారి దృష్టిలో నేరం అవుతుంది. క్షమార్హం కాని నేరం. పాశ్చాత్య మేధావి లెస్లీ గెల్బ్ (Leslie Gelb) ఏం రాశాడంటే-

"ప్రస్తుత కాలంలో ఇస్లామీయ దేశాలన్నింటా స్వేచ్ఛాయుత ఎన్నికల ఫలితాలు ఛాందసవాదుల విజయాలుగానే ఉంటాయి. ఈ విధంగా ధార్మిక ప్రభుత్వం (Theocracy)* ఏర్పరచడానికి కారణమవుతాయి. వివిధ అరబ్బు దేశాల్లో ఛాందసవాదులు స్వేచ్ఛాయుత ఎన్నికలపై ప్రభావం వేస్తున్నారు. అణగారిన, బలహీన ప్రజలకు రక్షకులుగా తమనుతాము ప్రచారం చేసుకొంటూ తాము ఆశించిన విధంగా విజయాలు పొందుతున్నారు. కాని వాళ్ళు నిజంగా

---

* *ఇది పారిభాషిక పదం. క్రైస్తవ ప్రపంచంలో మత పెద్దలు పాలకులుగా ఉండే ప్రభుత్వాన్ని సూచిస్తుంది. కాని క్రైస్తవ చరిత్రలోని అంధకారయుగంలో మత పెద్దలు పాలకులుగా ఉండేవారు. మతం పేర ప్రజలపై గ్రుడ్డిగా దౌర్జన్యాలకు పాల్పడేవారు. అందువల్ల ఈ పదం నాగరిక సమాజంలో దూషణగా భావించబడుతోంది.*

ప్రజా స్వామ్యాన్ని పెంపొందించే అభిప్రాయంలో ఉన్నారా అన్నది ఆలోచించదగ్గ ప్రశ్న. ఇస్లాంలో మతానికి, రాజకీయాలకు మధ్య ఎలాంటి విభజన లేదు. సౌదీ అరేబియా ఒక ప్రజాస్వామ్యరహిత దేశం. కాని పూర్తిగా ఇస్లామీయ దేశం. ఒకవేళ అక్కడ రాజకీయ కార్యకలాపాలకు వెసులుబాటు లభిస్తే, బహుశా అక్కడ ఉన్న స్వేచ్ఛ మరింత అంతరిస్తుంది. (ప్రజాస్వామ్య కార్యకలాపాలకు అనుమతించిన తర్వాత) అక్కడ నిష్పక్షపాతంగా, ప్రజాప్రయోజనాలకు పనిచేసే సంస్థ యేదీ ఉండదు. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం జరిగినా పూర్తి స్థాయి విలువ లభించనప్పుడు ఎన్నికలు హాస్యాస్పదంగా తయారవుతాయి." (The Free Elections Trap- Newyork Times, May 29,1991)

పాశ్చాత్య వ్యవస్థ దృష్టిలో ప్రజాస్వామ్యానికి ఉన్న అర్థం, ప్రజాస్వామ్యం పట్ల ఉన్న మర్యాద ఎలాంటిదో పై పంక్తులు చెబుతున్నాయి. అమెరికా తన ప్రయోజనాల కారణంగా కొన్ని అరబ్బు దేశాల్లో రాజరికాన్ని, కొన్ని దేశాల్లో నియంతృత్వానికి ప్రజాస్వామ్యంకన్నా అధిక ప్రాధాన్యం ఇచ్చింది. అమెరికాకు తన సాంస్కృతిక ఎజెండా, సాంస్కృతిక పునాదుల చింత ఎంతగా ఉందంటే, అది యే దేశంలో అయినా సరే అక్కడి ప్రజాభిప్రాయాన్ని కాలరాచి కొందరు నియంతలు వారి సైన్యం సహాయ సహకారాలతో తన ఎజెండాను అమలు చేయడం ప్రజాస్వామ్యంగా భావిస్తుంది. దీనికి వ్యతిరేకంగా ప్రతిస్పందన వస్తే దాన్ని టెర్రరిజంగా, ఫాసిజంగా పేర్కొని మానవాళికి ప్రమాదంగా ప్రచారం చేస్తుంది. మధ్యప్రాచ్యంలో పాశ్చాత్య వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని రూపుమాపింది. ఇస్లాం ప్రమాదం లేని సురక్షిత ప్రజాస్వామ్యాన్ని (Risk Free Democracy) అమలుచేస్తోంది. ఇదంతా యూద క్రైస్తవ సామ్రాజ్యవాద మనస్తత్వానికి నిదర్శనం.

నిజానికి మొదటిసారి కూడా మానవాళికి దౌర్జన్యం అణచివేతలు, టెర్రరిజం నుంచి విముక్తి ప్రసాదించింది ఇస్లామ్. మానవాళి పాశవిక, అజ్ఞానభరిత అంధకారాల్లో ఉన్నప్పుడు, భయానక, క్రూరపాలకుల గుప్పిట విలవిలలాడు తున్నప్పుడు అది విముక్తి ప్రసాదించింది. ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ, మానవ హక్కుల రక్షణ, మానవ ఔన్నత్య పరిరక్షణకు

సంబంధించి నేడు కూడా అది కీలక పాత్ర పోషించే స్థాయిలో ఉంది. ఎందుకంటే, ఇస్లాంలో సమానత్వం, భావప్రకటనా స్వేచ్ఛ, సలహామండలి నిర్మాణం, పరస్పర సలహా సంప్రదింపులు, మానవ ఔన్నత్యం, మర్యాదలు ఉన్నాయి. నేడు ఇస్లామీయ ప్రపంచంలో ఇస్లాం ప్రగతీ వికాసాల కొరకు పనిచేస్తున్న సంస్థల్లో ప్రజాస్వామ్యం ఒక మౌలిక సూత్రంగా ఉంది. పాశ్చాత్య సంస్కృతిలోని అనైతిక తళుకుబెళుకుల మాయలో పడడానికి విశృంఖలత్వం, విచ్చలవిడితనాలకు వ్యాపింపజేసే దగా మోసాలు, టెర్రరిస్టు పోకడల ముందు తలవంచడానికి ఈ సంస్థలు సిద్ధంగా లేవు. పాశ్చాత్యుల పరిస్థితి ఎలా ఉందంటే, ఒక ప్రాచ్య మహిళ తన తలపై స్కార్ఫ్‌ను తొలగించకపోతే చాలు తోడేళ్ళ మాదిరిగా చూస్తారు. ఆమె వస్త్ర ధారణపై విమర్శల వర్షం కురిపిస్తారు.

ఇస్లామీయ విలువలు, ప్రజాస్వామ్య విలువలు పరస్పరం విరుద్ధమైనవిగా పేర్కొనే వారు నిజానికి మనిషికి పశుప్రవృత్తి కలిగి ఉండే హక్కు కోసం ఎలాంటి స్వేచ్ఛనయినా సరే ఇవ్వడానికి సిద్ధం. ఆధునిక ఇస్లామీయ తాత్వికులు ఇస్లామీయ పాలనా వ్యవస్థను రాచరికం, నియంతృత్వం లాంటి కాలుష్యాల నుంచి శుభ్రం చేసి, స్వచ్ఛమైన సలహామండలి వ్యవస్థ పునరుజ్జీవనానికి కృషి చేస్తున్నారు. దురదృష్టవశాత్తు, వీరి దేశాలలో పాశ్చాత్యుల తోడ్పాటు కారణంగా నియంతలు పాలిస్తున్నారు. ఈ నియంతలు తమ ఆలోచనాసరళిని మార్చుకోవడమన్నా జరుగుతుంది. లేదా ఫ్రాన్సు విప్లవం మాదిరిగా లేదా ఈరాన్‌లో షా మాదిరిగా తాము తొలిగి, సలహామండలి వ్యవస్థ కోసం జాగా ఖాళీ చేయడమన్నా జరిగితీరుతుంది.

ఇస్లామీయ సమాజంలో ముస్లిమేతర అల్పసంఖ్యాకులకు గొంతువిప్పే స్వేచ్ఛ ఉండదనీ, లేదా ఇస్లామీయ సమాజంలో స్వేచ్ఛగా శాసనాలు చేసే వీలు లేదనీ, నిర్ణయాలు తీసుకొనే పూర్తి స్వేచ్ఛ ప్రజాప్రతినిధులకు ఉండదనీ పాశ్చాత్య వ్యవస్థ ఇస్లామీయ ప్రభుత్వ యంత్రాంగంపై విమర్శలు గుప్పిస్తుంది. ఇస్లామీయ సమాజంలో ముస్లిమేతర అల్పసంఖ్యాకులకు చర్చలు సంప్రదింపుల వల్ల లభించే ప్రయోజనాలు ఏవీ ఉండవనీ, ఎందుకంటే వారి హోదా, వారి హక్కులు అన్నీ ముందే నిర్ణయమైపోయి ఉంటాయని విమర్శిస్తారు.

ఈ విమర్శ చేస్తున్న సమాజాలలో అల్పసంఖ్యాకులకు వారి ఆలోచనలు, విశ్వాసాల కారణంగానే కాదు వర్ణం, జాతి, భాషల ప్రాతిపదికన కూడా శతాబ్దాలుగా వేధింపులకు గురిచేయడం జరుగుతూ వస్తోంది. అంతేకాదు, ఆ సమాజాల్లో అల్పసంఖ్యాకులు దేశాధినేతలు కావడం కాదు కదా ముఖ్యమైన పదవులు పొందే కల కూడా చూడలేని స్థితి ఉంది. కాగా ఇస్లాంలో అల్పసంఖ్యాకులకు అన్ని విధాల స్వేచ్ఛ ఉంది. వారు ఇస్లామీయ జీవన వ్యవస్థ పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటిస్తే దేశాధినేతలు అయ్యే అవకాశమూ ఉంది.

పదిహేడవ శతాబ్దం తర్వాత పాశ్చాత్య వ్యవస్థ మతాన్ని, రాజకీయాలను వేరు వేరు చేసింది. ఒకదాని విషయంలో మరొకదాని ప్రమేయం లేకుండా చేసింది. మతం అంటే కేవలం కొన్ని ఆరాధనలు, వ్యక్తిగత జీవితంలోని నైతిక నియ మాలు, ఆచారాలకు సంబంధించిన ఒక నియమావళి మాత్రమేనని బలంగా అభిప్రాయపడింది. జీవితంలోని మిగిలిన ముఖ్యమైన రంగాలలో మతానికి ఎలాంటి పాత్ర లేదని భావించింది. ఎస్పొజిటో మాటల్లో-

"మతం గురించి ఆధునిక భావన ఏమంటే, ఇది విశ్వాసాల ఒక వ్యవస్థ. ఇది వ్యక్తిగత జీవితానికి సంబంధించినది. రాజ్యం, చర్చి వేర్వేరు అన్న భావన ప్రసిద్ధిగాంచింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ భావన అయ్యింది. ఈ భావన గతకాలాల ఆలోచనలను, ఆచరణలను మరుగునపడేలా చేసింది. చాలా మంది దృష్టిలో ఈ భావన అంతంకాని, శాశ్వతమైన సత్యం. అందువల్ల ఆధునిక సెక్యులర్ దృక్పథం ప్రకారం, మతంతో రాజకీయాలను కలుషితం చేయడం, అసాధారణమైన, ప్రమాదకరమైన, తీవ్రవాద చర్యగా భావించబడుతుంది. చివరకు పాశ్చాత్య దేశాలలో సెక్యులర్ భావాలు గలవాళ్ళు ప్రభుత్వ అధికారు లయినా, రాజకీయ విశ్లేషకులయినా, సాధారణ ప్రజలయినా, ఎవరైనా సరే వారికి ఇస్లాంను ఒక సంపూర్ణ జీవన వ్యవస్థగా భావించే ముస్లిములు లేదా ముస్లిం సంస్థలు తారసపడితే తక్షణం ఛాందసవాదులని వారిపై ముద్రవేస్తారు. తిరోగమన భావాలు, ఆలోచనలు గలవారనీ, మార్పులకు వ్యతిరేకులనీ, ప్రపంచానికి ప్రమాదకరమైన ఉన్మాదు లనీ భావిస్తారు. అనేక ముస్లిం దేశాలలో

పాలకుల ధోరణి కీలక పదవుల్లో ఉన్నవారి వైఖరి కూడా ఇదే. కొందరు ఆవేశం గల యువకులు, వారి గ్రూపులు చేపట్టిన కొన్ని హింసాయుత కార్యకలాపాలను ఉదాహరణగా చూపించి మతాన్ని, రాజ్యాన్ని సమ్మిళితం చేయడం వల్ల ఇలాంటి ఫలితాలే వాటిల్లుతాయని అంటారు."(Islamic Threat, Esposito-పేజి.199)

మతానికి మనిషి సామాజిక జీవనంలో ఎలాంటి పాత్ర ఉండరాదన్నది పాశ్చాత్య ఆలోచనా విధానం. ఇస్లాంను సరిగా అవగాహన చేసుకొనే విషయంలో ఈ ఆలోచనా విధానమే ఆటంకం అవుతోంది. పాశ్చాత్య సంస్థలన్నింటా, వారి విద్యా విజ్ఞానాలన్నింటా, వారి వ్యవహారాలన్నింటా ఈ ఆలోచనా విధానమే ప్రవహిస్తోంది. ఈ పరిధిని దాటి వారు ఆలోచించరు. గత అనేక శతాబ్దాలుగా వాళ్ళు మతాన్ని (క్రైస్తవాన్ని) ఎంతగా తుంగల్లో తొక్కారంటే, నేడు మతానికి గౌరవప్రద స్థానం అన్నది వారి ఊహల్లోకి కూడా రాదు. గతంలో మతానికి పునరుజ్జీవనం గురించి ఎవరైనా ఆలోచించినా, ఆ వ్యక్తిపై ఛాందసవాది అన్న ముద్రవేసేవారు. ఇప్పుడు ఇస్లాంపై వేస్తున్నారు. తీవ్రవాదం, హింసా దౌర్జన్యాలతో సంబంధాన్ని ఆపాదిస్తున్నారు. పాశ్చాత్య ప్రపంచంలో అనుదినం జీవనశైలి మారిపోవడం ప్రతిరోజూ జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలో మనిషి మతానికి, నైతిక ప్రమాణాలకు దూరం కావడం, నేటి ఆధునిక యుగం ప్రత్యేకత. ఈ లక్షణాలను తొలగించగల శక్తియేదీ లేదు. ఎస్పొజిటో మాటల్లో చెప్పాలంటే ఆధునిక భావాల యుగం (పదిహేడవ శతాబ్దం తర్వాతి యూరోపియన్ యుగం) తర్వాతి నుంచి మతాన్ని వ్యక్తిగత విశ్వాసంగా భావించే ధోరణి పెంపొందింది. మతాన్ని ఒక జీవన వ్యవస్థగా స్వీకరించని ధోరణి యిది. ఈ ధోరణి వల్లనే పాశ్చాత్య వ్యవస్థ ఇస్లాం స్వభావాన్ని అర్థం చేసుకోలేకపోయింది. మతాన్ని ఒక ప్రత్యేక అరలో బంధించింది. హింసాదౌర్జన్యాలు మతంలో తప్పనిసరిగా ఉంటాయని నిర్ధారించుకుంది. అందువల్ల మతం ప్రగతిశీలం కలదనీ, ప్రేరణ ఇచ్చేదని తెలుసుకోలేకపోయింది. మతాన్ని రాజకీయాలతో ఎవరైనా కలిపితే ఆ వ్యక్తి పాశ్చాత్య వ్యవస్థ దృష్టిలో తిరోగమనవాది, మతోన్మాది, ప్రపంచానికి ప్రమాదకరమైన వ్యక్తి. (ఇస్లామిక్ థ్రెట్, పేజి.201)

ఈ భావాలు, అభిప్రాయాలు బలంగా ఉన్నప్పటికీ, పాశ్చాత్య మేధావులు, రచయితలలో ఇప్పుడు పునరాలోచనలు కూడా ప్రారంభమయ్యాయి. ఇస్లామీయ ఉద్యమాలు, ముస్లిము గ్రూపులన్నింటినీ ఛాందసవాద, సంకుచిత, ఉగ్రవాద శక్తులుగా భావించి పొరబాటు చేశామన్న అభిప్రాయాలు వారిలో నేడు జనిస్తున్నాయి. ఇరవయ్యో శతాబ్దంలో అనేక మంది ముస్లిం మేధావులు, సంస్కర్తల ప్రయత్నాల వల్ల ఇజ్తిహాద్ (అనువర్తన శాస్త్రం), ఇజ్మా (మెజారిటీ అభిప్రాయం), షూరా (సలహా వ్యవస్థ)ల ప్రాధాన్యం పెరుగుతోందని గ్రహించడం జరిగింది. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఆలోచన, సిద్ధాంతీకరణ, తర్కం, వివరణల పరిధి విస్తృతమయ్యింది. పాశ్చాత్య సంస్కృతిలో వారి ప్రజాస్వామ్య భావనలు, మానవ హక్కుల విషయంలో నిబద్ధతల వంటి అభిలషణీయమైన అంశాలు ఇస్లాంకు అనుగుణమైనవిగా భావిస్తూ ఈ విషయమై సహాయ సహకారాలు అందించాలనీ, వాటిలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలన్న ధోరణి అనేక ఇస్లామీయ ఉద్యమాలలో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో, యూదు మీడియా, పాశ్చాత్య ఫాసిస్టు శక్తులు ఇస్లాంపై బురద చల్లడానికి, ఇస్లాంకు టెర్రరిజంతో సంబంధం జోడించడానికి చేస్తున్న ప్రయత్నాలను స్వయాన పాశ్చాత్య ప్రజలు ఏవగించుకొంటున్నారు.

రాజకీయ ప్రతీకారాల కోసం విప్లవం గురించి మాట్లాడే గ్రూపులు ఇస్లామీయ ప్రపంచంలో ఉన్నాయన్నది నిజమే. తుపాకీ గొట్టం ద్వారా విప్లవం సాధించాలని భావించే మార్క్సిస్ట్, మావోయిస్టుల మాదిరిగా బలప్రయోగం ద్వారా ఇస్లామీయ వ్యవస్థను స్థాపించాలని మాట్లాడే వాళ్ళు లేకపోలేదు. ముస్లిం సమాజంలో ఇలాంటి వారు గుప్పెడు కూడా లేరు. కాని, ఇలాంటి వర్గాలకు ప్రజల మద్దతుగాని, ఇస్లామీయ పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్న ప్రముఖ సంస్థలు ఉద్యమాల మద్దతుగాని ఎన్నడూ లభించలేదు. అల్ జిహాద్, హిజ్బుల్లా, సిపాహె ఖుదా, ఇస్లామిక్ లిబరేషన్ ఆర్గనైజేషన్, దోజక్‌సే నజాత్ వంటి పేర్లతో పనిచేసే ఈ సంస్థలకు ఇస్లాంలోగాని, ముస్లిముల సమాజంలోగాని ఎలాంటి విలువ లేదు. ఈ సంస్థలు ఇస్లాంకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు కానేకాదు. ఈ సంస్థలు సమకాలీన పాశ్చాత్య, సామ్యవాద ఉగ్రవాద సంస్థల అడుగుజాడల్లో

నడుస్తున్న సంస్థలుగానే భావించాలి. అమెరికా, దాని మిత్రదేశాల చర్యలు ఇలాంటి ఉగ్రవాద కార్యకలాపాలకు బలాన్నిస్తున్నాయి. ప్రపంచంలో అల్లకల్లోలాన్ని రేకెత్తించడం, ఒక జాతిని, ఒక సంస్కృతిని మరొక జాతి, మరొక సంస్కృతితో తలపడేలా చేయడం అమెరికా విదేశాంగ మంత్రిత్వశాఖ, దాని విధాన నిర్మాణ సంస్థలకు అత్యంత యిష్టమైన వ్యాపకం. అందువల్లనే, ఇస్లామీయ దేశాల్లో ఇస్లామీయ నియమాలు లేదా సాంస్కృతిక విలువలను బలపరిచే ప్రయత్నం ఏదైనా నిజాయితీగా జరిగితే అందరికన్నా ముందు అమెరికా ఆ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ రొమ్ము విరుచుకొని నిలబడుతుంది. ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ అది కూడా పతనం అవుతున్న మురికి పాశ్చాత్య సంస్కృతి పరిరక్షణకు నిలబడినట్లు ప్రవర్తిస్తుంది.

కాబట్టి, ఇస్లామీయ ఉగ్రవాదం అన్నది ఒక భ్రమ మాత్రమే. ఈ వాస్తవాన్ని ప్రపంచ వ్యాప్తంగా గుర్తించడం జరుగుతోంది. పాశ్చాత్య రాజకీయ నాయకులు, యూదు శక్తుల కుతంత్రాలు, లజ్జలేని ప్రయత్నాల ప్రభావం ఇప్పుడు తగ్గుముఖం పడుతోంది.

# జిహాద్ - టెర్రరిజం

జిహాద్, టెర్రరిజం ఈ రెండూ వేర్వేరు విషయాలు. వీటి మధ్య భూమ్యాకాశాల మధ్య ఉన్నంత భేదం ఉంది. మానవ ప్రాణాల పవిత్రత, గౌరవ మర్యాదలు, శాంతి భద్రతల రక్షణ, దౌర్జన్యం అణచివేతల నిర్మూలనం లక్ష్యంగా జిహాద్ జరుగుతుంది. కానీ, టెర్రరిజం అన్నది అల్లర్లు, హింసా దౌర్జన్యాలు, విద్వేషం, ప్రతీకార భావాలు, అరాచకం, అవినీతి, అమాయకుల హత్యాకాండల ఉన్మాద చేష్ట. ప్రాచ్య పాశ్చాత్య దేశాలకు చెందిన అనేకమంది అవగాహనలేని మేధావులు, రచయితలు, కాపట్యం మూర్తీభవించిన వాళ్ళు ఈ రెండింటినీ పర్యాయపదాలుగా పేర్కొని ఇస్లాంను ముస్లిములను అప్రదిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. టెర్రరిజాన్ని మొదటనే వివరించడం జరిగింది. దానికి సంబంధించిన సంక్షిప్త చరిత్ర గురించి కూడా తెలుసుకున్నాము. ఇక ఇప్పుడు ఇస్లామీయ నియమాల ప్రాతిపదికన జిహాద్ గురించి తెలుసుకోవడం, జిహాద్‌కు సంబంధించిన పరిధులు, హద్దులను అవగాహన చేసుకోవడం అవసరం.

సమస్త మానవాళి రక్షణకు, మానవ ప్రాణాల పవిత్రతను కాపాడడానికి ఒక విశ్వజనీన బాధ్యతను ఇస్లాం ఆదేశించింది. జిహాద్ ఇస్లాంలోని ఈ మౌలిక బాధ్యతను నిర్వర్తించే మార్గం. మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది మాటల్లో-

''మానవ నాగరికత పునాదులు యే చట్టంపై ఆధారపడి ఉన్నాయో ఆ చట్టంలోని మొదటి అధికరణం ప్రకారం మానవ ప్రాణాలు, మానవ రక్తం పవిత్రమైనవి. మనిషికి ఉన్న నాగరిక హక్కులలో మొదటిది జీవించే హక్కు. నాగరిక బాధ్యతలలో మొదటి బాధ్యత జీవించి ఉండడం. ప్రపంచంలోని శాసనాలు, నాగరిక చట్టాలన్నింటా మానవ ప్రాణాల పవిత్రతకు సంబంధించిన ఈ నైతిక నియమం తప్పనిసరిగా ఉంది. ఈ నియమాన్ని అంగీకరించని మతంగాని, చట్టంగాని అది నాగరిక ప్రజల మతం లేదా చట్టంగా ఉండతగదు. అలాంటి మతం లేదా చట్టం ప్రకారం జీవిస్తూ యే సమాజమూ శాంతియుత జీవనాన్ని గడుపలేదు.'' (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం, పేజి.22)

పైన పేర్కొన్న నాగరిక నియమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన ఇస్లాంపై యూరపు మేధావులు రక్తపిపాసగల మతంగా, తన అనుయాయులను రక్తపాతానికి ఉసిగొలిపే మతంగా అపవాదు వేశారు. ఇంతకన్నా దౌర్జన్యం మరొకటి ఉంటుందా! మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే, ఈ అపవాదు ఇస్లామీయ సూర్యప్రకాశం మసకబారిన చాలా కాలం తర్వాత ప్రారంభ మయ్యింది. ఇస్లాం శక్తి క్షీణించిన తర్వాత ఈ అపవాదు ప్రారంభమయ్యింది. విచిత్రమేమిటంటే, ఇస్లాంపై ఈ అపవాదువేసిన పాశ్చాత్యుల ఖడ్గాలు అమాయకుల రక్తం తాగుతున్న కాలంలోనే, ప్రపంచంలోని బలహీన జాతులను కొండచిలువ మాదిరిగా కబళిస్తున్న కాలంలోనే ఈ అపవాదు ప్రారంభ మయ్యింది. (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం, పేజి.15)

వాస్తవానికి ఇస్లాం మానవాళిని దౌర్జన్యాల నుంచి కాపాడడానికి మాత్రమే కత్తి ఎత్తే అనుమతి ఇచ్చింది.

ఇస్లాంకు పునాది అయిన దివ్యఖుర్ఆన్ అనేక సార్లు మానవ ప్రాణాల పవిత్రత, రక్షణ గురించి ఆదేశించింది. ఉదాహరణకు:

> "హత్యకు బదులుగాగానీ, కల్లోలం వ్యాపింపజేసినందుకుగాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాలను కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." (దివ్యఖుర్ఆన్-5:32)

> "ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: "రండి మీకు వినిపిస్తాను. మీ ప్రభువు మీకు విధించిన కట్టుబాట్లు ఏమిటో, ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చేయ రాదు. తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చెయ్యకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము, వారికీ ఇస్తాము. అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి. బహిరంగమైనవి అయినాసరే, లేక గోప్యమైనవి అయినా సరే, సత్యంతో తప్ప అల్లాహ్ పవిత్రంగా నిర్ణయించిన ఏ ప్రాణాన్నీ హతమార్చకండి."
> (దివ్యఖుర్ఆన్-6:151)

ఈ ఇస్లామీయ బోధనల ప్రభావం వల్లనే, ఈ బోధనల పునాదులపై ఏర్పడిన సమాజ ప్రభావం వల్లనే స్వల్పకాలంలో అరబ్బులాంటి యుద్ధోన్మాద జాతి నాగరికతను, మానవత్వాన్ని అలవరచుకుంది. మానవ ప్రాణాల మర్యాద, శాంతిభద్రతల సందేశాన్ని ప్రపంచంలో మూలమూలలకు విస్తరింపజేసింది. మౌలానా మౌదూది ఈ వాస్తవాన్ని వివరిస్తూ, "ఇస్లాం బోధనలు మనిషి ఆచరిస్తున్న అనేక చెడులను, రుగ్మతలను రూపుమాపినట్లే, ప్రపంచంలో అప్పటి వరకు వ్యాపించి ఉన్న మానవ ప్రాణాల నిరాదరణను కూడా నిర్మూలించింది. మానవ ప్రాణాలను అల్లాహ్ పవిత్రమైనవిగా నిర్ధారించాడని ఇస్లాం గొంతెత్తి చాటింది. సత్యం ప్రాతిపదికన తప్ప ప్రాణహానికి పాల్పడరాదని బోధించింది. ఇస్లాం ఇచ్చిన పిలుపులో గొప్పబలం ఉంది. ఈ పిలుపు అహింసా పరమోధర్మః మాదిరిగా మానవ ప్రవృత్తికి, బుద్ధికి పొసగనిది కూడా కాదు. అందువల్లనే ఈ పిలుపు ప్రపంచం మూలమూలలకు వ్యాపించింది. మనిషికి మానవ ప్రాణాల విలువను అవగతపరిచింది. ప్రపంచంలోని నైతిక నియమనిబంధనలలో మానవ ప్రాణాల పవిత్రతను కాపాడే విషయంలో ఈ పిలుపునకు లభించినంత ఘనత అహింసా పరమోధర్మఃకు లేదా పర్వత ఉపదేశానికి (Sermon of Mount) కూడా లభించలేదన్నది మానవ చరిత్రలో న్యాయప్రియులయిన మేధావు లెవ్వరూ కాదనలేరు." (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం, పేజి.129)

మానవ ప్రాణాలు, వాటి పవిత్రతలకు పూర్తి రక్షణ కల్పించిన ఇస్లాం, దానితో పాటు ప్రతీకార న్యాయం, నేరానికి శిక్షల విషయంలోనూ ఖచ్చితమైన ఏర్పాట్లు చేసింది. నేరస్తుని నేరానికి తగిన శిక్ష విధించడం సత్యాన్ని ప్రేమించే సమాజాల బాధ్యతగా నిర్దేశించింది. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. ఇష్టం వచ్చినట్లు అల్లర్లు రెచ్చగొట్టినా, ఇష్టమొచ్చినట్లు హింసా దౌర్జన్యాలకు పాల్పడినా ఏం చేసినా అలాంటి వారి ప్రాణాలు కూడా పవిత్రంగానే ఉంటాయని భావించడం కుదరదు. అందువల్ల ఇస్లాం మానవ ప్రవృత్తికి తగిన శాసనాలు చేసింది. ఈ చట్టాల ప్రకారం మనిషి తన హద్దుల్లో పూర్తి స్వేచ్ఛ కలిగి ఉంటాడు. ఏ వ్యక్తీ తన హద్దులను దాటి ఇతరుల భౌతిక, ఆధ్యాత్మిక శాంతికి భంగం కలిగించే అవకాశం లేదు.

అందువల్లనే ఇస్లాం అల్లకల్లోలం రేకెత్తించడాన్ని హత్యకన్నా తీవ్రమైన నేరంగా నిర్ధారించింది. ఈ విషయమై ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ (స) సమగ్ర ప్రవచనం వంటిది ప్రపంచంలోని పెద్ద పెద్ద పాలకులెవ్వరూ ఎన్నడూ చెప్పలేదు. ప్రవక్త (స) ప్రవచనం ఏమంటే- "దౌర్జన్యపరుడికి, బాధితుడికి సహాయపడండి" అన్నారు. దానికి వివరణ కూడా ఇచ్చారు. దౌర్జన్యపరుడి చేయి పట్టుకుని దౌర్జన్యం నుంచి నిరోధించడమే అతడికి చేసే సహాయం అన్నారు. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే, దౌర్జన్యపరుడి దౌర్జన్యాన్ని అడ్డుకోడానికి వాడితో కఠినంగా వ్యవహరించడం నిజానికి కాఠిన్యంకాదు. ఇది నిజానికి మృదువైఖరి. దౌర్జన్యపరుడు కఠిన నరకశిక్షకు గురికాకుండా చేసే సహాయం ఇది. అల్లాహ్ విధించిన హద్దులను స్థాపించడం కారుణ్యానికి, సౌభాగ్యానికి హేతువులవుతాయని చెప్పడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయమై ఏమన్నారంటే, అల్లాహ్ విధించిన హద్దులలో ఒక హద్దును స్థాపించడం వల్ల 40 రోజుల వర్షం కన్నా ఎక్కువ సౌభాగ్యం కురుస్తుంది. ఎంత ఉత్కృష్టమైన దైవధర్మం! మానవ ప్రాణాల పవిత్రత విషయంలో ఎంత కఠినంగా ఉంటుందో అంతకన్నా కఠినంగా ఒక దౌర్జన్యపరుడికి శిక్ష విధించే విషయంలో వ్యవహరిస్తుంది. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే, ఇస్లాం దృష్టిలో మానవ ప్రాణాలకన్నా సత్యం విలువైనది. సత్యం కోసం ప్రాణహాని అవసరమైతే అలా చేయడం అనుమతి ఉన్న అంశమే కాదు, అది ఒక బాధ్యత కూడాను. అలా చేయక పోవడం ఒక పెద్ద అపరాధం. మనిషి సత్యాన్ని గౌరవించినంత కాలం మనిషి ప్రాణాలు పవిత్రంగా ఉంటాయి. కాని, మనిషి తలబిరుసుతనానికి లోనయి సత్యాన్ని అతిక్రమిస్తే అలాంటి వ్యక్తి తన ప్రాణాల విలువ కోల్పోతాడు. అలాంటి వ్యక్తి ప్రాణాల విలువ గడ్డిపోచపాటి చేయదు."

(అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం, పేజి.32)

ప్రపంచంలో అల్లకల్లోలం, ఉపద్రవాలను నిర్మూలించడానికి, శాంతి స్థాపించడానికి ఇస్లాంలో జిహాద్ ఒక మార్గం. ముఖ్యంగా, కేవలం వ్యక్తులే కాక, సంస్థలు, సమూహాలు, జాతులు అత్యాశ, దురాశలతో కళ్ళుమూసుకుపోయి హద్దులను అతిక్రమిస్తే, వారి దుర్మార్గాలను, అల్లర్లను అరికట్టడానికి జిహాద్ తప్పనిసరి అవుతుంది. ఒక తాత్వికుని మాటల్లో చెప్పాలంటే, "సంస్థలు,

సమూహాలు సృష్టించే అల్లకల్లోలం హద్దుల్లేని ఉపద్రవం అవుతుంది. దీనివల్ల అసంఖ్యాక ప్రజల జీవితాలు దుర్భరమైపోతాయి. పూర్తి జాతులకే బ్రతుకు ఇరుకైపోతుంది. నాగరిక వ్యవస్థలన్నింట అలజడి చెలరేగుతుంది. దీనిని నిరోధించడం రక్తపాతరహితంగా సాధ్యపడదు. దీనినే దివ్యఖుర్‌ఆన్ పేర్కొంది.

మానవ చరిత్రలో యుద్ధం అనివార్యమే కాదు, బాధ్యతగా మారిన పరిస్థితులు అనేకసార్లు తలెత్తాయి. అల్లకల్లోలం, అల్లర్లను అణచడానికి సత్యధ్వజవాహకులు రంగంలోనికి రావలసి వస్తుంది. దివ్యఖుర్‌ఆన్ ఈ విషయమై ఏం చెప్పిందంటే:

> **"అల్లాహ్ గనుక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగించనట్లయితే ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, మసీదులు- వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడుతుందో అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే." (దివ్యఖుర్‌ఆన్-22:40)**

> **"వారు యుద్ధ జ్వాలలను ప్రభవింపజేసినప్పుడల్లా అల్లాహ్ దానిని చల్లబరుస్తాడు. వారు భూమిలో సంక్షోభాన్ని వ్యాపింపజేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని అల్లాహ్ సంక్షోభం సృష్టించేవారిని ఎంత మాత్రం ప్రేమించడు." (దివ్యఖుర్‌ఆన్-5 : 64)**

అందువల్ల దైవేచ్ఛను అమలు చేయడానికి సత్యావలంబీకులయిన వాళ్ళు అల్లాహ్ మార్గంలో జిహాద్ కొరకు నడుంకట్టి ముందుకు రావలసి ఉంటుంది. అల్లకల్లోలం, అల్లర్లు, అరాచకం, అత్యాశ, దురాశ, విద్వేషం, వైరాలు, దురభి మానం, సంకుచిత్వాల మంటలను ఆర్పడానికి రంగంలోకి రావాలి. దివ్య ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల అల్లాహ్ మార్గంలో జిహాద్‌ను, ప్రాపంచిక ప్రయోజనం కొరకు చేసే యుద్ధ పోరాటాల మాదిరిగాకాక, ఒక విభిన్న సంఘర్షణగా పేర్కొంది. ఇది కేవలం దేవుని కోసం జరుగుతుంది. దౌర్జన్యానికి, తలబిరుసు తనానికి ఒడిగట్టే వారిపై మాత్రమే జరుగుతుంది. అల్లాహ్ మార్గంలో జిహాద్‌కు సంబంధించి దివ్యఖుర్‌ఆన్ ఇలా పేర్కొంది:

> **"విశ్వసించిన ప్రజలారా! మిమ్మల్ని వ్యధాభరితమైన శిక్ష నుంచి రక్షించే వ్యాపారమేమిటో నేను మీకు తెలుపనా? విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన**

**ప్రవక్తను: పోరాడండి అల్లాహ్ మార్గంలో మీ సంపదలు, మీ ప్రాణాలను ధారపోసి- మీరు గనుక గ్రహిస్తే ఇదే మీకు మేలైనది."**

**(దివ్యఖుర్ఆన్- 61 : 10)**

జిహాద్ ప్రాముఖ్యానికి సంబంధించి, ఒక మేధావి చెప్పినట్లు, మరో ముఖ్యమైన అంశం ఉంది. గీతలో పేర్కొన్న మాదిరిగా, ప్రపంచంలో రాచరికం అనుభవించడానికి చేసేది కాదు ఇది. దివ్యఖుర్ఆన్‌లో జిహాద్ ప్రస్తావన ఉన్న ప్రతిచోట జిహాద్‌కు ప్రతిఫలంగా దైవప్రీతి, దేవుని వద్ద ఉన్నత స్థానం, దేవుని శిక్షల నుంచి విముక్తి లభిస్తాయని చెప్పడం జరిగింది. అందువల్లనే ఇస్లామ్‌లో మనిషి ఆచరణల్లో దేవునిపై విశ్వాసం తర్వాత అత్యున్నత స్థానం జిహాద్‌కే ఇవ్వడం జరిగింది. మౌలానా అబుల్ ఆలా మౌదూది మాటల్లో చెప్పాలంటే-

"చెడును ఎట్టి పరిస్థితిలోనూ భరించకపోవడం మనిషి సహజ ప్రవృత్తి. చెడును నిర్మూలించడానికి అన్ని రకాల త్యాగాలకు సిద్ధం కావడం మనిషి మంచితనానికి సంబంధించి అత్యుత్తమ ప్రవృత్తి. ఇతరులకు జరిగే చెడును భరించే వ్యక్తిలోని నైతిక బలహీనత చివరకు అతడికి జరిగే చెడును కూడా భరించేలా చేస్తుంది. ఇలా భరించడం మొదలైన తర్వాత అతడిపై దైవం తన శిక్షగా పేర్కొన్న పరాభవాల స్థాయికి దిగజారుతాడు."

అంటే జిహాద్ ఉద్దేశ్యం, పరాభవాలు అవమానాల జీవితానికి బదులు గౌరవ మర్యాదల జీవితం గడిపే పరిస్థితులు సృష్టించడం. పిరికితనం, భయభీతుల జీవితంతో సర్దుకుపోయేవారిని, దివ్యగ్రంథం ప్రకారం, మరణ సమయంలో ఇలా ప్రశ్నిస్తారు.

**"తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి దైవదూతలు వారిని 'ఇదేమిటి మీ స్థితి ఇలా ఉంది?' అని అడిగారు. అప్పుడు వారు ఇలా సమాధానం చెప్పారు. 'మేము భూమిపై బలహీనులలముగా, నిస్సహాయు లముగా ఉండేవారము.' దైవదూతలు 'అల్లాహ్ భూమి విశాలంగా లేదా మీరు వలస పోవడానికి' అని అడిగారు. వారి నివాసం నరకం. అది మహా చెడ్డ నివాసం."(దివ్యఖుర్ఆన్-4:97)**

అంటే బలహీనంగా, పరాభవాల జీవితం గడపడంతో రాజీపడే వారు, తమపై తామే దౌర్జన్యం చేసుకునే వారిగా పేర్కొనడం జరిగింది. ఇలాంటి జీవితం గడుపక తప్పలేదని కారణాలు చూపేవారిని, "అలాంటి ప్రాంతం వదలి వేరే ప్రాంతానికి వలస పోలేదెందుకు?" అని ప్రశ్నించడం జరిగింది. శరీరం కందిపోరాదు, భౌతిక సౌకర్యాలు అన్నీ పొందాలని భావిస్తూ అందుకోసం గౌరవ మర్యాదలను కూడా వదులకునే వాళ్ళకు తీవ్ర శిక్ష తప్పదనీ వారి నివాసం నరకమనీ హెచ్చరించాడు దైవం.

అంటే ఇస్లాంలో జిహాద్ అంటే భావం- ఎవరైనా మానవ హక్కులు కబళించాలని ప్రయత్నిస్తే, దౌర్జన్యం చేస్తే, న్యాయబద్ధంగా చెందిన ఆస్తుల నుంచి తొలగిస్తే, ధార్మిక విశ్వాసం, మనస్సాక్షిల స్వేచ్ఛను కబళిస్తే, ధర్మం ప్రకారం నడుచు కొనడాన్ని అడ్డగిస్తే, సామూహిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయదలిస్తే, ఇస్లాంను పాటిస్తున్న కారణం వల్ల విరుచుకుపడితే అలాంటి వారిని ఎదుర్కొనే విషయంలో వెనుకడుగు వేయరాదు. ఈ దౌర్జన్యాన్ని నిరోధించడానికి శక్తిసామర్థ్యాలన్నీ వినియోగించాలి.

(అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్,పేజి.56)

ముస్లిముల జాతిపరమైన, ధార్మికమైన ఉనికిని రక్షించడానికి, ఉపద్రవాల నుంచి పరిరక్షించడానికి జిహాద్‌ను ముఖ్యవిధిగా నిర్ణయించిన అల్లాహ్ జిహాద్ విషయంలో కఠిన నిబంధనలను, కఠినమైన బాధ్యతలను కూడా విధించాడు. తద్వారా వ్యక్తిగత, వంశపరమైన, సామాజికమైన ఘర్షణ లన్నింటికీ ప్రజలు జిహాద్ అని పేరు పెట్టకుండా కట్టడి చేశాడు. జిహాద్ దౌర్జన్యానికి, అత్యాచారాలకు జవాబు. జిహాద్ చేసేవారు దౌర్జన్యానికి పాల్పడ కుండా కఠినంగా నిరోధించడం జరిగింది.

> **"మీతో పోరాడేవారితో దైవమార్గంలో పోరాడండి. అయితే హద్దులు దాటకండి. ఎందుకంటే అల్లాహ్ అతిక్రమించే వారిని ఇష్టపడడు."**
>
> **(దివ్యఖుర్ఆన్)**

ధర్మమార్గాన్ని పరిరక్షించడానికి జిహాద్ తప్పనిసరి. అంటే, మనిషి మౌలిక హక్కులు కాలరాసేవారిపై, సహజ స్వేచ్ఛలను కబళించే వారిపై కూడా జిహాద్

చేయడం తప్పనిసరి. అంటే సత్యాన్ని చేరుకోకుండా అడ్డుకొనే వారిపై కూడా జిహాద్ తప్పనిసరి అవుతుంది. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే, "ఏదైనా మార్గాన్ని అడ్డుకోవడమన్నది మూడు విధాలుగా ఉంటుంది. మొదటిది: ప్రజలను ఆ మార్గాన రాకుండా ఆపడం, రెండవది, ఆ మార్గాన నడిచేవారిని బలవంతంగా పక్కకు తప్పించడం, మూడవది, ఆ మార్గాన నడిచేవారి ముందు ముళ్ళకంపలు పరచడం. వారిని భయకంపితులు చేయడం, ఆ విధంగా వారు ఆ మార్గాన నడవకుండా చేయడం. ఈ విధంగా సత్యమార్గాన్ని, శ్రేయోమార్గాన్ని అడ్డగించే వారిని తొలగించడం, వారి పీచమణచడం ముస్లిముల నైతిక హక్కు, ధార్మిక బాధ్యత." (అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం, పేజి.66)

సమాజంలో శాంతికి ఎవరైనా భంగం కలిగిస్తే, లేదా న్యాయబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని హింసా దౌర్జన్యాల ద్వారా పడగొట్టాలని ప్రయత్నిస్తే ఇస్లామీయ రాజ్యంలో కల్లోలం రేకెత్తించాలని ప్రయత్నిస్తే లేదా దోపిడి హత్యాకాండలకు పాల్పడితే అలాంటి పరిస్థితిలోనూ జిహాద్ విధి అవుతుంది. దివ్యఖుర్ఆన్ ప్రకారం:

> **"అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడేవారికి, ధరణిలో కల్లోలాన్ని సృష్టిస్తూ తిరిగేవారికి శిక్ష ఏమిటంటే, వారిని చంపటం లేదా శిలువ పైకి ఎక్కించడం లేదా చేతులను, కాళ్ళను అభిముఖ దిశలలో ఖండించడం లేదా దేశం నుంచి బహిష్కరించడం." (దివ్యఖుర్ఆన్-5 : 33)**

ముస్లిముల ఒక వర్గం బలహీనంగా ఉండడం వల్ల శత్రువుల చేతికి చిక్కితే, శత్రువుల పట్టునుంచి బయటపడే శక్తి వారికి లేనట్లయితే అలాంటి పరిస్థితిలో స్వేచ్ఛగా ఉన్న, యుద్ధం చేయగల శక్తి ఉన్న ముస్లిముల వర్గం బాధిత సోదరు లను దౌర్జన్యాల నుంచి రక్షించడానికి యుద్ధం చేయాలి. ఇది కూడా జిహాద్‌కు ఒక రూపం. దివ్యఖుర్ఆన్ ఈ విషయమై క్రింది విధంగా పేర్కొన్నది:

> **"మీకేమయ్యింది! అల్లాహ్ మార్గంలో బలహీనులైన ప్రజల కోసం, పిల్లల కోసం యుద్ధం చేయరు! ఓ ప్రభూ! మమ్మల్ని ఈ బస్తీ నుంచి బయటకు**

**తీయి, ఇక్కడి వాళ్ళు మహా దుర్మార్గులు, మా కోసం నీ తరపు నుంచి సహాయకుడిగా నీ తరపు నుంచి మద్దతు ఇచ్చేవాడిని పంపు అని వారు మొరపెట్టుకొంటున్నారు." (దివ్యఖుర్ఆన్)**

ఇస్లామీయ దృక్పథం ప్రకారం, మంచిని పెంచడంతో పాటు చెడును త్రుంచ డానికి కూడా ప్రాముఖ్యం ఉంది. దివ్యఖుర్ఆన్, హదీసుల ప్రకారం ఈ ప్రాముఖ్యం స్పష్టంగా అర్థమవుతుంది. చెడును త్రుంచే క్రమంలో బల ప్రయోగం, కాఠిన్యాల దశ కూడా వస్తుంది. అయితే, ఇంతకు ముందు పేర్కొన్నట్లు, వ్యక్తిగత స్థాయిలో బలప్రయోగం, కాఠిన్యాలకు అనుమతి లేదు. సామూహిక స్థాయిలో సలహామండలిపై లేదా పాలకుడిపై ఉండే బాధ్యత ఇది. వ్యక్తిగత స్థాయిలో చెడులను ద్వేషించడం, దుర్మార్గులకు దూరంగా ఉండడం ప్రతి వ్యక్తి బాధ్యత. అనేక హదీసుల్లో మహాప్రవక్త ముహమ్మద్ (స) బనీ ఇస్రాయీల్ అనుసరించిన చెడులతో సర్దుకుపోయే ధోరణిని ఖండించారు. మహాప్రవక్త (స) ఈ విషయమై ఏమన్నారంటే, " బనీ ఇస్రాయీల్‌లలో తలెత్తిన మొదటి బలహీనత, వారి హృదయాలలో చెడుల పట్ల విద్వేషం మాయమయ్యింది. వాటిని భరించే ధోరణి పెరిగింది. చెడులను భరిస్తూ, భరిస్తూ చివరకు మనిషి చెడుల్లో కూరుకుపోయే ధోరణి జనించింది." అంటే వారిలో ఓ వ్యక్తి మరో వ్యక్తితో దేవునికి భయపడు, చెడు పనులు మానేయి అని చెప్పి, మరుసటి రోజు తాను కూడా ఆ వ్యక్తితో కలిసి అదే చెడులో మునిగితేలే పరిస్థితి ఉండేది. చివరకు ఒకరి చెడుల ప్రభావంలో మరొకరు మునిగిపోయారు, వారి మనస్సాక్షి మరణించింది. (అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్)

చెడు ఒక ఉపద్రవంగా కల్లోలంగా మారితే దానిపై జిహాద్ చేయడం ముస్లిం సమాజ బాధ్యత. ఉపద్రవాన్ని ఇస్లాం ధర్మవేత్తలు స్పష్టంగా నిర్వచించారు. బలహీనులపై దౌర్జన్యాలు, వారి న్యాయసమ్మతమైన హక్కులను కబళించడం, బలవంతం, దోపిడి, బలప్రయోగంతో ప్రజలను ధర్మమార్గంపై నడువకుండా అడ్డుకోవడం, చెడుల్లో మునిగిపోయేలా చేయడం, చెడుల వ్యాప్తి కోసం ముఠాలు కట్టడం, వగైరాలన్నీ ఇందులో చేరివున్నాయి. అలాగే కల్లోలం అంటే ప్రజలలో జాతి దురభిమానాలు వ్యాపింపజేయడం, విభజించి పాలించడం, బలహీనులను అన్యాయంగా చంపడం, ప్రజలకు న్యాయం

లభించకుండా చేయడం, విశృంఖలత్వాన్ని చెడు నడతను ప్రోత్సహించడం, మానవ నాగరికతకు పునాదులయిన సంబంధాలను ధ్వంసం చేయడం వగైరా. కాబట్టి ప్రణాళికా బద్ధమైన ప్రయత్నాల (జిహాద్) ద్వారా ఇలాంటి దౌర్జన్య భరితమైన, తలబిరుసు ప్రభుత్వాలను అంతంచేయడం విశ్వాసుల బాధ్యత.

పాశ్చాత్య జాతులు సామ్రాజ్యవాదం మత్తులో మునిగి పందొమ్మిదవ శతాబ్దంలో, ఇరవయ్యవ శతాబ్దంలో ప్రపంచంలోని అనేక జాతులపై, దేశాలపై బలప్రయోగానికి, దౌర్జన్యాలకు పాల్పడ్డాయి. భారతదేశ చరిత్ర పుటలలో ఆంగ్లేయుల దౌర్జన్యాలు, అత్యాచారాలు, మోసాలు, ద్రోహాలు, విభజించి పాలించే కుతంత్రాలు అనేకం ఉన్నాయి. కేవలం ఆర్థిక దోపిడీ కోసమే కాదు, సాంస్కృతిక దోపిడీ కోసం హింసా దౌర్జన్యాల పరంపరను కొనసాగించారు. చంగీజ్ ఖాన్, హలాకూ ఖాన్‌లు కూడా సిగ్గుపడే స్థాయిలో ఈ అత్యాచారాలు, దౌర్జన్యాలు కొనసాగాయి. నేడు ఇదే చరిత్రను ప్రపంచంలో అతిపెద్ద సూపర్ పవర్ దేశం, మహా శక్తిమంతమైన దేశం ప్రజాస్వామ్యంపేర, ప్రపంచ నాగరికత, మానవ హక్కుల పరిరక్షణ పేరిట పునరావృతం చేయాలనుకొంటోంది. అందుగ్గాను కొన్ని జాతులను బలిపశువులు చేస్తోంది. ఇస్లాం, ముస్లిములు సులభసాధ్యమైన లక్ష్యాలుగా ఆ దేశం ఎంచుకొంది. కాని, దౌర్జన్యాన్ని ప్రతిఘటించే సుదీర్ఘ చరిత్ర ఉండడాన్ని చూసి భయపడుతోంది కూడా. అందువల్లనే మధ్యప్రాచ్యం లోని కొన్ని దేశాలను, చైనాకన్నా ప్రమాదకరమైన దేశాలుగా భావిస్తోంది. అందువల్లనే టెర్రరిజం, జిహాద్ రెండూ ఒకటేనంటూ నిరంతరం అరవడం, ఆధారంలేని ఆరోపణలు చేయడం కొనసాగుతోంది. కానీ, ఈ ఆరోపణలు పూర్తిగా వాస్తవ విరుద్ధమైనవి.

# టెర్రరిజాన్ని కాదు, సదాచార విప్లవాన్ని కోరుతుంది ఇస్లాం

ప్రపంచంలోని వివిధ విప్లవాలను పరిశీలిస్తే వాటి చరిత్ర అంతా రక్తసిక్తంగా కనబడుతుంది. పెద్ద పెద్ద విప్లవాల నేతలు మృతదేహాల గుట్టలపై నడుస్తూ ముందుకు సాగారు. ఆర్తనాదాలు, హాహాకారాలు, మృత్యు వికటాట్టహాసాల తర్వాత విజయం వరించింది. కాని, ప్రపంచ చరిత్రలో ఒక విశిష్ట విప్లవం కూడా ఉంది. ఈ విప్లవం మానవ నాగరికత, చరిత్రలకు సరికొత్త ప్రాణం పోసింది. మానవ జీవన శైలిని సరికొత్తగా మార్చివేసింది. అసంఖ్యాక దేవుళ్ళు, ప్రభువుల దాస్యం నుంచి ప్రజలను బయటకు లాగి ఒకే ఒక్క దేవుని ఆరాధన వైపునకు మరల్చింది. ఈ విప్లవం సందర్భంగా జరిగిన రక్తపాతం, మానవ ప్రాణ హననం, విధ్వంసాలను ఇతర విప్లవాలతో పోల్చిచూస్తే, కేవలం కొందరు మాత్రమే ప్రాణాలు కోల్పోయారని తెలుస్తుంది. లక్షలాది మంది ఇతరులు ఎలాంటి ఒత్తిడి, బలవంతాలు లేకుండానే స్వచ్ఛందంగా ఈ విప్లవ బృందంలో చేరిపోయారు. ఈ విప్లవం ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం మనుషులంతా ఒక్కటిగా, ఈ సృష్టిలో అత్యంత గౌరవోన్నతులు గలవారిగా, శాంతి సాఫల్యాల ధ్వజవాహకులుగా పరిణామం చెందసాగారు.

ఎలాంటి మార్పు లేదా విప్లవం రావాలన్నా దౌర్జన్యం, రక్తపాతాలను ఇస్లాం అనుమతించలేదు. మార్పు కోసం, విప్లవం కోసం హృదయాలను మార్చడాన్ని, మారే వరకు సహనం, సంయమనాలతో వ్యవహరించడాన్ని ఇస్లాం ప్రోత్స హించింది. అందువల్లనే మక్కాలో 13 సంవత్సరాలపాటు మహాప్రవక్త ముహమ్మద్(స) అనుచరులతోపాటు అనేక కష్టనష్టాలు దౌర్జన్యాలు భరించారు. ఈ సందర్భంగా దివ్యఖుర్ఆన్ బోధించిన, మహాప్రవక్త ముహమ్మద్ (స) అనుసరించిన ధోరణి - ధర్మసందేశ ప్రచారం కొనసాగించాలి కాని, అవిశ్వాసు

లకు జవాబుగా బలప్రయోగానికి పూనుకోరాదు అన్నది. ఖురైషులు ముస్లిములను ఎన్ని విధాలుగా వేధించినాసరే ప్రతిచర్యలకు దిగరాదన్న వైఖరికే కట్టుబడ్డారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) అనుచరులకు వలసపోయే అనుమతి ఇచ్చారే కాని ఖురైషులపై ప్రతిచర్యలకు అనుమతించ లేదు. ఖురైషుల దౌర్జన్యాలు అణచివేతలు, హత్యా దౌర్జన్యకాండలు ఎంత శృతిమించినా ప్రతిచర్యకు అనుమతించలేదు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) సహనంతో, ఓరిమితో ప్రజలను ధర్మం వైపునకు ఆహ్వానించే పని కొనసాగిస్తూ, మంచి పనులను ప్రోత్సహిస్తూ చెడులను నిరోధిస్తూ తన పని కొనసాగించారు. చివరకు ఈ మానసిక, భావనాత్మక విప్లవం యే స్థాయికి చేరిందంటే పెద్ద సంఖ్యలో ప్రజలు ఇందులో చేరారు. బహిరంగంగా ఈ విప్లవానికి మద్దతు పలుకలేనివారు లోలోన సానుభూతి చూపసాగారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) ఔన్నత్యాన్ని, ఆయన సత్య సంధతను హృదయపూర్వకంగా ఒప్పుకొన్నారు. ప్రవక్త (స) ఆయన అనుచరుల పట్ల సానుభూతి వారి హృదయాల్లో ఉరకలు వేసింది. మరో ప్రక్క పాలకవర్గం ఎన్ని ప్రయత్నాలు చేసినా, పూర్తి శక్తిసామర్థ్యాలు వినియోగించినా ప్రయోజనం లేకుండాపోయింది. మక్కా అవిశ్వాసులు ప్రవక్త ముహమ్మద్ (స) హత్యకు కుట్ర చేయడం వల్ల ప్రవక్త (స) మక్కా నుంచి మదీనా తరలిపోవడం అన్నది నిజానికి ప్రవక్త (స) సాధించిన మొదటి ఘన విజయం. ఈ దశలో దివ్యఖుర్‌ఆన్ అయతుల్లో సహనం వహించాలని తరచూ బోధించడం జరిగింది.

> **"నీ ప్రభువు నామాన్ని స్మరిస్తూ ఉండు; అన్నింటినీ వదిలి పూర్తిగా ఆయనకే అంకితమైపో. ఆయన తూర్పూ పడమరలకు స్వామి, ఆయన తప్ప మరో దేవుడు లేడు. కనుక నీవు ఆయననే వకీలుగా చేసుకో, లోకులు కల్పించే మాటల పట్ల సహనం వహించి మంచితనంతో వారి నుంచి వైదొలిగిపో. సత్య తిరస్కారులైన ఈ సంపన్నుల సంగతి నాకు వదలిపెట్టు. నేను చూసుకుంటాను."** **(దివ్యఖుర్‌ఆన్- 73 : 8-11)**

**"కనుక ఓ ప్రవక్తా! ఓర్మి చూపు. అల్లాహ్ వాగ్దానం సత్యం, నీ తప్పులకు క్షమాభిక్ష వేడుకో. ఉదయం, సాయంత్రం నీ ప్రభువును స్తుతిస్తూ ఆయన పరిశుద్ధతను కొనియాడు." (దివ్యఖుర్‌ఆన్-40 : 55)**

**"కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడు పనులనుంచి నిరోధించు. ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు." (దివ్యఖుర్‌ఆన్ - 31 : 17)**

మక్కా దశలో మహాప్రవక్త ముహమ్మద్ (స) తన అనుయాయుల్లో మౌలిక నైతిక ప్రమాణాలను పెంపొందేలా చేశారు. ఇస్లామీయ మౌలిక విశ్వాసం, ఏకదైవారాధన ద్వారా అత్యున్నత నైతిక ప్రమాణాలు నెలకొనేలా చేశారు. ఈ నైతిక బలంతోనే వారు ఆ పిదప స్థిరచిత్తాన్ని ప్రదర్శించారు. ఓర్పు సహనాలతో కష్టాలను ఎదుర్కొంటూ విజయం దిశగా నడిచారు.

ఈ ప్రపంచంలో భౌతికంగా, నైతికంగా రెండు విధాలా బలం గలవారికే దేవుడు అధికారాన్ని ప్రసాదిస్తాడు. కానీ బాహ్యపరమైన, భౌతికమైన వనరుల కన్నా అంతర్గతంగా ఉండే గుణగణాలే నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉంటాయి.

మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే-

"నైతిక అధికారం, నైతిక బాధ్యతల ప్రత్యేకతలే మనిషిని స్థిరతత్వంగల సృష్టిరాశిగానేకాక భూమిపై దేవుని ప్రతినిధిగా రూపొందిస్తాయి. మనిషికి అసలయిన ఆభరణాలు నైతిక ప్రమాణాలే కాబట్టి, మానవ జీవితంలో నిర్మాణ విచ్ఛిన్నాల విషయంలో నైతిక ప్రమాణాలే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. మనిషి ఉత్థాన పతనాలు నైతిక ప్రమాణాల పైనే ఆధారపడి ఉంటాయి."

(తహ్రీక్ ఇస్లామీ కె అఖలాఖీ బునియాదే,పేజి.15)

ఇస్లాం మనిషిలోని మౌలిక నైతిక శక్తిని పరిమితమైన పరిధుల నుంచి బయటకు తీసి విశ్వజనీన స్థాయికి చేర్చింది. నైతిక శక్తిని వేయిరెట్లు పెంచింది. ప్రపంచంలో మనిషి విజయాలు పొందడానికి- మనిషి లక్ష్యం మంచిదయినా

**"కనుక ఓ ప్రవక్తా! ఓర్మి చూపు. అల్లాహ్ వాగ్దానం సత్యం, నీ తప్పులకు క్షమాభిక్ష వేడుకో. ఉదయం, సాయంత్రం నీ ప్రభువును స్తుతిస్తూ ఆయన పరిశుద్ధతను కొనియాడు." (దివ్యఖుర్ఆన్-40 : 55)**

**"కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడు పనులనుంచి నిరోధించు. ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు." (దివ్యఖుర్ఆన్ - 31 : 17)**

మక్కా దశలో మహాప్రవక్త ముహమ్మద్ (స) తన అనుయాయుల్లో మౌలిక నైతిక ప్రమాణాలను పెంపొందేలా చేశారు. ఇస్లామీయ మౌలిక విశ్వాసం, ఏకదైవారాధన ద్వారా అత్యున్నత నైతిక ప్రమాణాలు నెలకొనేలా చేశారు. ఈ నైతిక బలంతోనే వారు ఆ పిదప స్థిరచిత్తాన్ని ప్రదర్శించారు. ఓర్పు సహనాలతో కష్టాలను ఎదుర్కొంటూ విజయం దిశగా నడిచారు.

ఈ ప్రపంచంలో భౌతికంగా, నైతికంగా రెండు విధాలా బలం గలవారికే దేవుడు అధికారాన్ని ప్రసాదిస్తాడు. కానీ బాహ్యాపరమైన, భౌతికమైన వనరుల కన్నా అంతర్గతంగా ఉండే గుణగణాలే నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉంటాయి.

మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే-

"నైతిక అధికారం, నైతిక బాధ్యతల ప్రత్యేకతలే మనిషిని స్థిరతత్వంగల సృష్టిరాశిగానేకాక భూమిపై దేవుని ప్రతినిధిగా రూపొందిస్తాయి. మనిషికి అసలయిన ఆభరణాలు నైతిక ప్రమాణాలే కాబట్టి, మానవ జీవితంలో నిర్మాణ విచ్ఛిన్నాల విషయంలో నైతిక ప్రమాణాలే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయి. మనిషి ఉత్థాన పతనాలు నైతిక ప్రమాణాల పైనే ఆధారపడి ఉంటాయి."

(తహ్రీక్ ఇస్లామీ కె అఖలాఖీ బునియాదే,పేజి.15)

ఇస్లాం మనిషిలోని మౌలిక నైతిక శక్తిని పరిమితమైన పరిధుల నుంచి బయటకు తీసి విశ్వజనీన స్థాయికి చేర్చింది. నైతిక శక్తిని వేయిరెట్లు పెంచింది. ప్రపంచంలో మనిషి విజయాలు పొందడానికి- మనిషి లక్ష్యం మంచిదయినా

చెడ్డదయినా విజయం సాధించడానికి అవసరమైన లక్షణాలన్నీ మౌలిక నైతిక ప్రమాణాలలో ఉన్నాయి. ప్రపంచంలో విజయాలు సాధించడానికి అవసరమైన ఈ లక్షణాలను కలిగి ఉన్న వ్యక్తి లేదా సమూహం తప్పక విజయాలు సాధిస్తారు. అందరికన్నా ముందుకు దూసుకుపోతారు. సంకల్పబలం, నిర్ణయాలు తీసుకొనే శక్తి, ధైర్యస్థయిర్యాలు, ఓర్పు సహనాలు, దృఢచిత్తం, దీక్ష, లక్ష్యసాధన పట్ల నిబద్ధత, అందుకోసం త్యాగనిరతి, వ్యవహారాలను అవగాహన చేసుకొనే శక్తి, ఆ ప్రకారం పనిచేసే సామర్థ్యం, బాధ్యతాభావం, కోరికలపై అదుపు, ఇతరులపై ప్రభావం వేసే సామర్థ్యం, ఈ నైతిక లక్షణాలు లేనిదే మనిషి కేవలం భౌతిక వనరుల బలంతో ఇతరులపై ప్రాబల్యాన్ని పొందలేడు. ప్రపంచంలో అనేక విప్లవాలు ఈ నైతిక లక్షణాల బలం వల్లనే సాధ్యపడ్డాయి. ఈ లక్షణాలు లేనిదే హింసా దౌర్జన్యాలుగాని, ఉగ్రవాదంగాని యేదీ సాధ్యం కాదు. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే, "మనిషి గౌరవోన్నతులకు కారణమయ్యే గుణగణాలు, నిర్ణయాత్మక పాత్రను పోషించే నైతిక లక్షణాలు ఏవంటే- ఆత్మాభిమానం, దయాస్వభావం, జాలి, సానుభూతి, న్యాయం, విశాల హృదయం, దూరదృష్టి, సత్యం, నిజాయితి, తిన్నని వ్యవహార్శైలి, మాటకు కట్టుబడడం, ఔచిత్యం, సమతుల్యం, పరిశుద్ధత, మనోమస్తిష్కాల సంస్కారం, సంయమనం వగైరా. ఈ లక్షణాల వల్ల మనిషి ప్రపంచంలో ఘనకార్యాలను, అవి ఎలాంటివయినా సరే సాధించగలడు. కాని, ఇస్లామీయ విప్లవానికి ఇవి చాలవు. మనిషిలో పై లక్షణాలేకాక మరిన్ని గుణగణాలు కూడా ఉన్నాయి. ఇస్లామీయ విప్లవానికి అవి కూడా అవసరం. మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే- ఈ గుణగణాలు మనిషిలోని మౌలిక, మానవీయ నైతికతకు ఒక సరిఅయిన కేంద్రాన్ని ఇస్తాయి. వీటివల్ల ఆపాదమస్తకం శ్రేయోభావం ఆవరించుకొంటుంది. ఇస్లామీయ విశ్వాసం ఏకదైవారాధన కేంద్రంగా ఈ గుణగణాలు నెలకొంటాయి. ఫలితంగా మనిషి వ్యక్తిగత, వంశ, జాతి, దేశ ఔన్నత్యాలకు బదులు కేవలం సత్యం కోసం పనిచేసే వానిగా మారుతాడు. మనిషి క్రియాక్షేత్రం విస్తృతమవుతుంది. యావత్ ప్రపంచ శ్రేయం కోరేవానిగా

మారుతాడు. ఏక దైవారాధన విశ్వాసంతో మాత్రమే మౌలిక నైతిక లక్షణాలకు పొందిక కుదురుతుంది. ఉదాహరణకు సహనాన్ని తీసుకోండి. మౌలానా మౌదూది మాటల్లో- మానవ జీవితమంతటా సహనం వ్యాపించేలా చేస్తుంది ఇస్లాం. కేవలం కొన్ని కష్టాలు, ఇబ్బందులు, కడగండ్లలోనే కాదు మనిషిని రుజుమార్గం నుంచి తప్పించే సకల ప్రలోభాలు, అత్యాశలు, భయాలు, కోరికలు అన్నింటినీ ఎదుర్కొనే బలమైన శక్తిగా సహనాన్ని రూపొందిస్తుంది. అందువల్ల ఇస్లామీయ ఉద్యమం కొరకు పనిచేసే వారి ముందు ఎలాంటి ప్రమాదాలు, నష్టాలు, కష్టాలు ఎదురైనప్పటికీ, ప్రాపంచిక జీవితంలో ఎలాంటి ప్రయోజన కరమైన ఫలితాలూ కానరానప్పటికీ తమ దృక్పథానికి, ఆచరణలకు పూర్తిగా కట్టుబడి ఉంటారు. ప్రయోజనాలు, ప్రలోభాలు ఎన్నివున్నా ఆలోచనలు, ఆచరణలపరంగా చెడు మార్గాన్ని అవలంబించరు.

ఈ విధంగా పరలోకంలో లభించే ప్రయోజనాల పట్ల విశ్వాసంతో ప్రపంచంలో చెడులకు పూర్తిగా దూరంగా ఉండడం, మంచికి పూర్తిగా కట్టుబడడం ఇస్లాం బోధించే సహనం. ఈ సహనం లేనిదే ఇస్లామీయ విప్లవం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగదు.

ఇస్లామీయ భావజాలంలో దౌర్జన్యం, టెర్రరిజాల ద్వారా విప్లవం సాధించడమన్నది కాగడా పెట్టి వెదికినా కనబడని అంశం. ఇస్లామీయ విప్లవం భౌతిక వనరులతో పాటు నైతిక ప్రమాణాల ఔన్నత్యం ద్వారా సాధ్యపడుతుంది. ఇందులో హృదయాలను గెలుచుకోవడానికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. మౌలానా మౌదూది మాటల్లో-

'కేవలం కొన్ని గొప్ప సిద్ధాంతాల వల్ల హృదయాలను గెలువలేరు. హృదయాలను జయించాలంటే నిజమైన శ్రేయోభావం, సత్సంకల్పం, నిజాయితీ, నిస్వార్థం, విశాల హృదయం, దయాస్వభావం, సానుభూతి, మంచి తనం, న్యాయశీలం అవసరమవుతాయి. యుద్ధం, సంధి, విజయం, పరాజయం, స్నేహం, వైరం- సందర్భం ఏదైనా సరే, కఠిన పరిస్థితుల్లోనూ,

చెక్కుచెదరని ఇలాంటి గుణగణాలు కావాలి. ఇవి మౌలికమైన నైతికతకన్నా అనేకరెట్లు ఉన్నతమైన నైతిక స్థాయికి సంబంధించిన గుణగణాలు."

(తఫ్రీక్ ఇస్లామీకె బునియాదే, పేజి.31)

కేవలం భౌతిక వనరులు, కొన్ని మౌలిక నైతిక ప్రమాణాల బలంతో విజయాలను సాధించే శక్తులు జాతి వంశ ప్రాంతాల దురభిమానాల నుంచి, స్వార్థప్రయోజనాల పరిధుల నుంచి బయటపడలేవు. వ్యక్తిగత, వర్గపరమైన, జాతిపరమైన స్వార్థప్రయోజనాల ఊబిలో కూరుకుపోతాయి. మానవ సమానత్వం, మానవ హక్కులు, సమాన గౌరవ మర్యాదల గురించి ఈ శక్తులు మాట్లాడతాయి కాని అవసరమైతే అనైతికమైన యే పని చేయడానికయినా వెనుకాడవు. సత్యం, వాగ్దాన పాలన, ఉత్తమ వ్యవహారశైలి, నిష్పక్షపాతం, న్యాయం, నిజాయితీలను అవసరమైతే పక్కన పెడతాయి. తమ లక్ష్యాలు సాధించుకోడానికి అన్ని విధాలుగా మోసాలకు, ద్రోహాలకు పాల్పడుతాయి.

ప్రస్తుతం ప్రపంచంలో రెండు రకాల దేశాలున్నాయి. రాచరికం, నిరంకుశాధి కారంతో పాలించే పాలకులు ఉన్న దేశాలు కొన్ని. ఈ దేశాల పాలకులు తమ అధికారాన్ని కాపాడుకోవడంతోపాటు ప్రజాక్షేమం, సమాజంలో నైతిక ప్రమాణాల పెంపుదలకు తోచిన చర్యలు తీసుకొంటుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్న దేశాలు రెండవ కోవలోనివి. ఈ దేశాలలో ప్రజలకు తమ అభిప్రాయాలు వెలిబుచ్చడానికి, భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించి శాంతియుతంగా, సమాజాన్ని మార్చడానికి, పాలకులను మార్చడానికి ప్రయత్నించే స్వేచ్ఛ ఉంది. పై రెండు రకాల దేశాలలోనూ హింసాదౌర్జన్యాల ద్వారా, టెర్రరిజం ద్వారా తాత్కాలికంగా చిన్నాచితకా విజయాలు సాధించ వచ్చునేమో గానీ, సుదీర్ఘకాలం ప్రభావం వేయగల, స్థిరమైన మార్పును ఆశించడం అవివేకం. ప్రజాస్వామ్య దేశాల్లో ఇలాంటి ప్రయత్నాలు పూర్తిగా భావాలోచనల లోపానికి, దూరదృష్టి లేమికి నిదర్శనాలు. ఇలాంటి ప్రయత్నాల

వల్ల నష్టాలే తప్ప ఎలాంటి లాభాలు ఉండవు. ఉదాహరణకు భారత దేశాన్ని తీసుకోండి. నక్సలైట్లు, మావోయిస్టులు సుదీర్ఘకాలంగా హింసాదౌర్జన్యాల మార్గాన్ని అవలంబిస్తున్నారు. కాని సాధించింది ఏదీ లేదు. కాగా, రహస్యంగా ప్రత్యర్థులకు ధన ప్రాణ నష్టాలు కలుగజేయడానికి వెనుకాడని ఆరెస్సెస్ సంస్థ, అలా చేయడం వ్యూహాత్మకంగా తప్పని సరి అని భావించే ఆరెస్సెస్ సంస్థ దేశంలో విజయవంతంగా అధికారాన్ని అందుకోడానికి కారణం అర్ధశతాబ్దిగా చేసిన ప్రయత్నాలు కార్యకర్తల దీక్ష, శ్రమ, త్యాగం, ఈ ప్రయత్నాల వెనుక ఉన్నాయి. తమ సిద్ధాంతాలు, అవి విద్వేషభరితమైనవీ, అసహజమైనవీ, ప్రస్తుత సమాజానికి పొసగనివి అయినా సరే వాటిని ప్రజల హృదయాల్లో ప్రతిష్ఠించగలిగారు.

దీక్షాదక్షతలతో, స్వయం సమర్పణ భావంతో, అత్యున్నత నైతిక స్థాయిని ప్రదర్శిస్తూ ఇస్లామీయ ఉద్యమం కొరకు ప్రయత్నాలు జరిగితే, ఆ ప్రయత్నాల ఫలితాలు ఫాసిస్టు శక్తులు, మనుషుల్ని విభజించే సిద్ధాంతాలు, సాధించిన ఫలితాలకన్నా మిన్నగా, మరింత వేగంగా మన ముందుకు వస్తాయి. ప్రజా స్వామ్యం భావప్రకటనా స్వేచ్ఛ లేని దేశాల్లో కూడా, డాక్టర్ అబ్దుల్ హమీద్ అబూ సులైమాన్ మాటల్లో చెప్పాలంటే, "ఏక దైవారాధకుడు, స్వతంత్ర భావాలు కలవాడు, సాహసి, నిర్మాణాత్మక సృజనాత్మక శక్తి కలవాడు, సరియైన ఆలోచనా ధోరణి, అత్యున్నత నైతిక ప్రమాణాలు కల ముస్లింగా ఒక్కరు రూపొందినా అది విజయానికి నిదర్శనమే"- ఆ ఒక్కడే ఇస్లామీయ శ్రేయోసాఫల్యాలు, గౌరవోన్నతుల, న్యాయశీలమైన సలహామండలి వ్యవస్థకు పునాది రాయి అవుతాడు. (తషద్దుద్ ఔర్ సియాసి కష్మకష్, పేజి.94)

అంతర్గత రాజకీయ వివాదాల పరిష్కారానికి హింసా దౌర్జన్యాలను సాధనాలుగా ఉపయోగించడం కూడా ఇస్లామ్‌కు విరుద్ధం. దురదృష్టవశాత్తు ఇస్లాం గురించి, దివ్యఖుర్‌ఆన్ బోధనల గురించి అవగాహన లేనందువల్ల

ముస్లిం సమాజంలో శాంతియుతమైన సలహామండలి దృక్పథం పెంపొందలేదు. అలా జరిగి ఉన్నట్లయితే ప్రతిఘటనల హింసా పద్ధతుల స్థానంలో వివేకం, ఘర్షణల స్థానంలో సహకారం చోటుచేసుకొని ఉండేది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) పరస్పర వివాదాల పరిష్కారంలో హింసను ఎన్నడూ అనుమతించలేదు. దీనిని అజ్ఞానభరిత వైఖరిగా అభివర్ణించారు. ఆ కాలంలో ఉగ్రవాద ముఠాలు ఏ విధంగానూ ఎలాంటి విజయాన్ని సాధించిన ఉదాహరణ లేదు. అయితే, నిరాయుధులైన, అభిమానధనులైన, శాంతి స్వభావులైన, ధృఢచిత్తులైన ప్రజలు రాచరికపు అహంకారాలను, నియంతృత్వపు గర్వాన్ని దుమ్ములో కలిపేశారు.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇస్లాం చరిత్రలో, ఇస్లాం స్వభావంలో సంప్రదాయాలలో ఎన్నడూ ఉగ్రవాదానికి అనుమతి లభించలేదు. ప్రపంచంలో ఇస్లాం సాధించిన మహోన్నత విప్లవం నైతిక బలం వల్లనే సాధ్యమయ్యింది. దీనిని శాంతియుతమైన, పవిత్రమైన విప్లవంగా మనం పిలువవచ్చు. చివరగా, మౌలానా మౌదూది మాటల్లో చెప్పాలంటే, "ఇస్లాం, కమ్యూనిజం (లేదా ఫాసిజం) మాదిరిగా హింసాత్మక స్వభావాన్ని పుట్టించలేదు. ఇస్లాంకు విరుద్ధమైనదేదీ ఇస్లాం భరించలేదన్న అపవాదు అసత్యమైనది. నేడు భౌతిక పూజలో మునిగిన నాగరికత అభిప్రాయ భేదాలకు పరిష్కారం తుపాకి గుళ్ళు, హత్యాకాండ లంటోంది.

నిందితుడిని నేరస్తుడిగా రుజువుచేసే వేల పద్ధతులు నేటి ఈ నాగరికత కనిపెట్టింది. కాని ఇస్లామీయ నాగరికత హృదయాలను గెలుచుకొని, మనస్సుల్లో విప్లవాన్ని రేపి మనుషులను చెడు నుంచి మంచి వైపునకు మళ్ళించే ప్రయత్నాలు చేస్తుంది.

-: సమాప్తం :-

# తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

ఒక ధార్మిక సంస్థ. ప్రబోధనాత్మక కృషి జరుపుతున్న సంస్థ. పరిశోధనాత్మక గ్రంథాల ప్రచురణలు చేస్తున్న సంస్థ. మానవుడు తన సృష్టికర్తను మరచి, ఆయన మార్గదర్శకత్వాన్ని కానలేక, పెడదారులు తొక్కుతున్న ఈ రోజుల్లో, దాసునికి ప్రభు బాట చూపడానికి వెలిసిన సంస్థ. మానవుని నిజస్వామిని చేరే దారిని చూపే మహనీయులు దేవుని సందేశహరులు, దేవుని ప్రవక్తలు. వారి అడుగుజాడల్లో మనిషి నడవడానికి వీలుగా వారి ఉపదేశాలను విడమర్చి అందజేసే సంస్థ.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ - తెలుగువారికి అందిన ఆధ్యాత్మిక కరదీపిక. నైతిక ప్రమాణాల ధ్వజవాహిక. దీని వృద్ధి వికాసాలు మనందరి ధార్మిక బాధ్యత.

## TELUGU ISLAMIC PUBLICATIONS

**Sandesha Bhavanam, Lakkadkot,**
**Chatta Bazar, Hyderabad-500 002.**
**Phone: 4564583**
**Fax : +91 +040 + 4576237**
**e-mail : tiphyderabad@rediffmail.com**